www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 196 | శుక్రవారం | 5 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



ఉత్తరాదిలో ఉష్ణోగ్రతల పతనం

ఢిల్లీ - 5 | చండీగఢ్ - 3.2 | శ్రీనగర్ - మైనస్ 3.8 | లేహ్,కార్గిల్ - మైనస్ 10 డిగ్రీలు

ఉత్తర భారతాన్ని చలిపులి వణికిస్తోంది. ఢిల్లీ సహా అన్ని రాష్ట్రాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అతి శీతల గాలులకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మధ్యాహ్నమైనా కూడా చాలా ప్రాంతాల్లో సూర్యుడు కనిపించడం లేదు. విపరీతంగా మంచు కురియడంతో పాటు, పొగ మంచు కప్పేస్తుండడంతో రవాణా సేవలకు ఆటంకం ఏర్పడుతోంది. రైలు, విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలు సైతం ఎక్కువగా జరుగుతున్నాయి. తీవ్రమైన చలితో ప్రజల ప్రాణాలు పిట్టల్లా రాలిపోతున్నాయి. ఢిల్లీలో చలి విపరీతంగా వణికిస్తోంది. - వివరాలు 10లో


శ్రీనగర్‌లో హిమపాతం

ఇంకా తేలని తలాక్ బిల్లు భవితవ్యం 10

ఎంఆర్ కేసు నుంచి ఐఎఎస్ సుబ్రమణ్యంకు విముక్తి 3



పాత ఫీజులే

- ప్రైవేటు పాఠశాలల ప్రవేశ రుసుములపై యథాతథ స్థితి
- తిరుపతిరావు కమిటీ సిఫార్సులపై అధ్యయనం తరువాతే నిర్ణయం
- అంత వరకూ యాజమాన్యాలు ప్రస్తుత ఫీజులనే కొనసాగించాలని ప్రభుత్వం ఉత్తర్వులు

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో స్కూల్ ఫీజులపై ప్రభుత్వం నుంచి తుది ఆదేశాలు వెలువడే వరకు యథాతథ స్థితే కొనసాగుతుందని (పాత ఫీజులే) విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ప్రైవేట్ పాఠశాలల్లో 2018–19 విద్యా సంవత్సరానికి ఎల్‌కెజి, యుకెజి, ఒకటవ తరగతిలో ప్రవేశాలు చేపట్టేందుకు ఇప్పటికే షెడ్యూల్ జారీ చేసినందున తరువాయి 6లో

ఇసుక మాఫియాకు వీఆర్‌ఎ బలి

- అడ్డుకున్న గ్రామ రెవెన్యూ అధికారిపైనుంచి ట్రాక్టర్ నడిపించిన డ్రైవర్
- తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి
- కామారెడ్డి జిల్లాలో దారుణం

మన తెలంగాణ/ పిట్లం : ఇసుక తరలింపును అడ్డుకునేందుకు వెళ్లిన విఆర్‌ఎను ట్రాక్టర్ ఎక్కించి చంపేసిన ఘటన గురువారం కలకలం రేపింది. కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని కారెగాం గ్రామ శివారులో బుధవారం రాత్రి కాకివాగు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారం అందుకున్న విఆర్‌ఎ సాయిలు అక్కడికి చేరుకున్నారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే ట్రాక్టర్ డైవర్‌కు, సాయిలుకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన డైవర్ విఆర్‌ఎ సాయిలు పైనుంచి ట్రాక్టర్ తీసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పిట్లం ఎస్‌ఐ అంతిరెడ్డి హత్యకు సంబంధించిన వివరాలు సేకరించారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను, వాహనాన్ని అదుపులోకి తీసుకుని సాయులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం



భాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య సాయవ్వ, ఇద్దరు కూతురులు, ఒక కుమారుడు ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. కారెగాం గ్రామానికి చెందిన సాయిలు మార్థండ గ్రామంలో విఆర్‌ఎగా విధులు నిర్వహిస్తున్నారు.

అట్టుడికిన కారెగాం : విఆర్‌ఎ మృతి సంఘటనను తెలుసుకున్న కారెగాం ప్రజలు మృతుని కుటుంబ సభ్యులతో కలిసి న్యాయం చేయాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించారు. కారెగాం కాకివాడు నుంచి ప్రతిరోజు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగికి కూడా రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. సాయిలు భార్య పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఘటన గురించి ఎస్‌పిని ప్రభుత్వం వివరణ కోరినట్లు తెలిసింది.

పట్టపగలు అందరూ చూస్తుండగా..

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో నడిరోడ్డు మీద కత్తితో బెదిరించి సినిమా ఫక్కీలో స్కూటర్, పర్సు, సెల్‌ఫోన్‌తో పరారీ



మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో : పట్టపగలు... జన సంచారం... రద్దీగా వాహనాలు... ముగ్గురు దుండగులు కత్తితో వ్యక్తిపై దాడి... వాహనం, పర్సు, సెల్‌ఫోన్‌లు తీసుకుని పరార్...ఇది నగరంలోని జూబ్లీ హిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న దారి దోపిడీ ఘటన. ప్రజలు, వాహనదారులు చూస్తూ ప్రేక్షకపాత్ర పోషించారే తప్ప తమవంతుగా సామాజిక బాధ్యతను ప్రదర్శించలేదు. అందరూ తమకెందుకులే అనే విధంగా కొందరు వాహనాలు ఆపి, మరికొందరు పక్కగా నిలబడి సినిమాలోని సంఘటనను చూసినట్టుగా వ్యవహరించారు. ఓవైపు బాధితుడు దుండగులు చేస్తున్న దాడిని ప్రతిఘటిస్తున్నాడు. కానీ, వారు ముగ్గురుండటం, ఒకడు కత్తి చేతిలో పట్టుకుని హెచ్చరించడం, మరో ఇద్దరు వాహనాన్ని తీసుకుని కదలడంతో బాధితుడు చేసిన ప్రయత్నం ఫలించలేదు. వారు ఒకే వాహనంపై ఉడాయించారు. నగరంలో తీవ్ర కలకలం రేకెత్తించిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బేగంపేట్ శ్యాంలాల్ భవనం ప్రాంతంలో నివసించే యాదగిరి జూబ్లీహిల్స్ రోడ్ నెం.12లోని ఓ ప్రైవేట్ కంపనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతని సహోద్యోగి మిశ్రాతో కలిసి టిఎస్ 09 టిడబ్ల్యు 8970 నెంబర్ వాహనంపై రోడ్ నెం. 10లోని ఓ కార్యాలయంలో రూ.10 వేల చెక్‌ను ఇవ్వడానికి వెళ్లాడు. అయితే, మిశ్రా చెక్‌ను ఇవ్వాల్సిన కార్యాలయంలోకి వెళ్ళగా వాహనంపైనే యాదగిరి కూర్చుని ఉన్నాడు. ఇంతలో గుర్తుతెలియని ముగ్గురు దుండగులు వచ్చి అతనిని వాహనంపై నుండి నెట్టివేసి తరువాయి 6లో

దారి దోపిడీ లేకుండా

ఎకరాకు రూ.4 వేల నగదు నేరుగా రైతుకు అందించడం ఎలా?

- పలు పద్ధతులు పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- బ్యాంకుల్లో వేస్తే అప్పు కింద జమయ్యే ప్రమాదంపై యోచన

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఎకరానికి నాలుగు వేల రూపాయల పథకాన్ని విజయవంతంగా అమలు చేయడానికి ఉన్న మార్గాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లయితే పాత బకాయిల పేరుతో బ్యాంకులు మినహాయించుకునే ప్రమాదం ఉన్నందువల్ల ఆ పథకం స్ఫూర్తి నీరుగారిపోతుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ఇందుకోసం ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలపై అన్వేషణ ప్రారంభించింది. రూపే కార్డులను కొత్తగా జారీ చేయడమా, బ్యాంకు డి.డి.ల రూపంలో ఇవ్వడమా, చెక్కుల రూపంలో ఇవ్వడమా, నగదుగా అందించడమా, మొబైల్ వ్యాలెట్‌ల రూపంలో అందజేయడమా.. ఇలా అనేక కోణాల్లో అధికారుల స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. ఏది చేసినా పూర్తిగా నాలుగు వేల రూపాయలు రైతులకు ఖరీఫ్ పంటకు ఉపయోగపడేలా ఉండాలని, డబ్బులు పూర్తిగా సత్ఫలితాలు ఇచ్చేలా అమలు కావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ డబ్బును తొలుత రైతుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే పాత బకాయిల కింద బ్యాంకులు మినహాయించుకుంటే రైతులకు అవి అందవని, ఫలితంగా ఈ పథకం నీరుగారిపోతుందని నిర్ధారణకు వచ్చింది. దీంతో పటిష్ఠమైన అమలు విధానంపై దృష్టి సారించింది. అందులో భాగంగా గత వారంలో సచివాలయంలో ప్రత్యామ్నాయ విధానాలపై అధికారులు సమావేశమై చర్చించారు. అయితే స్పష్టతకు రావడానికి ముందు ఒక గ్రామంలో పైలట్ ప్రాతిపదికన అమలు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. సిద్దిపేట జిల్లా ఇబ్రహీంపూర్‌లో నగదు రహిత లావాదేవీల పథకం ఏ విధంగా విజయవంతమైందో వివరాలను సేకరించి దాన్నుంచి వచ్చిన స్పష్టతను బట్టి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి పైలట్ ప్రాతిపదికన ఈ నాలుగువేల రూపాయల పథకాన్ని అమలు చేయాలన్న అంచనాకు అధికారులు వచ్చారు. బ్యాంకుల తీరుతో నాలుగు వేల రూపాయల పథకం సత్ఫలితాలు ఇవ్వకపోవచ్చుననే ఆందోళనతో ఉన్న ప్రభుత్వం.. రైతులకు నేరుగా అందేలా, పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా ఉండడం కోసం పైలట్ ప్రాజెక్టుగా వచ్చే ఫలితాల అనంతరం స్పష్టమైన విధాన నిర్ణయం తరువాయి 6లో



కొత్త రూ.10 నోటు విడుదలకు రంగం సిద్ధం 9

కోడి పందేలను ఆపరేమీ?:హైకోర్టు 11

కుంచెపోటు



నా సమాచారం నువ్వు ఇవ్వు, నీ సమాచారం నేనిస్తా.. చెరొక ఐదొందలొస్తాయి!

ప్రియుడితో కలిసి భర్త హత్య

సహకరించిన వ్యక్తి ఆత్మహత్యా యత్నంతో వెలుగు చూసిన కుట్ర

మన తెలంగాణ/ హైదరాబాద్: భర్తతో సుఖంలేదని భావించిన ఓ భార్య తన ప్రియుడితో కలిసి హత్య చేయించింది. ఈ సంఘటన గత నెల 31 అర్ధరాత్రి న్యూ ఇయర్ వేడుకల సమయంలో జరిగింది. అయితే నిందితుల్లో ఒకరు నాలుగు రోజులుగా పడుతున్న భయాన్ని భరించలేక.. గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో హత్య ఘటన వెలుగు చూసింది. కర్మన్‌ఘాట్‌లో హత్య చేసి మృతదేహాన్ని చౌటుప్పల్ పరిధిలో పడేశామని తరువాయి 6లో



ప్యాక్స్‌ల పదవీకాలం పొడిగింపు?

- రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఏర్పాటు
- 1964 చట్టం 22వ నియమానికి సవరణ

మన తెలంగాణ/ హైదరాబాద్ : త్వరలో ముగియనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) పదవీ కాలాన్ని పొడిగించేందుకు ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. సహకార సంఘాలకు ప్రస్తుతమున్న పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి నాటికి ముగియనుంది. తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ (టెస్కాబ్) పాలకవర్గం పదవీ కాలం ఫిబ్రవరి 26, జిల్లా సహకార మార్కెటింగ్ సమాఖ్య (డిసిఎంఎస్)లు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి)ల పాలకవర్గాలు ఫిబ్రవరి 18న.. 906 ప్యాక్స్‌ల పదవీ కాలం ఫిబ్రవరి మొదటి వారంలో ముగియనుంది. వీటన్నింటికి ఎన్నికలు నిర్వహించాలంటే రెండు నెలల ముందే తరువాయి 6లో

24 గంటల విద్యుత్‌పై ప్రశంసల వర్షం

- అనేక రాష్ట్రాల ఆసక్తి
- గుజరాత్ అధికారుల నుంచి ఫోన్
- త్వరలో వస్తామని వెల్లడి



మన తెలంగాణ / హైదరాబాద్ : దేశంలోనే తొలిసారిగా వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను ఇచ్చి రికార్డు సృష్టించిన తెలంగాణ ప్రభుత్వానికి పలు రాష్ట్రాల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. ప్రభుత్వ విధానానికి అనుగుణంగా అధికారులు చేసిన కృషికి అభినందనలు కురుస్తున్నాయి. విద్యుత్ రంగంలో కష్టాలను అధిగమించి నిరంతరాయ విద్యుత్‌ను సరఫరా చేసే స్థాయికి చేరుకోవడంలో పడిన తరువాయి 6లో

లోపభూయిష్టంగా మోటర్ వెహికిల్ చట్ట సవరణ బిల్లు

మన తెలంగాణ/హైదరాబాద్: మోటర్ వెహికిల్ చట్ట సవరణ బిల్లుకు నిరసనగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలు, యూనిట్ల వద్ద భోజన విరామ సమయంలో ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్(ఇయు) ప్రకటించింది. ఎంప్లాయిస్ యూనియన్ '2018 క్యాలండర్'ను యూనియన్ గౌరవ అధ్యక్షులు టి.నరసింహన్ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ఇయు రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఇయు అధ్యక్షులు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహన్ మాట్లాడుతూ కార్మికుల స్థితిగతులను, వారి పరిస్థితులను, రహదారుల కండిషన్‌ను బాగు చేయకుండా మోటారు వెహికిల్ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టడం అన్యాయమని, ఈ బిల్లు లోపభూయిష్టంగా ఉన్నదన్నారు. బిల్లుపై కార్మిక సంఘాల సలహాలను స్వీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందకుండా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని కార్మికులను కోరారు. ఎస్.బాబు, కె.రాజిరెడ్డి మాట్లాడుతూ గుర్తింపు సంఘం నిర్లక్ష్యం వల్లనే ఆర్‌టిసి కార్మికుల వేతన సవరణ జరగడం లేదని విమర్శించారు.



మందకృష్ణ అరెస్టును ఖండించిన ఉత్తమ్

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఎంఆర్‌పిఎస్‌వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అక్రమ అరెస్టులను టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. అసెంబ్లీ సాక్షిగా స్వయంగా ముఖ్యమంత్రి కెసిఆర్ ఎస్‌సి వర్గీకరణకు కట్టుబడిఉన్నామని, త్వరలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని హామీ ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని ఆరోపించారు. దీంతో ఈ నెల 5న పార్లమెంటు సమావేశాలు ముగియనున్న నేపథ్యంలోనే మంద కృష్ణ మాదిగ దీక్ష చేపట్టేందుకు అనుమతి కోరినా తిరస్కించారని, ఆయనను వేలాది పోలీసులు వెళ్ళి అరెస్టు చేయడం దారుణమన్నారు.

కన్నీళ్లు మిగిల్చిన వరి

- దోమపోటుతో పెట్టుబడిలో సగం కూడా రాని వైనం
- తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు
- బీమా పరిహారంపైనే ఆశలు



మన తెలంగాణ/హైదరాబాద్ : వరికోతల్లో చేతికి వచ్చిన వడ్ల దిగుబడిని చూసి అన్నదాతలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఎన్నడూ లేని విధంగా దిగుబడి సగానికి పైగా పడిపోవడంతో పెట్టుబడిలో సగం సొమ్ము కూడా రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వ్యవసాయ శాఖ, పంటల బీమా కంపెనీలు సంయుక్తంగా నిర్వహించిన క్రాప్ కటింగ్ ఎక్స్‌పర్‌మెంట్స్ (సిసిఇ) లోనూ ఈ విషయం స్పష్టమైంది. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి పడిపోయినట్లు గుర్తించారు. బీమా చేసిన రైతులు కాస్త అయినా పరిహారం ఏమైనా వస్తుందని ఆశతో ఉండగా, బీమా చేయని రైతులకు దిక్కు తోచడం లేదు. ఈసారి వానకాలంలో బీమా పరిధిలోకి దాదాపు 9 లక్షల మంది రైతులు వచ్చినట్లు వ్యవసాయ వర్గాలు వెల్లడించాయి. ఇందులో 2 లక్షల మంది పత్తి రైతులు ఉండగా, దాదాపు 5 లక్షల మంది వరకు వరి సాగు చేసిన రైతులే ఉంటారని అధికారులు చెబుతున్నారు. అయితే రాష్ట్రంలో ఉన్న రైతులందరూ దాదాపు వరిని సాగు చేస్తున్నారు. ఈ లెక్కన 40 లక్షల మంది వరకు బీమా పరిధిలోకి రానట్లే. ఈసారి వానకాలంలో వరికి సుడిదోమ సోకిన విషయం తెలిసిందే. దీని ఫలితం దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపి, రైతుల కు నష్టాలను మిగిల్చింది. వానకాలంలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 23.35 లక్షల ఎకరాలు కాగా, 19.07 లక్షల ఎకరాల్లో సాగు నమోదైంది. ఇందులో 40 నుంచి 50 శాతం వరకు సన్న రకాలే సాగవుతాయి.ముఖ్యంగా బిపిటి 5204 వంటి సన్నరకాలు హెచ్‌ఎంటి సోనా, జైశ్రీరాం, ఆమన్, అంకుర, తెలంగాణ సోనా వంటి సన్నరకాలతోపాటు 1010, బతుకమ్మ, కూనారం సన్నాలు వంటి దొడ్డు (స్వల్పకాలిక) రకాల వరికి కూడా దోమపోటు ఆశించింది. ఒక్క జగిత్యాల్ జిల్లాలోనే 1,40, 965 క్వింటాళ్ల వరిధాన్యానికి నష్టం వాటిల్లినట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఏడాది నవంబర్ నెలలో ప్రత్యేకంగా చేసిన సర్వేలో వెల్లడైంది. రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల ఎకరాలు దోమపోటు బారీన పడి దిగుబడి కోల్పోయినట్లు అంచనా.

ముగిసిన బీమా గడువు

యాసంగి పంటలకు సంబంధించిన బీమా గడువు డిసెంబర్ 31వ తేదీతో ముగిసింది. కొన్ని పంటలకు ముందుగానే గడువు ముగియగా, వరికి డిసెంబర్ 31 చివరి తేదీగా విధించారు. అయితే రాష్ట్రంలో సాగైన పంటలు మాత్రం 40 శాతం దాటలేదు. పంట రుణాలు కూడా రూ. 17 వేల కోట్లకు గాను రూ. 3 వేల కోట్లు వరకే రైతు లకు అందాయని తెలిసింది. దీంతో బీమా చేసు కునే రైతుల సంఖ్య తగ్గుతుందని పరిశీలకులు భావిస్తున్నారు.



ఎకరా ఖర్చు రూ. 39300... రాబడి రూ. 17 వేలే!

రాష్ట్ర ప్రభుత్వం 2017లో కేంద్ర ప్రభుత్వానికి నివేదించిన వ్యవసాయ పంటల ఖర్చుల వివరాల ప్రకారం ఎకరా వరిని సాగు చేసేందుకు మొత్తంగా రూ. 39300 ఖర్చు అవుతోంది. కేంద్ర ప్రభుత్వం వరి సాధారణ రకానికి రూ. 1550 మద్దతు ధరగా ప్రకటించింది. సుడిదోమ సోకిన వరిలో ఎకరాకు 12 క్వింటాళ్ల వరకే దిగుబడి వస్తోంది. ఈ లెక్కన మొత్తం ఎకరాకు రూ. 17050 మాత్రమే అన్నదాతకు దక్కుతున్నాయి. అందులోనూ అన్నిచోట్ల మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదు. కొన్ని ప్రాంతాలలో క్వింటాకు రూ. 200 నుంచి రూ. 300 వరకు తగ్గించి కొనుగోళ్లు చేస్తున్నారు.

ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు

మన తెలంగాణ/హైదరాబాద్: తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న ఆదివాసీలపై మావోయిస్టులు అని ముద్ర వేస్తున్నారని, వేధింపులతో తమ ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆదివాసీల జెఎసి నాయకులు, మాజీ ఎంఎల్‌ఏలు సోయం బాబురావు, చందా లింగయ్య దొరలు ఆరోపించారు. ఆదివాసీలకు అన్యాయం చేస్తూ లంబాడీలకు మేలు చేసేందుకు ప్రయత్నిస్తున్న గిరిజన శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని, అధికారులను బదిలీ చేసినంత మాత్రానా సమస్య పరిష్కారం కాదన్నారు. ఆదివాసీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకుంటే ఈ నెల 15 తర్వాత తమ కార్యాచరణను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఎసి ప్రతినిధులు మాజీ ఎంఎల్‌ఏలు చందా లింగయ్యదొర, సోయం బాబురావు, ప్రతినిధులు నారాయణదొర, వినాయక్, నిరుద్యోగుల జెఎసి నేతలు కొడెం రామనాథంలు మాట్లాడారు. లంబాడిలను ఎస్‌టి జాబితా నుంచి తొలగించాలని,ఆదివాసిలకు కేటాయించిన పోస్టులలో భర్తీచేసిన లంబాడిలను తొలగించాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సింగరేణి కంపెనీలో ఖాళీగా ఉన్న 665 బ్యాక్‌లాగ్ పోస్టులను ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఆదివాసిలకే ఇవ్వాల్సి ఉండగా, అందుకు భిన్నంగా మైదాన ప్రాంతానికి చెందిన గిరిజనులకు అవకాశం కల్పించడం అన్యాయమని సోయంబాబురావు, చందాలింగయ్యదొర, వినాయక్ విమర్శించారు. 2014లో 665 గిరిజన బ్యాక్‌లాగ్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారని, కొందరు లంబాడ ప్రజాప్రతినిధుల ఒత్తిడికి సింగరేణి యాజమన్యాం తలొగ్గి అన్ని ఏరియా గిరిజనులను అర్హులు గా ప్రకటిస్తూ మరో నోటిఫికేషన్ జారీ చేశారని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో సింహభాగం పోస్టులలో లంబాడీలను నియమించేందుకు సింగరేణి తలమునకలైందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోనే ఉంటున్నామని కొందరు తప్పుడు ధృవీకరణ పత్రాలతో కానిస్టేబుల్ ఉద్యోగాలలో చేరారని, దీనిపై వెంటనే విచారణ జరిపి వారిని ఉద్యోగాల నుంచి తొలగించి, ఆదివాసీలకు అవకాశం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

21న హన్మకొండలో బహిరంగ సభ

మనతెలంగాణ / హైదరాబాద్ : వరంగల్ డిక్లరేషన్‌కు 20 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ , తెలంగాణ పౌరహక్కుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న వరంగల్ జిల్లా హన్మకొండలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు పౌర హక్కుల సంఘాల నాయకులు తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పౌరహక్కుల సంఘం సీనియర్ నేత వరవర రావు, రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. లక్ష్మ ణ్, ప్రజాస్వామిక వాదులు ప్రొ. హరగోపాల్, ఉ. సాంబశివరావు, ఎన్. నారాయణ రావు తది తరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 60 డిమాండ్లతో కూడిన వరంగల్ డిక్లరేషన్‌లో భూ నిర్వాసితులు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళలు, నిధులు నీళ్ల నియామకాలు వంటి ఎన్నో అంశాలు ఉన్నాయన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఎంతో చరిత్ర గల్గిన వరంగల్ డిక్లరేషన్‌కు 20 ఏళ్లు నిండుతున్న సందర్భంగా వరంగల్ డిక్లరేషన్ పాత్రను చాటి చెప్పాల్సిన అవసరం ఉందని వరవర రావు అన్నారు. తెలంగాణ సాధించుకున్న పాలకులు చేస్తున్న నిర్బంధాలు ఈ సమావేశంలో చర్చకు వస్తాయన్నారు. సాంబశివరావు మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం, ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రస్తుత పాలక పార్టీ ఆనాడు ఎన్నికల్లో చెప్పిందని, దీనికి ప్రజలకు మద్దతుగా నిలిచి అధికారం అప్పగించారని అన్నారు. ప్రొ. హర గోపాల్ మాట్లాడుతూ ప్రజల కష్ట నష్టాలను ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్తే సరిదిద్దుకోవాల్సింది పోయి.. ధర్నా చౌక్‌లను తరలించడం, ప్రజలతో సంబంధాలను కొనసాగించక పోవడం సరైన చర్య కాదన్నారు. ప్రొ. లక్ష్మ ణ్ మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం సాగిన నాటి సాయుధ పోరాట ఉద్యమం, వరంగల్ డిక్లరేషన్ పై హన్మకొండలో బహిరంగ సభను నిర్వహించి తీరుతామని, ప్రభుత్వం, పోలీసులు ఎవరెన్ని రకాలుగా అడ్డుకునేందుకు యత్నించినా ప్రజలే వారికి బుద్ధి చెబుతారన్నారు.

తక్షణమే మెట్రో పనులు పూర్తి!

- ఓల్డ్ సిటీ మెట్రో రైల్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్



మన తెలంగాణ/హైదరాబాద్/ పంజాగుట్ట: పాత నగరంలో నత్తనడకన కొనసాగుతున్న మెట్రో రైల్ నిర్మాణ పనులు తక్షణమే చేపట్టేలా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేశారు. గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓల్డ్ సిటీ మెట్రో రైల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మెట్రో రైల్ కోసం ఉద్యమిద్దాం— పాత నగర అభివృద్ధికి బాటలు వేద్దాం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సిపిఐ నాయకులు నర్సింహ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వీ.హనుమంతరావు ,సీపీఐ నేత నారాయణ ,ఖైరతాబాద్ ఎంఎల్‌ఏ చింతల రామచంద్రారెడ్డి లతో పాటు పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు.

పాత బస్తీలో మెట్రో రైల్ నిర్మాణ పనులను ప్రభుత్వం వెంటనే యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పాత బస్తిలో ప్రజలు రోడ్డు రవాణాపై పూర్తిగా ఆధారపడ్డారని, దీంతో వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం మెట్రోరైల్ నిర్మాణ పనులను ప్రజలకు పూర్తిచేసి వెంటనే వారికి అందుబాటులోకి తేవాలని కోరారు. నగర అభివృద్ధి కోసం 2300 కోట్లు కేటాయించామని చెబుతున్న ప్రభుత్వం పాతనగరంలో మెట్రో పనుల విషయంలో ఎందుకు తాత్సారం చేస్తుందని ప్రశ్నించారు. సమైక్య పాలకుల నుంచి తెలంగాణకు విముక్తి కల్గినా పాతబస్తీకి మాత్రం ఓవైసీ కుటుంబం నుంచి మాత్రం విముక్తి కల్గించలేకపోతున్నారని అన్నారు. పాత బస్తీకి అక్బరుద్దీన్ సోదరులు అనధికారక ముఖ్య మంత్రి, ఉపముఖ్యమంత్రులుగా చెలామణి అవుతున్నారని మండిపడ్డారు. పాతబస్తీ అభివృద్ధికి అడ్డుపడుతుంది వారేనని అన్నారు.. ఈ అంశంపై వారి పార్టీలో రెఫరెండం నిర్వహించినా అధిక శాతం వారికి వ్యతిరేకంగా ఓటు వేయడంతో పాటు మెట్రోకు అనుకూలంగా ఓటు వేస్తారని అన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం స్వార్థ రాజకీయాలను మానుకోవాలని, వెంటనే పాత నగరంలో మెట్రో నిర్మాణ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. చార్మినార్ ,మక్కామసీదు ,ఫలక్‌నుమా ప్యాలెస్,గోల్కొండ ,చౌమహల్ల ప్యాలెస్ ,సాలర్‌జంగ్ మ్యూజియం వంటి పర్యాటక ప్రదేశాలు ఎన్నో ఉన్నా మెట్రో నిర్మాణం చేపట్టక పోవడం వెనుక ఉన్న మతలబేమిటో ప్రభుత్వమే ప్రజలకు చెప్పాలన్నారు . పాత బస్తీ అభివృద్ధి చెందాలంటే మెట్రో నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని వారు కోరారు. వెంటనే ఈ విషయంలో ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి మెట్రో పనులను ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రమేష్ ,వెంకటేశ్ ,భాస్కర్ ,సోమయ్య ,రూప్‌రావు , ధీరజ్ ,శివ తదితరులు పాల్గొన్నారు.

జైలులో పెట్టడడం ప్రజాస్వామ్యమా?



మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ ప్రజల హక్కుల విషయంలో గవర్నర్ జోక్యం చేసుకోవాలని బిజెఎల్‌పి నేత జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నదని, కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం అది మృగ్యమైందని, ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కూడా గవర్నర్‌పైనే ఉన్నదన్నారు. వివిధ అంశాలపై సిఎం కెసిఆర్‌తో గంట సేపు సమావేశమయ్యే గవర్నర్, ప్రజలకు నిరసన తెలిపే హక్కుపై కూడా ఆయనతో మాట్లాడాలన్నారు. హైకోర్టు తీర్పు మేరకు నాలుగు శాతం ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేసి, రాజ్యాంగబద్ధంగా గిరిజనులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో బిజెపి నేతలు రఘునంధన్, డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, మాధవిచౌదరి, సుధాకర్ శర్మతో కలిసి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు టిఆర్‌ఎస్ ప్రభుత్వంపై బిజెపి యుద్ధం చేస్తుందని, దీనికి అన్ని ప్రజాసంఘాలు కూడా కలిసి రావాలని కోరారు. రిజర్వేషన్ల అంశంలో ఢిల్లీలో యుద్ధం చేసేందుకు, జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేసేందుకు కెసిఆర్ అవకాశం ఉన్నప్పుడు, తమ హక్కుల సాధన కోసం హైదరాబాద్‌లో స్థలం ఎందుకు నిరాకరిస్తున్నారని ప్రశ్నించారు. మతపరమైన రిజర్వేషన్లు చెల్లుబాటు కావని హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించిందని, ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్‌సి,ఎస్‌టిలకు జనాభా నిష్పత్తి ప్రకారమే రిజర్వేషన్లు అమలు చేయాలని రాజ్యాంగం స్పష్టం చేసిందని, ఈ అంశం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదేనని, దీనిని వెంటనే అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, ప్రశ్నిస్తున్నందుకే ఆయనను ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తుందని మందకృష్ణమాదిగను జైలులో పెట్టడం ప్రజాస్వామ్యమా..? అని ప్రశ్నించారు.

మన తెలంగాణ
3
హైదరాబాద్
శుక్రవారం
5, జనవరి 2018
www.manatelangana.news



సినిమా టికెట్ ధరల పెంపునకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

మన తెలంగాణ/ హైదరాబాద్ : సినిమా టిక్కెట్ ధరల పెంచేందుకు థియేటర్ యజమానులకు హైకోర్టు అనుమతి ఇస్తూ మధ్యంత ఆదేశాలు జారీ చేసింది. టిక్కెట్ల రేట్ల పెంపుపై నిర్ణయం తీసుకునేందుకు ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు కమిటీలు ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకునేలోగా థియేటర్ యాజమాన్యాలు రేట్లు పెంచుకోవచ్చునని గురువారం హైకోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్ స్పష్టం చేశారు. అయితే పెంచి రేట్లకు అనుగుణంగా పన్నుల చెల్లింపు కూడా ఉండాలన్నారు. హైకోర్టు షరతుల్ని థియేటర్ యాజమాన్యాలు అమలు చేస్తున్నాయో లేదో జాయింట్ కలెక్టర్లు పరిశీలన చేయాలన్నారు. ప్రభుత్వం టిక్కెట్‌రేట్లపై కమిటీ వేసి నిర్ణయం తీసుకోవాలని గతంలో హైకోర్టు రెండు రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కమిటీల ఏర్పాటు/నిర్ణయం జాప్యం కావడంతో రెండు రాష్ట్రాలకు చెందిన థియేటర్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. కమిటీల నిర్ణయం వెలువడే వరకు టిక్కెట్ల రేట్ల పెంపుదలకు అనుమతించాలని కోరడంతో అందుకు న్యాయమూర్తి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వాలు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయమూర్తి ఆదేశిస్తూ విచారణను ఫిబ్రవరి 1కి వాయిదా వేశారు.

'పాలమూరు'పై ప్రత్యేక దృష్టి

● తొలుగుతున్న ఆటంకాలు ● సాగుతున్న ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు

మన తెలంగాణ/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు కీలక అనుమతులు వచ్చిన దరిమిలా ప్రభుత్వం ఇకపై పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై దృష్టి పెట్టనుంది. గ్రీన్ ట్రిబ్యునల్ కేసులు, అటవీ భూముల్లో ఇబ్బందుల కారణంగా పాలమూరు ప్రాజెక్టుకు కొన్ని ఆటంకాలు ఎదురయ్యాయి. ప్రస్తుతం గోదావరి నదిపై కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోస్తూ ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేయడానికి ప్రభుత్వం పనులు వేగవంతం చేసిన సంగతి తెలిసిందే. దీంతోనే కీలకమైన హైడ్రాలజీ, అటవీ శాఖ మొదటి, రెండో దశ అనుమతులు, అంతర్రాష్ట్ర, భూగర్భ జలశాఖ అనుమతులు, పర్యావరణ అనుమతులన్నీ రెండు నెలల్లోనే వచ్చాయి.

అటవీ, పర్యావరణ, అంతర్రాష్ట్ర అనుమతుల కిరికిరిలోకి ప్రాజెక్టు వెళ్లిందంటే, అది అంతే సంగతులు అన్నట్లుగా గత చరిత్ర రుజువు చేసింది. కానీ ఈ చరిత్రను తెలంగాణ ప్రభుత్వం తిరగరాసింది. దశల వారీగా చేయాల్సిన పనులన్నీ చేస్తూ, కేంద్ర అధికారుల అనుమానాలను నివృత్తి చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ హరిరాం నెల రోజులకు పైగా డిల్లీలోనే మకాం వేశారు. దీనికి తోడు మంత్రి హరీశ్‌రావు, ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి ఎప్పటికప్పుడు కేంద్ర మంత్రులు, అధికారులతో మాట్లాడడంతో కాళేశ్వరం అనుమతులు వేగంగా వచ్చాయి. ఈ అనుభవం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు ఉపయోగపడుతుంది. కాళేశ్వరంతో ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం అయితే, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలతో దక్షిణ తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. పాలమూరు ప్రాజెక్టుపై పలు కేసు లు గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఉన్నాయి. తాగునీటికి సంబంధించిన పనులు తాత్కాలికంగా చేసుకోవాలని ట్రిబ్యునల్ ఆదేశాలు ఇవ్వడంతో ప్రస్తుతానికి పనులు నడుస్తున్నాయి. రూ. 35,500 కోట్ల అంచనాతో శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి రోజుకు 2 టిఎంసిల చొప్పున 60 రోజుల పాటు నీటిని తీసుకొని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 16 లక్షల ఎకరాలకు తాగు, సాగునీరిచ్చేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. శ్రీశైలం జలాశయం సమీపంలో నార్లాపూర్ వద్ద నిర్మించే రిజర్వాయర్ నుంచి ఒక వైపు ఏదుల రిజర్వాయర్‌కు, మరో వైపు ఉల్పర రిజర్వాయర్‌కు నీరు వెళ్లేలా డిజైన్ల రూపకల్పన జరుగుతోంది. డిండి రిజర్వాయర్‌కు నీటిని నార్లాపూర్ నుంచే తీసుకుంటున్నారు. ఇక్కడి నుంచి వెళ్లే నీరు ఉల్పర రిజర్వాయర్ మీదుగా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో సా గు, తాగునీటికి మళ్లిస్తారు. పాలమూరు ఎత్తిపోతలకు 90 టిఎంసిలు, డిండి ఎత్తిపోతలకు 30 టిఎంసిల నీటిని మళ్లిస్తారు. హైదరాబాద్‌కు తాగునీటి సరఫరా కూడా ఇక్కడి నుంచే జరుగుతుంది. దీనికి తోడు భవిష్యత్తులో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల నుంచే మిషన్ భగీరథకు నీటి ని సమకూరుస్తారు. ఇలా కరవు పీడిత పాలమూరుకు, ఫ్లోరైడ్ పీడిత నల్లగొండకు, తెలంగాణ జీవనాడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు తాగు, సాగునీటిని సమకూర్చే ఈ ప్రాజెక్టుకు అనుమతుల ఇబ్బందుల్లో కూరుకుపోవద్దన్న ది మంత్రి హరీశ్‌రావు ఆలోచనగా తెలుస్తోంది. తొలి ప్రాధాన్యతగా కాళేశ్వరంను గట్టెక్కించిన నేపథ్యంలో ఇకపై తమ శక్తియుక్తులన్నీ పాలమూరు ఎత్తిపోతలపైనే పెట్టనున్నారు. ప్రాజెక్టుకు ప్రాణం లాంటి నార్లాపూర్ పంపుహౌజ్, రిజర్వాయర్ పనుల వద్ద అటవీ శాఖ భూములకు సంబంధించిన సరిహద్దు గొడవలతో పనుల్లో వేగం తగ్గింది.



సహకార సంఘాల ఎన్నికలు ఎప్పుడు?



మన తెలంగాణ/హైదరాబాద్ : సహకార ఎన్నికల సంఘాల ఎన్నిక లు ఎప్పుడు నిర్వహిస్తారో స్పష్టమైన ప్రకటన చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సహకార ఎన్నికలు వాయిదా పడుతున్నట్లు పత్రికలలో వార్తలు వచ్చాయని, సహకార ఎన్నికలు ఎందుకు వాయిదా వేస్తున్నారో, అందుకు కారణాలేమిటో చెప్పాలన్నారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు గురువారం ఒక లేఖ రాశారు. గత ప్రభుత్వం లాగానే టిఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా సహకార ఎన్నికలను వాయిదా వేయాలని ఆలోచించడం అన్యాయమని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 4వ తేదీతో సింగిల్ విండో సంస్థల పదవీ కాలం ముగియనుందని, వాటికి ఎన్నికల నిర్వహణపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి స్పష్టత లేదన్నారు. సహకార వ్యవస్థ ప్రజల ఆర్థిక పునాదులకు బాటలు వేసినప్పటికీ ఈ రంగంలో రాజకీయాల వల్ల వ్యవస్థ కలుషితమై పోయిందని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సహకార రంగంలో కొత్త మార్పులకు శ్రీకారం చుడుతున్నట్లు భావించామని, అలాంటి ఆలోచనలకు ప్రభుత్వం తిలోదకాలు ఇస్తున్నదన్నారు.

17న ఆరోగ్య పథకాల వర్కర్ల సమ్మె

మన తెలంగాణ/హైదరాబాద్ : కేంద్ర ప్రాయోజిత ఆరోగ్య పథకాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది జనవరి 17న ఒక రోజు సమ్మె చేపట్టనున్నారు. దీర్ఘకాలికంగా డిమాండ్ల పరిష్కారం కోసం వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్న సిబ్బంది డిమాండ్ల సాధన కోసం ఒక రోజు సమ్మె చేయాలని నిర్ణయించింది. సమ్మె నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ అధీనంలోని వివిధ పథకాల్లో పని చేస్తున్న వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెలో పాల్గొంటున్నారు. దేశవ్యాప్తంగా సమ్మెలో భాగంగా రాష్ట్రంలో జరిగే సమ్మెలో పాల్గొనాలని నిర్ణయించిన తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌కు సమ్మె నోటీస్‌ను అందజేసింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.యాదానాయక్, ప్రధాన కార్యదర్శి కె.బలరాంలు మాట్లాడుతూ, 45వ భారత కార్మిక సదస్సు సిఫారసులను అమలు చేయాలని, స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 10వ పిఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచాలని, స్కీంలను ప్రైవేటీకరణ చేయరాదని, బడ్జెట్‌లో స్కీంలకు అవసరమైన నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. రెండవ ఎఎన్‌ఎంలకు సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని, మహిళా ఉద్యోగులకుక వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, బదిలీలకు అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

జూన్ నాటికి కిచెన్ షెడ్ల నిర్మాణం పూర్తి

మనతెలంగాణ/హైదరాబాద్ : మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మిస్తున్న కిచెన్ షెడ్లు వచ్చే జూన్ నాటికి పూర్తి కానున్నాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,080 షెడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. కిచెన్ షెడ్లు లేని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కోసం ఆరు బయటే వంట చేస్తున్నారు. దాంతో కార్మికులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు కూడా అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 7,080 కిచెన్ షెడ్ల నిర్మాణం చేపట్టారు. 200లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో 186 చదరపు గజాల విస్తీర్ణంలో రూ.2 లక్షల వ్యయంతో నిర్మిస్తుండగా, 200పైన విద్యార్థులున్న పాఠశాలల్లో 251 చదరపు గజాల విస్తీర్ణంలో రూ.2.5 లక్షల వ్యయంతో కిచెన్ షెడ్లు నిర్మిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ 55 శాతం, ఎన్‌ఆర్‌ఇజిఎస్ నుంచి 45 శాతం వాటాతో కిచెన్ షెడ్ల నిర్మాణం చేపడుతున్నారు.

టారిఫ్‌పై అభ్యంతరాలకు 23 వరకు గడువు

మన తెలంగాణ/హైదరాబాద్: కొత్త విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై జనవరి 23 లోపు అభ్యంతరాలు తెలపాలని తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ ప్రకటించింది. 2018–19లో టారిఫ్‌తో పాటు క్రాస్ సబ్సిడీ సర్‌చార్జి, అదనపు సర్‌చార్జి ప్రతిపాదనలను డిస్కంలు ఇటీవలే ఇఆర్‌సికి సమర్పించాయి. దీనిపై బహిరంగ విచారణ జరగడానికి ముందుగా అభ్యంతరాలకు కమిషన్ 23వ తేదీ వరకు గడువునిచ్చింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త చార్జీలు అమలులోకి వస్తాయి.

రాష్ట్రంలో తుగ్లక్ పాలన :రేవంత్



మన తెలంగాణ/హైదరాబాద్ : ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం ఏ జిల్లాలో ఉందనే విషయం రాష్ట్రస్థాయిలోని సీనియర్ ఐఎఎస్ అధికారులకు కూడా తెలియకపోవడం రాష్ట్రంలో కొనసాగుతున్న తుగ్లక్ పాలనకు నిదర్శనమని కాంగ్రెస్ నేత ఎ.రేవంత్ రెడ్డి ఎద్దేవా చేసారు. గజ్వేల్‌లోని 50 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మార్చడంతోపాటు దాని స్థాయిని ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఈనెల 3వ తేదీన జీవో ఆర్.టి. నెంబర్ 5ను జారీ చేసింది. ఈ జీవోలో ఒకచోట గజ్వేల్ మెదక్ జిల్లాకు చెందిందిగా పేర్కొంటూ మిగిలిన చోట గజ్వేల్ నే జిల్లాగా పేర్కొంటూ ఆ జీవో ప్రతులను గజ్వేల్ జిల్లా కలెక్టర్, గజ్వేల్ జిల్లా ఆస్పత్రుల కో ఆర్డినేటర్,గజ్వేల్ జిల్లా ఖజానా అధికారికి పంపుతున్నట్లుగా పేర్కొన్నారు. ముఖ్యమైన జీవో, అది కూడా సిఎం నియోజకవర్గానికి చెందిన ప్రధానమైన జీవో విషయంలో దొర్లినతప్పులపై మీడియాలో వార్తలు వెలువడ్డాయి.ఈ నేపథ్యంలో రేవంత్ ఈ ట్వీట్ చేశారు.

ఈటలది అధికార దుర్వినియోగం

మన తెలంగాణ/ హైదరాబాద్: ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని టిపిసిసి అధికార ప్రతినిధి కొనగాల మహేశ్ ఆరోపించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రి రాజేందర్ తన వియ్యంకుడు వెంకటరామిరెడ్డి హార్టీ కల్చర్ విభాగం అడిషనల్ డైరెక్టర్‌గా పదవి విరమణ చేసిన రోజే అదే విభాగంతో పాటు, సెరికల్చర్,నాబార్డ్‌తో కలిపి డైరెక్టర్ హోదాతో నియమించారని తెలిపారు. ఇప్పటికే రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవద్దని ఆర్థిక శాఖ ఆదేశాలు ఉన్నాయని, అయినప్పటికీ మంత్రి తన వియ్యంకుడిని డైరెక్టర్‌గా నియమించారని అన్నారు. ఈ మేరకు జారీ చేసిన జిఓ 57పై కోర్టుకు వెళ్తామని మహేశ్ హెచ్చరించారు. కెసిఆర్‌కు నచ్చితే ప్రమోషన్ లేదంటే డిమోషన్ అని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వకుండా అధికార పార్టీ నేతలు తమ బంధువులకు మాత్రం ఉద్యోగాలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు.

సుబ్రమణ్యంపై కేసు కొట్టివేత

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో సీనియర్ ఐఎఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యంపై సీబీఐ పెట్టిన కేసును హైకోర్టు కొట్టివేసింది. ఏపీ క్రీడలు, యువజన సర్వీసుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ హోదాలో ఆయన పనిచేస్తున్నారు. మౌలిక సదుపాయల కల్పనా సంస్థ ఎండి ఉండగా ఎమ్మార్‌కు భూముల కేటాయింపుల్లో ఆయనపై పాత్రపై సీబీఐ దాఖలు చేసిన కేసులో ఆధారాలు లేవని హైకోర్టు న్యాయమూర్తి శివశంకర్‌రావు గురువారం తీర్పు చెప్పారు. భూ కేటాయింపుల్లో ఎండీగా ఆయన పాత్ర లేదని, ప్రభుత్వమే భూకేటాయింపులు జరిపిందని 170 పేజీల తీర్పులో హైకోర్టు పేర్కొంది.

అక్రమాలను అడ్డుకుంటే అధికారులకు బదిలీ గిఫ్ట్

మన తెలంగాణ/ హైదరాబాద్ : అధికార పార్టీ ఎంఎల్‌ఏల అక్రమాలను అడ్డుకున్న కలెక్టర్‌లకు సిఎం కెసిఆర్ బదిలీ గిఫ్ట్ ఇచ్చారని సిఎల్‌పి ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 24 గంటల విద్యుత్ సరఫరాపై కాంగ్రెస్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై మంత్రి జగదీశ్‌రెడ్డి నోటికొచ్చినట్లు విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల కృషి తోనే 24 గంటల విద్యుత్ సాధ్యమైందని, దీనిపై కెసిఆర్ సర్కార్ స్వంత డబ్బా కొట్టుకుంటోందని ఆరోపించారు. రైతులకు డ్రై రన్ ప్రొటెక్టర్ ను ప్రభుత్వం ఉచితంగా రైతులకు అందించాలని, ఆటోమేటిక్ స్టార్టర్స్ తొలగొంచాలని కోరారు. తక్షణమే వ్యవసాయం, విద్యుత్ అంశాలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

'కృష్ణ' త్రిసభ్య సమావేశం వాయిదా

మన తెలంగాణ/హైదరాబాద్: కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం జనవరి 10వ తేదీకి వాయిదా పడింది. ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సి ఎం.వెంకటేశ్వరరావు పోలవరం ప్రాజెక్టు సంబంధించిన పనుల్లో తీరికలేకుండా ఉండడంతో సమావేశం వాయిదాపడింది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నీటి మట్టం రోజురోజుకూ తగ్గిపోతున్న నేపథ్యంలో త్రిసభ్య కమిటీ సమావేశం కీలకంగా మారింది. బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం, తెలంగాణ, ఎపి ఇఎన్‌సిలు మురళీధర్, వెంకటేశ్వరరావుతో చర్చలు జరిపి 10వ తేదీకి సమావేశాన్ని వాయిదా వేశారు.

టిడిపికి పూర్వవైభవం తీసుకొద్దాం

మన తెలంగాణ/హైదరాబాద్ : టిడిపికి పునర్వైభవం తీసుకొద్దామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ అన్నారు. ఎన్‌టిఆర్ భవన్‌లో గురువారం పార్టీ శిక్షణ తరగతుల మొదటి బ్యాచ్‌ను రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రారంభించిన నాడు మొదటి శిక్షణ తరగతులలో పాల్గొన్నవారు మంత్రులుగా ఎలాగైతే ఎదిగారో అలాగే ఇప్పుడు రాష్ట్రంలో మొదటి బ్యాచ్ శిక్షణలో పాల్గొన్న వాళ్లు కూడా ఎదగాలని ఆకాంక్షించారు. తాము 136 మందిని శిక్షణ తరగుతులకు ఎంపిక చేస్తే 124 మంది వచ్చారని, పార్టీపై ఉన్న అంకితభావానికి ఇది నిదర్శనమన్నారు. 1983కు ముందు కొద్ది మంది పెత్తందార్ల చేతుల్లో రాజకీయ అధికారం ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులే రాష్ట్రంలో ఉన్నాయన్నారు. పొలిట్‌బ్యూ రో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగను జైల్లో పెట్టారని, అణగదొక్కాలనుకుంటే అంతే ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. పార్టీలో ఉండి పేరు, ఆస్తులు సంపాదించుకున్నవారే వెళ్లిపోయారని, రాబోయే ఎన్నికల్లో వారికి ప్రజలు గుణపాఠం చెబుతారని పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.నేతలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, బక్కని నర్సింహులు, రమావత్ లక్ష్మణ్ నాయక్, ఎం. అమర్‌నాథ్‌బాబు, సామ భూపాల్ రెడ్డి, పాల్వాయి రజనీకుమారి, జి. బుచ్చిలింగం, నన్నూరి నర్సిరెడ్డి పాల్గొన్నారు.



అసంఘటిత కార్మికులుగా గుర్తిస్తాం?

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలోని అన్ని రకాల ద్విచక్ర వా హనాల మెకానిక్‌ల సమస్యలను పరిష్కరిస్తూ అసంఘటిత కార్మి కులుగా గుర్తించేందుకు కృషి చేస్తామని రవాణ శాఖ మంత్రి పి. మహేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆల్ టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు తోడేటి బాబు, ప్రధాన కార్యదర్శి మల్లేశం, టిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్ సింగ్‌లు గురువారం మంత్రిని కలిసి సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. మెకానిక్ కార్మికులకు భవన నిర్మాణ కార్మికుల తరహాలో గుర్తింపునిచ్చి అన్ని సదుపాయాలను కల్పించేందుకు ముఖ్యమంత్రికి నివేదిస్తామని ఈ సందర్భంగా మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ సొసై టీ నేతలు అశోక్ రెడ్డి, రమేష్, వసంత్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

టిఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

మన తెలంగాణ/హైదరాబాద్ : రాజాపూర్ మండలం ఖానాపూర్ గ్రామ శివారు సోంల నాయక్ తండాకు చెందిన కాంగ్రెస్, టిడిపి నాయకులు, కార్యకర్తలు టిఆర్‌ఎస్‌లో చేరారు. నగరంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి నివాసంలో మంత్రి సమక్షంలో దాదాపు 20 మంది నాయకులు, కార్యకర్తలు టిఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై టిఆర్‌ఎస్‌లో చేరినట్టు వారు తెలిపారు. జడ్చర్ల నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి పాటు పడతామని వారు అన్నారు.

'నీటిసాయం'కోరిన కర్ణాటక

● సిఎంతో చర్చించాకే నిర్ణయం :హరీశ్‌రావు



మన తెలంగాణ/హైదరాబాద్: తుంగభద్రలో తెలంగాణ వాటాను కర్ణాటక తాగునీటి అవసరాలకు వాడుకునేందుకు అనుమతించాలని కోరుతూ కర్ణాటక జలవనరులశాఖ మంత్రి పాటిల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నాడు జలసౌధలో రెండు రాష్ట్ర ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. తుంగభద్ర డ్యాం నుంచి తెలంగాణకు 3.5 టిఎంసిల నీటి వాటా ఉందని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టుకు అవసరమయ్యే నీటి వినియోగంపై, కర్ణాటకకు ఎంత మేర అనుమతించగలమనే అంశాలపై ఇరు రాష్ట్ర ప్రతినిధుల మధ్య చర్చ సాగింది. ఆలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 7 వేల ఎకరాల ఆరు తడి పంటలకు అవసరమైన సాగునీటి వాడకంపై రెండు రాష్ట్రాల ఇంజనీర్లు అంచనా వేసిన అనంతరం, మిగిలిన నీటిని కర్ణాకట వాడుకునే అంశాన్ని పరిశీలిస్తామని మంత్రి హరీశ్‌రావు కర్ణాటక మంత్రికి తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌తో చర్చించాక తమ నిర్ణయం చెబుతామని హరీశ్ స్పష్టం చేశారు. తుంగభద్ర నీటిని వాడుకున్న దానికి బదులుగా తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడు కోరినా నారాయణపూర్ డ్యాం నుంచి జూరాలకు 2 టిఎంసిల నీటిని విడుదల చేస్తామని కర్ణాటక హామీనిచ్చింది. గత సంవత్సరం కూడా మహబూబ్‌నగర్ జిల్లా తాగునీటి అవసరాల కోసం తాము నారాయణ్‌పూర్ రిజర్వాయర్ నుంచి ఒక టిఎంసి నీటిని విడుదల చేసిన విషయాన్ని పాటిల్ గుర్తుచేశారు. ఆలంపూర్ నియోజకవర్గంలో పంటలు కాపాడుకుంటూనే, కర్ణాటకకు తుంగభద్ర నీటిని వాడుకునేందుకు అనుమతిచ్చే విషయంలో తనకు అభ్యంతరం లేదని ఆలంపూర్ ఎంఎల్‌ఎ సంపత్ స్పష్టం చేశారు. రాజోలి బండ డైవర్షన్ పథకం ఆధునీకరణ పనులపై త్వరలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల ఉమ్మడి సమావేశం నిర్వహించాలని తెలంగాణ, కర్ణాటక నిర్ణయించాయి.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల ప్రాంతం రైతాంగానికి 87 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో ఆర్డీఎస్ నిర్మించినా, ప్రస్తుతం 20 వేల ఎకరాలకు కూడా సాగునీరు అందడం లేదని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఆధునీకరణ పనులు ప్రారంభమైనా, ఇప్పటికీ పనులు పూర్తికాలేదన్నారు. పనుల పూర్తికి కావాల్సిన నిధులను ప్రభుత్వం సమకూర్చడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆరు నెలల వర్కింగ్ సీజన్లో పనులు పూర్తిచేయాలని మంత్రి హరీశ్ సూచించగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారం లేకుండా ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు పూర్తికావని కర్ణాటక మంత్రి పాటిల్ అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై మూడు రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రులు, ఇరిగేషన్ కార్యదర్శులతో త్రైపాక్షిక సమావేశానికి తెలంగాణ చొరవ చూపాలని కర్ణాటక చేసిన విజ్ఞప్తికి మంత్రి హరీశ్‌రావు సానుకూలంగా స్పందించారు. దీనిపై ఎపి మంత్రి ఉమామహేశ్వరరావుతో బుధవారమే తాను మాట్లాడానని, ఇరు రాష్ట్రాల ఉమ్మడి ఇండెంట్‌ను తుంగభద్ర బోర్డుకు పంపించేందుకు అంగీకారం కుదిరిందన్నారు. త్రైపాక్షిక సమావేశ ఏర్పాటుపై దేవినేనితో మాట్లాడతానని హరీశ్ తెలిపారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు, కర్ణాటక మంత్రి పాటిల్‌తో పాటు కర్ణాటక విద్యాశాఖ మంత్రి తన్వీర్ షెట్, కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్, ఆలంపూర్ ఎంఎల్‌ఎ సంపత్ కుమార్, కర్ణాటక ఎంఎల్‌ఏలు శివరాజ్ తంగిడి, అంపుల గౌడ, ప్రతాప్ గౌడ, అంపయ్య నాయక్, కెసి కొండయ్య, బోస్ రాజ్, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, కర్ణాటక ముఖ్య కార్యదర్శి రాకేష్ సింగ్, డిప్యూటీ సెక్రెటరీ అనిల్ కుమార్, జలవనరుల విభాగం ఎండి మల్లిఖార్జున గూంగే, సిఇ శంకర్ గౌడ్, ఇఎన్‌సి మురళీధరరావు, సిఇలు ఖగేందర్‌రావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ దళిత వ్యతిరేకి



మన తెలంగాణ/హైదరాబాద్: ఎంఆర్‌పిఎస్ నేత మందకృష్ణ మాదిగ అరెస్టుపై శుక్రవారం మాదిగ ప్రజాప్రతినిధులతో సమావేశమవుతున్నట్లు కాంగ్రెస్ ఎంఎల్‌ఏ ఎస్.ఎ.సంపత్‌కుమార్ తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు మోత్కుపల్లి నర్సింహులుతో కలిసి శాసనసభ మీడియా పాయింట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పై ఇచ్చిన హామీని సిఎం కెసిఆర్ గాలికొదిలేసాడని అన్నారు. కెసిఆర్ దళిత వ్యతిరేకి అని, అందుకే మందకృష్ణను అరెస్టు చేశారని, తక్షణమే ఆయనను బేషరతుగా విడుదల చేయాలని సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎస్‌సి వర్గీకరణపై అసెం బ్లీ తీర్మానాన్ని కెసిఆర్ బుట్టదాఖలు చేశారని, ఢిల్లీకి అఖిలపక్షాన్నీ తీసుకెళ్తానని చెప్పి ఆ ఊసే ఎత్తడం లేదని మోత్కుపల్లి నర్సింహులు విమర్శించారు. తెలంగాణ ఇంటి పార్టీ నాయకులు, మాజీ ఎంఎల్‌ఏ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రగతి భవన్‌లో కులసంఘాలతో సమావేశాలు పెట్టుకుంటున్న కెసిఆర్ బైట ఎవరు సభలు పెట్టుకోవద్దంటే ఎలాగని ప్రశ్నించారు.



రైల్వే స్టేషన్ల సమగ్ర అభివృద్ధికి చర్యలు

మనతెలంగాణ / హైదరాబాద్ : తిరుపతి, నెల్లూరు రైల్వే స్టేషన్ల సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టామని, అందుకు అవసరమైన సమగ్ర ప్రణాళికను రూపొందించాలని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ అన్నారు. ఈ రెండు స్టేషన్ల అభివృద్ధిపై రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్‌ఎల్‌డిఎ), నేషనల్ బిల్డింగ్ కన్స్‌ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బిసిసి), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో గురువారం తిరుపతిలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గుంతకల్ డిఆర్‌ఎం విజయ్ ప్రతాప్ సింగ్, విజయవాడ డిఆర్‌ఎం ఆర్.ధనుంజయ పాల్గొన్నారు. రైల్ ట్రాఫిక్ సమస్య, కార్యాలయ భవనప్రణాళిక, విశ్రాంతి గదులతో సహా ప్రయాణికుల సౌకర్యాలు, పాదచారుల వంతెన, సబ్‌వే, పార్కింగ్ ప్రదేశాల గురించి సమావేశంలో చర్చించారు.



"దేనిద్వారా వ్యక్తిత్వం ఏర్పడుతుందో, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందో, బుద్ధి వికసిస్తుందో అదే విద్య.
– వివేకానంద"

దళితుల స్వాభిమానంపై దాడి

సంపాదకీయం

కొద్దిరోజులుగా మహారాష్ట్రలో జరుగుతున్న అల్లర్లు, హింసాత్మక ఘటనలు, విజయవంతమైన బంద్ సాధారణ శాంతి–భద్రతల సమస్య కాదు; దళితుల స్వాభిమానాన్ని, సంఘటిత స్వరూపాన్ని దెబ్బకొట్టటానికై అగ్రవర్ణ మరాఠాలు ఒక పథకం ప్రకారం సాగించిన దాడి పర్యవసానం. హిందూత్వవాద సంస్థలకు ప్రతినిధులైన ఇద్దరు నేతలు – శంభాజీ భిడె, మిలింద్ ఎక్బోటె – దళితులపై కత్తిగట్టి చేయించిన దాడులను దళితులు సంఘటితంగా ఎదుర్కొన్నారు. పూణె సమీప గ్రామంలో మరాఠాల హింసలో ఒక బాలుని మరణంతో ఆగ్రహోదగ్రులైన దళితులు ఎదురు తిరిగారు. ఈ ఘటన కార్చిచ్చులా రాష్ట్రమంతటికీ వ్యాపించింది. ఎక్కడి కక్కడ దళితులు సంఘటితమై నిరసన తెలిపారు, లాఠీ దెబ్బలు తిన్నారు, రాళ్లు విసిరారు, రవాణా స్తంభింపచేశారు. తమ నిరసనను బుధవారం నాటి బంద్‌తో బలంగా వ్యక్తం చేశారు. బిజెపి–శివసేన ప్రభుత్వ అసమర్థత దీని కంతటికీ కారణం. భీమ కొరెగాం గ్రామంలో సాంప్రదాయక వేడుక సందర్భంగా శాంతి–భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదు. ఇది హిందూత్వ శక్తులకు వరమైంది. ఘటన జరిగాక –న్యాయ విచారణకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఆదేశించటం కన్నీటితుడుపు చర్య మాత్రమే. నిరసన ఉద్యమం చేపట్టిన దళిత యువతకు లాఠీదెబ్బలు, కాని హింసకు మూలమైన హిందూత్వ నాయకులకు స్వేచ్ఛ–ఇదే ప్రభుత్వ ద్వంద్వనీతి.

ఈ ఘటన మూలాలు 200 సంవత్సరాల నాటి చరిత్రతో ముడిపడి ఉన్నాయి. నాడు మహారాష్ట్రను పాలిస్తున్న బ్రాహ్మణ పీష్వాలు దళితులను క్రూరంగా అణచివేసే వారు. కాగా 1818 జనవరి 1న బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ తరఫున యుద్ధంలో పాల్గొన్న కొద్దివందలమంది మహర్‌లు పీష్వా రెండవ బాజీరావు నేతృత్వం వహించిన పెద్ద సైన్యాన్ని కోరెగాంలో ఓడించారు. పీష్వాల కంటకపాలన అంతమైంది. అది దళిత చరిత్రలో మహర్‌వీరుల సాహసోపేత గాథగా స్థానం పొందింది. దీన్ని జాతీయవాదం, సామ్రాజ్యవాదం కోణంలో అంబేద్కర్ వాద దళితులు చూడలేదు. బ్రాహ్మణీక పీష్వాల క్రూరపరిపాలన అంతంగానే చూశారు. అక్కడ ఈస్ట్ ఇండియా కంపెనీ నిర్మించిన 'విజయస్థూపం'పై మహర్ సిపాయిలు పేర్లు కూడా ఉన్నాయి. కొంతకాలంగా వేలాది మంది దళితులు జనవరి 1న అక్కడికి చేరి తమ పూర్వీకుల శౌర్యాన్ని స్మరించుకుని నివాళులర్పిస్తున్నారు. పునరుత్తేజ కారకమైన ఆ ప్రదేశంలో దళితులు 'భీమ్–కొరెగాం రణస్తంభ్ సేవా సంఘ్' ఏర్పాటు చేశారు. దళితులు రాజకీయ శక్తిగా ఎదగటం సహించలేని మరాఠాలకు అది కంటగింపు అయింది. అంతేకాదు. భీమ్–కోరెగాం గ్రామానికి కొద్ది దూరంలోని వాధు బుద్రుక్‌లో అంతకు క్రితం జరిగిన ఘటన కొనసాగింపుగానే తాజా ఘటనలను చూడాల్సి ఉంటుంది. 1689లో మొగలాయిల చేతిలో హతుడైన ఛత్రపతి శివాజీ పెద్దకుమారుడు శంభాజీ సమాధి అక్కడ ఉంది. ముక్కలైన శంభాజీ దేహాన్ని ఔరంగజేబు నదిలో పడవేయగా, ఆ గ్రామ దళితుడు గోవింద్ మహర్(గైక్వాడ్)ఆ శరీరభాగాలను ఏరి అంత్యక్రియలు జరిపించాడన్నది గాథ. శంభాజీ సమాధిని గ్రామ మహర్‌లే నిర్మించారని చెప్పబడుతున్నది. గోవింద్ మహర్ మరణానంతరం అతని సమాధి గ్రామస్థులు అక్కడే నిర్మించారు. శంభాజీ అంత్యక్రియల్లో గోవింద్ గైక్వాడ్ ఇతర మహర్‌ల పాత్రను మరాఠాలు నిరాకరిస్తున్నారు. ఆ సమాధి వద్ద ఈ గాథ ఫలకాన్ని తొలగించాలని హిందూ సంస్థలు ఇటీవల అధికారులకు విజ్ఞప్తి చేయగా దళితులు ప్రతి విజ్ఞప్తి చేశారు.

ఈ జనవరి 1 దళిత వీరగాథ 200 వ వార్షికోత్సవమైనందున కొన్ని లక్షలమంది రణస్తంభ్ వద్ద సభకు చేరారు. హిందూత్వ రాజకీయాలను నయా–పీష్వావాదంగా పరిగణిస్తున్న దళితులకు గుణపాఠం చెప్పటానికి మరాఠాలు దాడికి పాల్పడ్డారు. అది పూణె, ముంబై సహా అనేక నగరాల్లో దళిత ఆందోళనలకు దారితీసింది. అంబేద్కర్ స్మారక మందిరాల పేరుతో దళితులను బుజ్జగించటానికి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న బిజెపి కేంద్ర నాయకత్వానికి మహారాష్ట్ర ఘటనలు నిజంగా తలనొప్పి.

ఉద్యోగులకు కాని రోజులు!

చూపు

దేశంలో మొట్టమొదటిసారి జాతీయ ఉపాధి విధానం కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది. ఉద్యోగాల కల్పన అనే కీలక అంశంపై దృష్టిపెట్టి దీనిని తెస్తున్నారు. ఆర్థిక, సామాజిక, కార్మిక విధానాలను ఉద్యోగాల సృష్టికి అనుగుణంగా మార్చుతూ మార్గపటం రూపొందిస్తారు. రాబోయే బడ్జెట్‌లో ఆ విధానా న్ని ప్రకటించే అవకాశం ఉంది. కానీ అది అంత సులభమైన కార్యం కాదని చెప్పాలి. ప్రస్తుత ఉద్యోగాల మార్కెట్ పరిస్థితి, ఆర్థిక వాతావరణం పకడ్బందీగా ఉద్యోగాలను కల్పించడానికి అనువుగా లేవు. ఉపాధి కల్పనకు అనుగుణమైన వనరులను సృష్టించడం ఇప్పుడు కొంచెం కష్టమే. పైగా సేవలరంగం వృద్ధికే అధిక ప్రాధాన్యం ఉంది. ఉద్యోగ కల్పన ఆ తరువాతే.

ప్రభుత్వ 'మేక్ ఇన్ ఇండియా' పథకం ఇంకా నత్తనడకలోనే ఉంది. తక్కువ సాంకేతికత అవసరమయ్యే సరకుల దిగుమతులు అడ్డూ ఆపూ లేకుండా సాగుతున్నాయి. ఉద్యోగార్థులకు ప్రోత్సాహకర వాతావరణం లోపించింది. తక్కువ ప్రతిఫలంతో కాంట్రాక్టు, పార్ట్ టైమ్ ఉద్యోగాలు స్వాగతం పలుకుతున్నాయి. నిరుద్యోగుల భవిష్య త్తు అగమ్య గోచరంగానే కొనసాగే పరిస్థితులు కనపడుతున్నాయి. నిరుద్యోగం రేటు అధికంగా ఉంటే యాజమాన్యాలు ఇష్టానుసారం పని పరిస్థితులను, జీతనాతాలను నిర్ణయించడానికి ప్రాధాన్యమిస్తారు. గిరాకీ, సరఫరా స్థితినిబట్టి ఈ విషయంలో వారు దోపిడీకి దిగుతారు. కార్మికుల నైపుణ్యాన్ని, విద్యను పూర్తిగా వినియోగించుకోని సంస్థలు మనకున్నాయి. చాలా మందిని అర్హతలకు తగని తక్కువ స్థాయి ఉద్యోగం (చిరుద్యోగం) లోకి తీసుకొంటున్నారు. కనపడే చిరుద్యోగం, కనపడని చిరుద్యోగం కూడా హెచ్చుస్థాయిలో ఉన్నాయి. ఈ ధోరణులు ప్రభుత్వానికి తెలిసినవే. సాధారణ నిర్వచనం ప్రకారం కార్మికులు ఆ రంగానికి అవసరమైన స్థాయిలో కాకుండా కొద్దిగంటలే పనిచేస్తుంటే 'కనపడే' రకం చిరుద్యోగం. వారు ఇంకా ఎక్కువ గంటలు పనిచేసే సామర్థ్యం ఉన్నా, అందుకు వారు సిద్ధంగా ఉన్నా పూర్తిస్థాయి ఉపాధి వారికి మృగ్యం. పొట్టకూటి కోసం వారిలో చాలామంది ఒకటి నుంచి మూడు దాకా తాత్కాలిక ఉద్యోగాలను చేస్తూ ఉంటారు. 'కనపడని చిరుద్యోగం'లో కార్మికులు పూర్తిస్థాయి ఉద్యోగాలలోనే ఉంటారు. కానీ వారి నైపుణ్యాలు ఇతర అర్హతలు పూర్తిగా వినియోగంలోకి రావు. వాటిని వాడుకొనే అవసరం ఆయా సంస్థలకు ఉండదు.

కార్మికులకు తమ నైపుణ్యానికి తగ్గ ఉద్యోగాలు దొరికే పరిస్థితి లేదు. కళాశాల విద్య, పోస్టు గ్రాడ్యుయేట్ అర్హతలు గల వారికి చిరుద్యోగ సమస్య భరింపరానిది. అత్యున్నత అర్హతలు గల వారు కూడా క్లాస్ ఫోర్ (అట్టడుగు స్థాయి ఉద్యోగాల) కోసం ప్రాకులాడ్డం సమస్య దేశంలో విరివిగా ఉంది. వేతన సంఘం సిఫార్సుల తరువాత ఇంతకు ముందు చిన్నవిగా భావించిన ఉద్యోగాలకు కూడా ప్రతిఫలం పెరిగి గిరాకీ ఏర్పడింది. ఇటీవల సమాచార టెక్నాలజీ, టెలికమ్, ఉక్కు, ఇంజినీరింగ్, గనుల రంగాలకు ఉద్యోగాల కల్పనలో కొత్త సవాళ్లు ఎదురయ్యాయి. విదేశాలలో ఉద్యోగ వీసాలపై ఆంక్షలు, సంస్థల విలీనాలు, కలిపేసుకోవడాలు(ముఖ్యంగా టెలికమ్, బ్యాంకింగ్, తదితర రంగాలలో), సంస్థల దివాళా, మరికొన్ని పారిశ్రామిక సంస్థల మాంద్యం ప్రభావం అనేక రంగాలపై పడింది. ఇది కూడా ఉపాధి రంగాన్ని దెబ్బ తీస్తోం ది.

గత మూడు నెలల్లో ఒక్క టెలికమ్ రంగం సిబ్బందిలో నాలుగోవంతును కోల్పోయింది. అనేక కారణాలపై ఆ రంగం తరచూ లే ఆఫ్‌లను ప్రకటించింది. ఆయా కారణాలలో మూసివేతలు, పోటీ పెరగడం, కంపెనీల విలీనాలు కూడా ఉన్నాయి. మార్కెట్లో నెలకొన్న ఈ అస్థిరత మూలంగా స్టార్టప్‌ల భవిష్యత్తు దెబ్బతింది. మంగళ్ భవన డాట్ ఇన్ డైరెక్టర్ అమిత్ జైన్ చెప్పిన ప్రకారం నైపుణ్య కార్మికుల కొరత గాని, తగినంతగా అర్హులు లేకపోవడం వల్ల గాని ఈ పరిస్థితి రాలేదు. చుట్టూ ఆవరించి ఉన్న విరుద్ధశక్తి వారిని పతనంలోకి నెట్టుతోంది. టెలికమ్ రంగం నుంచి అక్టోబర్‌లో తమకు ఎక్కువగా ఉద్యోగ దరఖాస్తులు అందినట్టు జైన్ తెలిపారు. గత రెండు నెలల్లో టెలికమ్ రంగం నుంచి ఉద్యోగార్థుల కాల్స్ 20శాతం నుంచి 45 శాతానికి పెరిగాయి. రానున్న నెలల్లో టెలికమ్‌రంగం ఉద్యోగులలో అభద్రతా భావన ఇంకా పెరిగే సూచన కనిపిస్తోంది. ఖర్చులు ఆదా చేసుకోడానికి సిబ్బందిని కంపెనీలు వదుల్చు కొంటున్నాయి. టెలికమ్ రంగంలో సిబ్బందిపై నిర్వహణ ఖర్చులు 5 శాతం దాకా ఉన్నట్లు తేలింది. ఈ పరిస్థితిలో ప్రభుత్వం ఏమీ చేయలేని అశక్తతలో పడింది. ప్రతిపాదిత జాతీయ ఉపాధి విధానాల్లో భాగంగా కొత్త ఉద్యోగాలను ఎలా సృష్టించాలి అన్నదానితోపాటు ఉద్యోగాలు కోల్పోయి వీధులపాలయినవారికి పునరావాసం, తిరిగి ఉపాధి కల్పించడం గురించి కూడా ప్రణాళికలు రచించాలి.

కొత్తగా ఉద్యోగాలు ఆశించేవారు, ఉన్న ఉద్యోగాలు కోల్పోయిన వారు కూడా ఆర్థిక స్థిరత్వం సాధించడానికి సహాయం కూడా అందించవలసి ఉంది. అలాగే ఉద్యోగాల నుంచి రిటైర్ అయినవారి ఆర్థిక సుస్థిరతకు కూడా ప్రభుత్వం బాధ్యత వహించాలి. 60 ఏళ్లు పైబడిన విశ్రాంత ఉద్యోగులకు ప్రస్తుతం అమలులో ఉన్న కనీస పెన్షన్ చాలా తక్కువగా ఉంది. అది నెలకు రూ. 1000 మాత్రమే. ప్రభుత్వ పెన్షనర్లకు డిఎ కలిపిన పెన్షన్లను ఇస్తున్నారు. కానీ పారిశ్రామిక కార్మికులకు మాత్రం నికరంగా ఒకే మొత్తం మార్పు లేకుండా చెల్లిస్తున్నారు. రిటైర్ అయిన పారిశ్రామిక కార్మికుల శ్రేయస్సుకు కేవలం ఆ సంస్థల యజమానులే కాకుండా, మొత్తం సమాజం బాధ్యత వహించాలి.

ఎఫ్ఐసిసిఐ–నాస్కామ్ తాజా నివేదిక ప్రకారం రిటైల్ రంగంలోని కార్మిక బలగంలో 25 శాతం ఉద్యోగుల నియామక వాతావరణం పూర్తిగా మారిపోయింది. కొత్తకొత్త నైపుణ్యాలు, సాంకేతిక చాకచక్యాలు అవసరపడే ఉద్యోగాలు అవి. దీనితో అవసరమైన అర్హతలు కూడా పూర్తిగా మార్పు చెందాయి. వచ్చే ఐదేళ్లలో రిటైల్ రంగంలో సరఫరాల గొలుసుకట్టు వ్యవస్థ విపరీతంగా మార్పు చెందుతుందని పారిశ్రామిక నిపుణులు అంటున్నారు.ఆ రంగంలోవృద్ధికి ఆ వ్యవస్థే ఆయువుపట్టుగా మారనుంది. దేశంలోని చిన్న నగరాల్లో ఇ–కామర్స్, మొబైల్ ఆధారిత ఇ–రిటైలింగ్ కార్యకలాపాలు జోరందుకుంటున్న నేపథ్యంలో ఉద్యోగాల మార్కెట్‌పై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. అందుచేత దేశంలో ఉపాధి కల్పన విధానాలు అనేక కోణాలకు సంబంధించినవై ఉండాలి. ముఖ్యంగా మధ్యతరహా, చిన్నస్థాయి పరిశ్రమల అవసరాలకు తగిన ఉద్యోగ అభ్యర్థులను పూనికతో తయారు చేయాల్సి ఉంది.

* నంటూ బెనర్జీ



ప్రజారోగ్యానికి పెనుముప్పు



దామరపల్లి నర్సింహారెడ్డి

ప్రపంచ దేశాలన్నింటిలో వైద్యం అధ్వాన్నంగా ఉన్న దేశాల జాబితాలో భారతదేశం 154 వ స్థానంలో ఎంత వెనుకబడిందో తేటతెల్లమవుతోంది. దేశవ్యాప్తంగా వైద్యం పూర్తిగా నిర్వీర్యమై 80 శాతం ప్రైవేటు అధీనంలోకి వెళ్లింది. 2020 నాటికి అందరికీ వైద్యం అనే నినాదం గత 20 సంవత్సరాలుగా నినాదం గానే మిగిలింది. అందరికీ అందించాలంటే వైద్యం ప్రైవేటీకరణ నుంచి ప్రభుత్వ అధీనంలోకి మళ్లీ రావాల్సిందే. దేశవ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానాలు సవాలక్ష సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. దేశంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సుమారు 35వేల వైద్య ఉద్యోగాలు భర్తీ కాకుండా ఖాళీగానే ఉన్నాయి. పది వేల ఆరోగ్య కేంద్రాలలో 4900కేంద్రాలలో ప్రసూతి వైద్యులు లేరు. 2011 అధ్యయనంలో చేదు నిజాలు వెలుగుచూశాయి. జార్ఖండ్, ఒడిశా, ఉత్తర ప్రదేశ్, ఛత్తీస్‌ఘర్, మణిపూర్, ఆంధ్ర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో వైద్య ఆరోగ్య కేంద్రాలలో మాతా శిశు సంరక్షణ అందించడానికి కనీస సదుపాయాలు లేవని, రోగుల పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పదుల సంఖ్యలో చనిపోతున్నారని రోగుల బంధువులు వైద్యులపై దాడి చేస్తున్నారు. లక్షన్నర ఆరోగ్య కేంద్రాలను ఆరోగ్య సంక్షేమ కేంద్రాలుగా చేయడానికి కేంద్రం నిర్ణయం తీసుకుంది.2017 బడ్జెట్ లో ఏడు వేల కోట్ల రూపాయల నిధులను కేటాయించింది. కేంద్రం కోసం 44,500 కోట్ల రూపాయలు, రాష్ట్రాలు 88వేల 215 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి.

అయినా మార్పులు రావడం లేదు. పాలకులు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడం ప్రైవేటు ఆసుపత్రులు పెరిగిపోయాయి. ప్రజలు వాటినే ఆశ్రయిస్తున్నారు. మానవుడు శారీరకంగా ఆరోగ్యవంతంగా వుండాలంటే పౌష్టికాహారం, స్వచ్ఛమైన గాలి, నీరు ఉండాలి. కానీ కాలుష్యం సమస్యలు పెరిగిపోయాయి. కాలుష్యం బారిన పడి ఏటా 25లక్షలమంది శ్వాసకోశ వ్యాధులతో చనిపోతున్నారు. ప్రపంచ దేశాల్లో క్యాన్సర్ వ్యాధి మరణాల్లో భారతదేశం మూడో స్థానంలో ఉంది. అలాగే మలేరియా మరణాల్లో 4వ స్థానంలో ఉందని నివేదికలు చెబుతున్నాయి. అయినా పాలకులు పట్టించుకోవడం లేదు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో గోరకపూర్ ఘటన ప్రపంచాన్ని కలిచివేసింది. వెంటిలేటర్లు లేక ఆక్సిజన్ అందక వందలమంది చిన్నారులు చనిపోయారు. దేశంలోని ప్రభుత్వ దవాఖానాల్లో సరైన వైద్య పరికరాలు, సరిపడా సిబ్బంది లేని కారణంగా రోగులు చనిపోతున్నారు. 2015లో మొత్తంగా 59 లక్షలమంది చనిపోయారు. ఇందులో 26లక్షల మంది భారత్‌కు చెందిన వారు. కాంగో, పాకిస్థాన్, నైజీరియాకు చెందిన వారు ఉన్నారు. భారతదేశం జిడిపిలో 3% ఆరోగ్యానికి ఖర్చు చేస్తున్నది. అమెరికాలో 18%, ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ 16% ఖర్చు చేస్తున్నాయి. ఈ విధంగా చూస్తే ప్రతి దేశం వైద్యానికి చేసే ఖర్చు తక్కువగా ఉంది.

మన దేశ పాలకులు పొరుగు దేశాల నుంచి నేర్చుకోవాల్సి ఉంది. ఆరోగ్యానికి నిధులను ఇప్పటికయినా పెంచాల్సింది. ఉత్తర కొరియా, దక్షిణ కొరియా, జపాన్, జర్మనీ వంటి దేశాలలో ప్రజాఆరోగ్యం ప్రభుత్వ అధీనంలో ఉన్నాయి. మందుల ధరలు నిర్ణయించటంలో ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. దవాఖానాలు, వైద్యులు వసూలు చేసే చార్జీలపై ప్రభుత్వమే పర్యవేక్షిస్తాయి. నిబంధనల ప్రకారమే దవాఖానాలు నెలకొల్పాలి. అవసరాల నిమిత్తం ఆస్పత్రులకు లైసెన్సు ఇస్తారు.

రాష్ట్రాలవారీగా వ్యత్యాసాలు పరిశీలించుదాం:

కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ వివరాల ప్రకారం ఫార్మసీలకు 29%, ప్రైవేటు ఆసుపత్రులకు 26%, ప్రైవేట్ క్లినిక్‌లకు 5%, డయాగ్నస్టిక్స్ ల్యాబులూ, రోగుల వ్యక్తిగత ఖర్చులు5% ఖర్చవుతున్నాయి. ప్రజలు తమ సంపాదనతో పాటు రుణాలు తెచ్చుకొని ఆస్పత్రులకు ఖర్చు చేస్తున్నారు. 68% రుణ మొత్తంలో 25% వైద్య ఖర్చులకే ఖర్చవుతోంది. గ్రామాలు 86% నగరాలలో 82% వైద్య ఆరోగ్య పథకాలు నోచుకోవడం లేదని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఖర్చులు మూలంగా ప్రజల జీవన స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వైద్య బీమా ప్రైవేట్ ఏజెన్సీలు పరిమితంగా అమలు చేయడం వల్ల వైద్యం అందని ద్రాక్ష పళ్ళలా మారింది. కార్మికులకు ఇఎస్ఐ రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన పథకం ఉన్నా దారిద్ర్య రేఖ దిగువనున్న కుటుంబాల సైతం ప్రైవేటు వైద్యమే దిక్కవుతోంది. దీనిని ఆసరా చేసుకొని యాజమాన్యాలు లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల యాజమాన్యాలు డబ్బే ప్రధానంగా ఎంచుకొని రోగులపై దాష్టీకాలకు పాల్పడుతున్న ఘటనలు తరచూ వెలుగుచూస్తున్నాయి. నిత్యం వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా వైద్యానికి పడినటు వంటి ఖర్చులు అంతంత మాత్రమే. ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసినట్లు తేటతెల్లమవుతోంది

నాటువైద్యం మూలంగా ఆదివాసులు, గిరిజనులు నివసించే ప్రాంతాలలో ప్రతియేటా వందలమంది చనిపోతున్నారు. నాటువైద్యం పైన ఆధారపడి జీవిస్తున్నారు. రక్షిత నీటి పథకాలు కొరవడిన కారణంగా పట్టణాలు, నగరాలలో వేలకువేల సంఖ్యలో ప్రజలు చనిపోతున్నారు. గాంధీ, ఉస్మానియా తదితర ప్రభుత్వ వైద్యశాలలన్నీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఐడిపిఎల్ ఉన్నప్పుడు మందులు అతి తక్కువ ధరలో అందుబాటులో ఉండేవి. నేడు ప్రైవేటు ఔషధాలయాలు వారు కోట్లాది రూపాయలు సంపాదించుకుంటున్నారు.

జనాభా పెరుగుతున్న కొలది ఆసుపత్రులు పెరగాలి. తెలంగాణ జిల్లాలో 10 జిల్లా ఆస్పత్రులు ఉన్నాయి. ఇంకా కొత్తవి రావాలి. 200 ఆసుపత్రులు, 670 ప్రాథమిక వైద్యాలయాలు రాష్ట్రంలో ప్రైమెరీ హెల్త్ సెంటర్లు 54 నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవాలకు నోచుకోలేకపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో ప్రైమరీ హెల్త్‌సెంటర్లు 675, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు నాలుగువేలకు పైగా ఉన్నాయి. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, వైద్య విధాన పరిషత్‌లో వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తెలంగాణ ఆరోగ్య శాఖలో 25వేల కోట్లు ఖాళీగా ఉన్నాయి. భర్తీ చేయకుండా కాలయాపన జరుగుతోంది. రెగ్యులర్ ఉద్యోగులను నియమించకుండా కాంట్రాక్టు ఉద్యోగులుగా 50% నియమించారు. పే రివిజన్ కమిటీ ప్రకారంగా వేతనాలు పెరగాలి కానీ, కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు పెరగడం లేదు. పది వేలమంది కాంట్రాక్టులోనే కొనసాగుతున్నారు. ఎన్నో ఏళ్లుగా వైద్య సేవలందిస్తున్న ఎఎన్ఎంల వేతనం పదివేల రూపాయల లోపు ఉంది. 2008 ప్రకారం తొమ్మిదవ వేతన సవరణ ప్రకారం జీతాలు పెరగాలి. కానీ ఇంతవరకు జీతాలు పెంచకుండా వారిచేత వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక చాలామంది వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇలా వెట్టిచాకిరీలోనే వారు మగ్గిపోతున్నారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తనిఖీల్లో భయంకరమైన వాస్తవాలు వెలుగుచూశాయి. ప్రైవేటు మెడికల్ కళాశాలలో కౌన్సిల్ తనిఖీల్లో అనేక చీకటి కోణాలు ఉన్నాయని కనుగొన్నారు. జూనియర్ డాక్టర్లు అప్పుడప్పుడు మెరుపు సమ్మె చేస్తున్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రొఫెసర్లు, డాక్టర్లను నియమించాలని, ప్రొఫెసర్ల స్టైఫండ్ పెంచాలని, టీచింగ్ కళాశాలకు అనుబంధంగా ఆసుపత్రులను ఉంచాలని వైద్యశాఖలో ఖాళీలు భర్తీ చేయాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. కేరళ రాష్ట్రంలో వైద్యం ప్రభుత్వ అధీనంలో ఉంది. ప్రజారోగ్యం ప్రజలకు అందించడం ప్రాథమిక హక్కు. ఈ హక్కులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాల రాస్తున్నాయి. ప్రైవేటీకరణ వల్ల వైద్యం అంగడి సరుకుగా మారిం ది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్యాన్ని కాపాడేలా చూడాలి. వైద్యరంగంలో మరిన్ని సంస్కరణలు ప్రవేశపెట్టాలి.

మానవుడి ప్రాణాలు హరించే అణు విద్యుత్ కేంద్రాలు

అడవికి కేంద్రాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. భారతదేశంలో నాలుగు రాష్ట్రాల్లో అణు విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించి 700 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయనున్నట్లు భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఉన్న సాంకేతిక విజ్ఞానంతో నిర్మించిన రెండు అణువిద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే తమిళనాడులోని కుడంకుళం లో ఏర్పాటుచేసిన అణు విద్యుత్ కేంద్రంతో అక్కడి ప్రజలు పెద్దఎత్తున పోరాడుతున్నారు. ఈ కేంద్రాల వల్ల పర్యావరణం దెబ్బతిని కాలుష్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. ప్రపంచవ్యాప్తంగా అణు విద్యుత్తుకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఐదవ దశకంలో ముంబయికి సమీపంలో తారాపూర్‌లో అణుఇంధన కేంద్రాన్ని కేంద్రాన్ని ఏర్పాటుకు ప్రయత్నాలు మొదలుపెట్టినప్పుడు కూడా ప్రజల నుంచి పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. రష్యాలోని చెర్నోబిల్, జపాన్‌లోని పుకిషిమాలో అమెరికా త్రీ మైల్ ద్వీపంలో జరిగిన ప్రమాదాలు ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతున్నాయి. పర్యావరణం పూర్తిగా దెబ్బతింది. అణు కేంద్రాల నుంచి వెలువడే రేడియోధార్మిక తరంగాలు చుట్టుపక్కల ఉండే వారిపై తీవ్రప్రభావం చూపుతుంది.

అణు విద్యుత్ కేంద్రాలు మానవాళి ఉనికి లేకుండా చేస్తాయి. పర్యావరణం, కాలుష్య సమస్యలు తలెత్తుతాయి. పర్యావరణం క్షేమ దాయకంగా ఉండాలంటే సౌర అపారమైన పవన శక్తి, జీవ ఇంధనాలు వినియోగించే వైపు పాలకులు దృష్టిసారించాలి.

నిధులు, అధికారాలతోనే గ్రామస్వరాజ్యం సాధ్యం..!

ఎడిటర్‌కు లేఖలు

దేశంలో సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను పల్లెల స్థాయిలో పటిష్ఠంగా అమలు చేయడం కోసం బల్వంత రాయ్ మెహతా కమిటీ సిఫారసుల ప్రకారం స్వతంత్ర భారతంలో తొలిసారిగా మూడంచెల (గ్రామ, సమితి, జిల్లా) పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడింది. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సహా అనేక రాష్ట్రాలు ముందుకొచ్చి పంచాయతీరాజ్ వ్యవస్థలను ఏర్పరచినప్పటికీ వాటికి తగిన రాజ్యాంగ భద్రత లేకపోవడం వల్ల, అధికారాల నిర్లక్ష్యం, క్రమం తప్పక ఎన్నికలు నిర్వహించక పోవడం వల్ల ఆ వ్యవస్థలు విఫలమయ్యాయి. పల్లెల్లో ప్రజాస్వామ్యం వికసించి, అవి స్వయం సమృద్ధమైనప్పుడే జాతి పురోగతి సాధ్యమన్నది మహాత్ముడి మాట. ప్రజా భాగస్వామ్యంతోనే గ్రామసీమలను స్వయం పాలన బాట పట్టించడం కోసమే పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు కావడం జరిగింది. రాష్ట్రాల సారథ్యంలో పంచాయతీరాజ్ వ్యవస్థలు పటిష్ట పునాదులపై ఏర్పాటు అయినప్పటికీ క్రమేణా రాజకీయ నాయకులు, అధికారుల స్వార్థం పాలబడి అవి కష్టాల్లో కూరుకుపోయాయి. పంచాయతీరాజ్ వ్యవస్థలను పటిష్ఠంగా, బాధ్యతాయుతంగా తీర్చిదిద్దడం కోసం తెలంగాణ ప్రభుత్వం పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ ఏర్పాటు ప్రతిపాదనతో ముందుకు రావడం హర్షణీయం. గ్రామ సీమల బలోపేతం దిశగా ఆంధ్రప్రదేశ్ సర్కారు కీలక ముందడుగులు వేస్తుండడం శుభపరిణామం. గ్రామాల్లో సర్పంచ్ పదవులకు 1981లో ప్రత్యక్ష ఎన్నికలు ప్రవేశపెట్టారు. 1986లో సమితి స్థానంలో మండలాలను తీసుకువచ్చి, పంచాయతీలను ప్రజలకు చేరువ చేశారు. తెలుగు రాష్ట్రాల బడ్జెట్లలో సుమారు 50శాతాన్ని పంచాయతీరాజ్ పరిధిలోని అంశాల కు కేటాయిస్తున్నారు. కానీ ఈ సొమ్ములో పంచాయతీల ద్వారా ఖర్చు పెట్టేది 5శాతం కన్నా తక్కువే. అదే కేరళలో 40శాతం రాష్ట్ర బడ్జెట్ పంచాయతీల ద్వారానే ఖర్చు పెడుతున్నారు. కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ ఇంచుమించు ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామ పంచాయతీలను మినహాయిస్తే, జిల్లా, మండల స్థాయి పంచాయతీలకు సొంత పన్నుల ఆదాయం లేదు. గ్రామ పంచాయతీలకు రెండు రకాల ఆదాయం ఉంది. సొంత పన్నులు, రుసుముల రూపేణా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల(గ్రాంట్ల రూపంలో గ్రామ పంచాయతీలకు నిధులు సమకూరుతాయి. నిజానికి పన్నులు, రుసుముల ద్వారా గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయం చాలా తక్కువ. 2015–19 కాలానికి అధిక మొత్తంలో నిధులను గ్రాంటు రూపంలో, తలసరి సుమారు 488 రూపాయలను నేరుగా గ్రామ పంచాయతీలకు కేటాయించింది. వాటిలో 90శాతం ప్రాథమిక గ్రాంటు కాగా, మిగిలిన 10 శాతం పని ప్రదర్శన, సామర్థ్యంపై ఆధారపడి విడుదల అవుతాయి. రాజ్యాంగ అధికరణ 243(1) ప్రకారం ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రప్రభుత్వాలు పంచాయతీలకు నిధులు కేటాయించాలి. కానీ, ఉభయ తెలుగు రాష్ట్రాలతో సహా దేశంలోని అనేక రాష్ట్రాలు ఆ పనిని సక్రమంగా చేయడం లేదు. అధికారాలు, నిధులలేమితో పాటు పంచాయతీ రాజ్ సంస్థలను వేధిస్తున్న అతిపెద్ద సమస్య సిబ్బంది కొరత. ఒక పంచాయతీ కార్యదర్శి రెండు మూడు గ్రామ పంచాయతీలకు పనిచేయ్యాలసిన పరిస్థితి ఉంది. మొత్తం 29 అధికారాలను పంచాయతీలకు బదిలీ చేస్తామన్న రాష్ట్రాలు, ఆ వాగ్దానాన్ని ఎప్పుడూ ఉల్లంఘిస్తూనే ఉన్నాయి. బదలాయించిన 17 అధికారాలను సైతం గ్రామ, మండల, జిల్లా పంచాయతీల మధ్య సహేతుకంగా విభజించలేదు. పంచాయతీలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు, మహిళలు, బలహీన వర్గాలకు ఏటా శిక్షణ తరగతులు నిర్వహించి వారిలో స్ఫూర్తి నింపాలి. ఇతర సమాంతర వ్యవస్థల కార్యక్రమాలను పంచాయతీలకు అనుసంధానించాలి. అప్పుడే అభివృద్ధి, సంక్షేమాలు అట్టడుగు వర్గాలకూ అందుతాయి.

– **శ్రీనివాస్ చిరిపోతుల,** 96034 71199

ఒకే ప్రభుత్వ జీతం విధానం అమలుపర్చాలి

రాష్ట్రం అభివృద్ధి చెందేందుకు, ప్రజలు సుఖ శాంతులతో ఉండేందుకు అర్చకుల ఆశీర్వాదం కావాలని అందువల్లే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అర్చకులకు ఆలయ సిబ్బందికి 2015 పి.ఆర్.సి ప్రకారం వేతనాలు పెచుతున్నవని ఆ ఫలాలు డిసెంబర్ 1వ తేదీకి యావత్ 5625 సిబ్బందికి తమతమ బ్యాంకు ఖాతాలలో జమ అవుతాయని, సగర్వంగా విన్నవించారు, మన సిఎం కె సి ఆర్ గారు. తెలంగాణ కి జూన్ 2 తేదీ ఎంత ముఖ్య మో, అర్చక ఉద్యోగులకు డిసెంబర్ 1వ తేదీ అంతే గొప్పదని ప్రభుత్వ సలహాదారు కె.వి. రమణాచారి అన్నారు. కొత్త జీతాలు తమతమ బ్యాంకు ఖాతాలలో జమ అవుతాయని వెయ్యికళ్ళతో ఎదురుచూసారు. కానీ వారిలో కేవలం 734 మంది సిబ్బందికి, అది కూడా పి.ఆర్.సి ప్రకారం పెరిగిన మొత్తాన్ని మాత్రమే బ్యాంకు ఖాతాలో జమచేశారు. మిగతా మొత్తము ఎప్పటిలాగే ఆలయాల నుండి ఇచ్చేలా నిర్ణయించారు,

ఈ జిఓ నెం 577 తయారు చేసిన వారు, మీకు ఎక్కడ మంచి పేరు ప్రఖ్యాతులు వస్తాయో అని తిరకాసు పెట్టి, మీకు అపఖ్యాతి తెచ్చేలా లొసుగులతో తయారుచేసినట్లు ఉంది. ముఖ్యమంత్రి గారు తక్షణం జి ఓ నెం 577 లో ఉన్న ఈ లొసుగును తొలగించి, జీతం ఏక మొత్తంలో సిబ్బందికి ప్రభుత్వం ద్వారా బ్యాంకులో జమ అయ్యే విధానం ప్రవేశపెట్టి వారి మన్ననలను పొందాలని మనవి. ప్రస్తుతం ఆలయాలు సిబ్బందికి చెల్లించే జీతాలను ఆలయ సిబ్బందికి చెల్లించే ప్రభుత్వ ఖాతాలో జమచేసేలా సత్వరం ఉత్తర్వులు జారీచేసి, ఒక ఉద్యోగం–ఒకే జీతం విధానాన్ని ప్రవేశపెట్టమని మనవి.

– **చామర్తి వెంకట రామకృష్ణ,** హైదరాబాద్





మన తెలంగాణ
5
హైదరాబాద్
శుక్రవారం
5 జనవరి, 2018
www.manatelangana.news

సివిల్స్‌వైపే యువత చూపు..

సివిల్స్ పరీక్షలను బ్రహ్మపదార్థంగా చూడటం మానుకొని నిర్దిష్ట సిలబస్‌లో నిమగ్నమైతే సాధించడం తేలిక. ఎంపిక చేసుకొనే పాఠ్యాంశం మార్కులను స్కోర్ చేసే విధంగా ఉంటే ప్రిలిమనరీతోపాటు మెయిన్స్‌లో విజయం సాధించవచ్చని కృష్ణప్రదీప్స్ 21 సెంచరీ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ విద్యార్థులకు భరోసా ఇస్తుంది. 2003 నుంచి సివిల్స్‌కు కోచింగ్ ఇచ్చి వందలాది మందిని సివిల్స్ అధికారులుగా తీర్చిదిద్దిన ఈ కోచింగ్ సెంటర్ చీఫ్ కోఆర్డినేటర్ ఏ.మహేందర్ రెడ్డి "గమ్యం"తో చెప్పిన వివరాలు.

ప్రస్తుతం డిమాండ్‌లో ఉన్న కోర్సులేవి? మీరు ఇచ్చే కోచింగ్ ఎలా ఉంటుంది?

ప్రస్తుతం చాలా వరకు యువత సివిల్స్ వైపు దృష్టి సారిస్తున్నారు. ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్, ఐ.ఆర్.ఎస్,ఐ.ఎఫ్.ఎస్ లకు డిమాండ్ పెరుగుతుంది. రాష్ట్ర విభజనతో ఉద్యోగావకాశాలు పెరగడంతో అత్యధికంగా విద్యార్థులు గ్రూప్ వన్, గ్రూప్ టూ వైపు ఆసక్తి చూపుతున్నారు. కానీ కొంతమంది సివిల్స్ కఠినంగా ఉంటుంది ఇంగ్లీషులో పరీక్ష రాయాల్సి వస్తుంది. సివిల్స్ స్థాయిని అందుకోలేమనే అభిప్రాయంతో ఉన్నారు. రకరకాల అపోహల వల్ల గ్రూప్ 1,2 వైపునకు చూస్తున్నారు.

సివిల్స్ పూర్తిగా ఇంగ్లీషులోనే రాయాల్సి ఉంటుందా?

సివిల్స్‌కు ప్రిలిమనరీ పరీక్ష తప్పనిసరిగా ఇంగ్లీషులోనే రాయాల్సి ఉంటుంది. మెయిన్స్ తెలుగులో రాసే అవకాశం ఉంది. అయితే ప్రిలిమనరీ ఇంగ్లీషులో రాసి మిగతా పోటీని ఎదుర్కొనే బదులు సివిల్స్ స్థాయిలో ఉండే గ్రూప్ 1,2 పరీక్షలు తెలుగులో రాసి తొందరగా ఉద్యోగ అవకాశం పొందవచ్చనే ఆలోచనలు అభ్యర్థుల్లో వ్యక్తం అవుతుంటాయి.

సివిల్స్ కోచింగ్ ఎప్పటి నుంచి ప్రారంభమౌతుంది?

విద్యార్థి డిగ్రీ కాగానే జూన్ నుంచి కోచింగ్ ప్రారంభిస్తాం. 18 నెలలపాటు కోచింగ్ ఉంటుంది. ప్రిలిమనరీ తర్వాత మెయిన్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోపాటు ఇంటర్వ్యూలకు సీనియర్ ఐఏఎస్ అధికారులతో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను తీర్చిదిద్దుతుంటాం.

సబ్జెక్టును ఎలా ఎంపిక చేసుకుంటే మార్కుల స్కోర్ సాధించవచ్చు?

సబ్జెక్టులను ఎంపిక చేసుకోవడం అనేది సివిల్స్‌లో చాలా ముఖ్యం. సాధారణంగా ఒక సబ్జెక్టు ఎంపిక చేసుకునే ముందు లాభనష్టాలు అంచనా వేయాలి. జనరల్ స్టడీస్‌లో ఎంతవరకు కవర్ చేయగలమో చూడాలి.ఇప్పటివరకు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జనరల్ స్టడీ, ఆంత్రోపాలజీ, జాగ్రఫీ, తెలుగు లిటరేచర్, పొలిటికల్ సైన్స్, హిస్టరీలో మార్కులు వస్తాయి. అలాగే ఫ్యాకల్టీ సూచనలు తీసుకుని సబ్జెక్టును ఎంపిక చేసుకుంటే మరింత సులువుగా ఉంటుంది. ముఖ్యమైన సబ్జెక్టు నుంచే స్కోరింగ్ సంపాదించేది.

మెయిన్స్ అనంతరం ఇంటర్వ్యూ ఎలా ఉంటుంది?

ఇంటర్వ్యూ అనగానే కంగారు పడుతుంటారు. నిజానికి కంగారు పడాల్సినంతగా ఉండదు. అడిగే ప్రశ్నలతో పాటు వ్యక్తిత్వ పరిశీలన ఉంటుంది. ఇంటర్వ్యూకు వెళ్ళే ముందు సాధారణ అంశాలతోపాటు సొంత ఊరు ప్రాముఖ్యత, పేరు అర్థం, నిర్థిష్ట లక్ష్యాలు, సాధారణ విజ్ఞానంపై ఉన్న అవగాహనను ఇంటర్వ్యూ చేసే యు.పి.ఎస్.సి బోర్డు సభ్యులు పరిశీలిస్తారు. సివిల్స్ కోసం ప్రతివ్యక్తి సుమారు 12 గంటలు చదవాల్సి వస్తుండటంతో సబ్జెక్ట్ నాలెడ్జ్ ఉంటుంది.

ఒక విద్యార్థి ఎన్నిసార్లు సివిల్స్ రాసే అవకాశం ఉంటుంది?

ఒ.సి అభ్యర్థి 21 నుంచి 32 సంవత్సరాల వరకు 6సార్లు, ఒ.బి.సి 21 నుంచి 35 సంవత్సరాల వరకు 9 సార్లు, ఎస్సీ,ఎస్టీ 21సంవత్సరాల నుంచి 37 సంవత్సరాల వయస్సు వరకు ఎన్ని పర్యాయాలైన సివిల్స్ పరీక్షలు రాయవచ్చు.

2017 సివిల్స్ మెయిన్స్‌లో కొన్ని మౌలిక మార్పులు చేసినట్లు తెలుస్తుంది?

యూపిఎస్సీ అక్టోబర్ 28, 2017 నుంచి నవంబర్ 3, 2017 తేదీల్లో సివిల్స్ మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. జనరల్ స్టడీస్, ఆప్షనల్ రెండింటిలో కొన్ని గుణాత్మకమైన మార్పులు చేసింది. జనరల్ స్టడీస్‌లో 150 పదాలతో రాయాల్సిన 10 మార్కుల ప్రశ్నలను, 250 పదాలతో రాయాల్సిన 15 మార్కుల ప్రశ్నలను కలిపి అడిగారు. అయితే కోచింగ్ తో సివిల్స్ సాధించవచ్చు. అదే జ్ఞానంతో సివిల్స్‌తో సమానమైన గ్రూపులను సాధించవచ్చనే దూరదృష్టితో విద్యార్థులు తీసుకుంటున్న శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది.


ఏ.మహేందర్ రెడ్డి



టెలికంతో భవిష్యత్తు ఆశాజనకం

గత శతాబ్దికాలంగా శరవేగంగా అభివృద్ధి చెందుతూ ఉపాధి కల్పనలో ముందుంటోంది టెలికం రంగం. టెలికం గురించి తెలియని వారుండరు. ఎందుకంటే మొబైల్ ఫోన్స్, స్మార్ట్‌ఫోన్స్ మొదలుకొని రక్షణరంగంలో కీలకమైన క్షిపణుల తయారీ , అంతరిక్ష రంగంలో శాటిలైట్స్ ప్రయోగాల వరకూ అంతా టెలికం రంగం ప్రగతి చెందటం వల్లనే. లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలను కల్పిస్తున్న టెలికం రంగం గురించి తెలుసుకుందాం...



ప్రతిఏటా సుస్థిర అభివృద్ధి బాటలో నడుస్తున్న టెలికం రంగంలో భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. టెలికం సెక్టార్ స్కిల్ కౌన్సిల్ అంచనా ప్రకారం 5జీ టెక్నాలజీ అందుబాటులోకి రానున్న కారణంగా 2020 –21 నాటికి టెలికం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో దాదాపు తొమ్మిది లక్షల కొత్త కొలువులు ఏర్పడనున్నాయి.

ఈ రంగంలో కొలువుల పరంగా రెండు మిలియన్ల ఉద్యోగాలున్నాయి. ఉత్పత్తి విభాగాల్లో 1.76 మిలియన్ ఉద్యోగాలు. సర్వీస్ ప్రొవైడర్స్ విభాగంలో 3.7లక్షల ఉద్యోగాలు. రానున్న ఐదేళ్లలో నాలుగు మిలియన్ల ఉద్యోగాలు. మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాల నేపథ్యంలో పరోక్షంగా భవిష్యత్తులో 50లక్షల మందికి అవకాశాలు కల్పించనున్నారు. కొత్త ఉద్యోగావకాశాలకు దోహదం చేస్తున్న ఎఫ్‌డిఐలు, స్వదేశీ సంస్థలతో ఒప్పందాలు, వ్యాపార విస్తరణ జరుగనున్నాయి. టెలికం రంగంలో కెరీర్ సొంతం చేసుకోవాలంటే ఈ కింది అర్హతలు ఉండాలి.

* బీటెక్ స్థాయిలో ఈసీఈ , సీఎస్ఈ, ఈటీఎం బ్రాంచ్‌లు
* టెలికం సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పలు షార్ట్‌టర్మ్ సర్టిఫికెట్ కోర్సులు
* టెలికం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ వైర్‌లెస్ టెక్నాలజీల ఆధ్వర్యంలో కోర్సులు
* బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో జీఎస్ఎం ఆర్ఎఫ్ ఇంజనీర్ సర్టిఫికెట్ కోర్సు.

షార్ట్‌టర్మ్ కోర్సులు: టెలికం రంగంలో షార్ట్‌టర్మ్ కోర్సుల తోనూ కొలువులు సొంతం చేసుకోవచ్చు. మొబైల్ అప్లికేషన్ డెవలపర్స్, సర్వీస్ టెక్నీషియన్స్, సైబర్ సెక్యూరిటీ ప్రొఫెషనల్స్, రిపెయిర్ ఎగ్జిక్యూటివ్స్ వంటి విభాగాల్లో ఇతర అకడమిక్ నేపథ్యం ఉన్న వారు కూడా ఉద్యోగాలు సంపాదించవచ్చు. సంబంధిత విభాగాల్లో ప్రస్తుతం పలు షార్ట్ టర్మ్ సర్టిఫికేషన్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఆయా విభాగాలపై నైపుణ్యాలను అందిస్తున్నాయి. అదేవిధంగా అడ్మినిస్ట్రేషన్, ఆపరేషన్స్‌కు సంబంధించి ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, హ్యూమనిటీస్ వంటి కోర్సులు పూర్తిచేసిన వారికి అవకాశాలు లభిస్తున్నాయి.

ఈసీఈ సీఎస్ఈ: బీటెక్ సీఎస్ఈ, ఈసీఈ పూర్తిచేసిన అభ్యర్థులకు టెలికం రంగంలో ఉన్నత అవకాశాలు లభిస్తాయి. నెట్‌వర్క్ ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెక్యూరిటీ, సైబర్ సెక్యూరిటీ, అప్లికేషన్ డెవలప్‌మెంట్ తదితర విభాగాల్లో విస్తరించాల్సిన విధులు , అందుకు అవసరమైన నైపుణ్యాలు ఈసీఈ, సీఎస్ఈ నేపథ్యం ఉన్న వారికి అకడమిక్‌గానే లభిస్తాయి. దీంతో వీరు సులభంగా ఉద్యోగంలో రాణించడానికి వీలు కుదురుతుంది.





కొత్త కోర్సులతో నూతన కొలువులు

యువత ఐటీ రంగంలో శరవేగంగా దూసుకుపోతున్నారు . ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రారంభ వేతనాలు మరింత తగ్గాయి. గత సంవత్సరం వరకు ప్రముఖ కంపెనీలు, మిగతా కొన్ని సంస్థలు ఏడాదికి రూ.2.1 లక్షల నుంచి రూ.2.4 లక్షల వరకు ఇచ్చేవారు. కాని ఈ ఏడాదికి ఆ మొత్తాన్ని రూ.1.8 లక్షల నుంచి రూ.2.1 లక్షలకు పరిమితం చేశాయి. 'గతంతో పోలిస్తే ఏడాది వేతనం రూ.40 వేల వరకు తగ్గిన మాట వాస్తవమే. పెద్ద కంపెనీలు ఇప్పటికీ రూ.2.4 లక్షల వరకు ఆఫర్ చేస్తున్నారు. అయితే బీపీవో ఉద్యోగాల్లో వేతనాలు రూ.1.8 లక్షల వరకు ఉంటున్నాయి' అని సెలక్షన్ ప్రక్రియలో కీలకంగా ఉండే కొంత మంది అధికారుల అభిప్రాయం. 'కోర్ రంగంలో ఉద్యోగాలు పెరగడం లేదు. ఇంజినీరింగ్ పూర్తిచేసిన వారందరికీ ఐటీ, ఐటీఈఎస్ ఉద్యోగాలే ఆధారమయ్యాయి. తక్కువ జీతం ఇచ్చినా వెంటనే ఉద్యోగంలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఎందుకంటే కోర్సు పూర్తయ్యాక కొంత కాలం ఖాళీగా ఉంటే.. ఉద్యోగం దొరకడం కష్టమవుతోంది. వేతనం తక్కువని బాధపడకుండా నూతన కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్ బాగుంటుందని పారిశ్రామికవేత్తలు పేర్కొంటున్నారు.

నూతన టెక్నాలజీలపై పట్టు సాధించాలి



వేతన ప్యాకేజీలు తగ్గిన విషయాన్ని పక్కనపెడితే ప్రారంభ ఉద్యోగులకు కొన్ని కంపెనీలు ఇప్పటికీ అధిక వేతనాలు చెల్లిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. 'ఐటీ రంగంలో ప్రస్తుతం కొత్త టెక్నాలజీలకు ఎక్కువ డిమాండ్ ఉంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, అడోబ్, ఏఐ తదితరాల్లో కోర్సులు నేర్చుకున్న వారికి ఏటా రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు చెల్లించేందుకు కంపెనీలు ముందుకొస్తున్నాయి. విద్యార్థులు ఎప్పటికప్పుడు మార్కెట్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నూతన టెక్నాలజీల్లో నైపుణ్యం సాధించాలి. నైపుణ్యాలు ఉంటే వేతనాలు అవే పెరుగుతాయి. సింప్లీ ఎర్న్ కెరీర్ డేటా ప్రకారం వివిధ కంపెనీల డిజిటల్ వ్యూహం ప్రకారం ఈ ఏడాది డిజిటల్ టెక్నాలజీ, క్లౌడ్, బిగ్ డేటా, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ మార్కెటింగ్ తదితర అంశాల్లో ఎప్పటికప్పుడు నైపుణ్యం పెంచుకున్న వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు మాత్రమే మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని గత ఆరు నెలల పరిస్థితులను బట్టి తెలుస్తోంది.

మంచి మాట

* విద్య నీడలాంటిది దాన్ని మన నుంచి ఎవరూ వేరు చేయలేరు.
* ఎంతసేపు చదివామనేది ముఖ్యం కాదు... ఎంత శ్రద్ధగా చదివామనేదే ముఖ్యం.
* మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది కేవలం విద్య ఒక్కటే.
* ప్రపంచాన్ని మార్చగల అత్యంత శక్తివంతమైన ఆయుధం చదువే.

కేంద్రం నుంచి రూ.162 కోట్ల ఆర్ఆర్ఆర్ నిధులు



మన తెలంగాణ/హైదరాబాద్: చిన్ననీటి వనరుల అభివృద్ధికి కేంద్రం ప్రవేశపెట్టిన జలవనరుల మరమ్మత్తులు, పునరుద్ధరణ, పునరావాసం (ఆర్ఆర్ఆర్) పథకం కింద కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.162 కోట్లు మంజూరు చేసిందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ నెలాఖరులోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, ఫిబ్రవరిలో ఈ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం, మెదక్, నల్లగొండ జిల్లాల్లో ఆర్ఆర్ఆర్ పనులు చేపడతామని చెప్పారు. ఖమ్మంలో 66, మెదక్‌లో 45, నల్లగొండలో 36 పనులు మొదలుపెట్టనున్నట్లు తెలిపారు. ఇదివరకే పూర్తైన పనుల తాలూకు యుటిలైజేషన్ సర్టిఫికేట్లు సమర్పించి, అదనపు గ్రాంట్లు వచ్చేలా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మిషన్‌కాకతీయ 4వ దశ పనులను ఈ నెల 15 కల్లా ప్రారంభించాలని సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంజూరైన మినీ ట్యాంక్‌బండ్‌ల పనులను కూడా త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. నిర్మాణ పనులు, నాణ్యతాప్రమాణాలపై సిఇలు, ఎస్ఇలు ఆకస్మిక తనిఖీలు చేయాలని, ఆఫీసుల్లో కూర్చొని సంతకాలు చేసే సంప్రదాయానికి స్వస్తి చెప్పాలని చెప్పారు. ఎంకె కింద చేపట్టే చెరువుల పునరుద్ధరణలో భాగంగా హరితహారం కార్యక్రమాన్ని అనుసంధానం చేసి, చెరువుకట్టకు ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. మొత్తం చెరువులకు జియో ట్యాగింగ్ ప్రక్రియను 15వ తేదీ నాటికి పూర్తిచేయాలని సూచించారు.

హత్యకేసులో నలుగురికి జీవిత ఖైదు

మనతెలంగాణ/కరీంనగర్‌లీగల్: పాత కక్షలతో ఒక యువకుడిని కత్తులతో పొడిచీ దారుణంగా హత్య చేసిన నిందితులకు జీవితఖైది విధిస్తూ కరీంనగర్ స్పెషల్ కోర్టు (ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోదక న్యాయస్థానం), ఐదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నాగరాజు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు గోదావరిఖని పట్టణంలోని కాళోజినగర్‌కు చెందిన దాసరి చెందు పలు నేరాలతో నిందితుడు, ఇతనిపై అత్యానేరం కూడా పోలీసుల చేత నమోదు కాబడింది. చందు హైదరాబాద్‌లో ఉండగా లీలపు వంశీ అనే వ్యక్తి తనకు ఎడ్లపల్లి శ్రవణ్‌కుమార్ అనే వ్యక్తి చంపుతానని బెదిరిస్తున్నాడని చందుకు తెలిపారు. చందూ వంశీని నెల రోజుల పాటు తన గదిలోనే ఉంచుకోగా ఇరువురి మధ్య గొడవలు జరిగి కక్ష్యలు పెంచుకున్నారు. తదుపరి చందూ గోదావరిఖనికి విచ్చేశాడు. చందూ కొంత మంది తో గ్రూపు ఏర్పరుచుకొని నాగపూర్ నుండి ఆయుధాలు తెప్పించుకున్నాడు. జైలులో ఉండగా నీలపే వంశీ ఆయన మిత్రుడు బోయిని ప్రశాంత్ మరికొంతమందితో కలిసి చందు మిత్రుడైన దినేశ్‌కుమార్‌ను కొట్టడంతో వారిపై కేసు నమోదైంది. జైలు నుండి విడుదలయి రాగానే వంశీపై దాడి చేయాలని ప్రయత్నించగా అతను హైదరాబాద్ వెళ్ళిపోయాడు. బోయిని ప్రశాంత్ 2014 నవంబర్ 11న చందుకు ఫోన్ చేసి వంశీ ఇంటి వద్ద ఉన్నాని సప్తగిరి కాలనీకి వచ్చి కలువాలని తెలిపాడు. దీంతో చందు దినేష్ కుమార్ సాయంత్రం 9 గంటలకు మహ్మద్ అవీజ్‌తో కలిసి సప్తగిరి కాలనీకి వెళ్ళారు. ప్రశాంత్‌కు గతంలోనే కాలుకు గాయం కావడంతో డాక్టర్ దగ్గరికి వెళ్ళి బ్యాండేజి మార్చుకోవాలని ప్రదీప్‌తో కలిసి వెళ్ళగా చందు అతని మిత్రుడు శ్రీకాంత్, దినేష్ కుమార్, అవీజ్‌లు కత్తులతో ప్రశాంత్ పై దాడి చేయగా అక్కడే ఉన్న శ్రీనివాస క్లీనిక్‌లో పలికి పరిగెత్తాడు. ప్రశాంత్‌కు ఒంటిపై తీవ్ర గాయాలు కావడంతో అక్కడే మరణించగా నిందితులు పారిపోయారు. ప్రశాంత్ తండ్రి గోదావరిఖణి ఒకటౌన్‌లో ఫిర్యాదు చేయగా సిఐ కేసు నమోదు చేశారు. డిఎస్‌పి మాల్లారెడ్డి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్ష్యాదారాలు పరిశీలించిన న్యాయమూర్తి నాగరాజు గురువారం నిందితులైన దాసరి చందు (23), సలిగంటి శ్రీకాంత్ (20), సాయిని దినేష్ కుమార్ (23), మహ్మద్ అవిజ్ (20) లకు జీవిత ఖైదితో పాటు 1500 చొప్పున ఒక్కొక్కరికి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నిందితులు పలు కేసులలో ఉన్నారని, చందు, శ్రీకాంత్‌లపై రౌడీ షీటర్ నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు

మన తెలంగాణ/చిగురుమామిడి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన పత్తెం రమేష్ తండ్రి రాజయ్య,పత్తెం రాజయ్యలపై ఎస్‌సి, ఎస్‌టి (అట్రాసిటీ) కేసు నమోదు చేసినట్లు గురువారం చిగురుమామిడి ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చిగురుమామిడి ఎంపిపి తాడూరి కిష్టయ్య ఇటీవల కానిస్టేబుల్‌పై దాడి చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విలేకరుల సమావేశం ఏర్పాటు చేయగా తెల్లవారు పత్రికల్లో అ వార్తలు ప్రచురితం అయ్యాయి. దీన్ని దృష్టిలో పెట్టుకోని పత్తెం రమేష్,రాజయ్యలు ఎంపిపిని కులం పేరుతో దూషించారని, సోషల్ మీడియాలో అసభ్యపరంగా పోస్ట్‌లు చేశారని అవేదన వ్యక్తం చేస్తు ఎంపిపి కిష్టయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అత్తను చంపిన కోడలు

మనతెలంగాణ/పాల్వంచ : అక్రమ సంబంధం ఎంతకైనా తెగిస్తుంది. అక్రమ సంబంధానికి అడ్డువచ్చిందని అత్తను ఓ కోడలు హత్యచేసింది. సంఘటన పట్టణ పరిధి వెంకటేశ్వరహిల్స్ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.... కెటిపియస్‌లో టెలిఫోన్ విభాగంలో పనిచేస్తున్న బూర్గుల దుర్గమ్మ (55) వెంకటేశ్వరహిల్స్‌కాలనీలో నివాసముంటుంది. పెద్ద కొడుకు రాజేష్ కోడలు భాగ్యరాణిలు దుర్గమ్మతోనే ఉంటున్నారు. రాజేష్ కెటిపియస్‌లో ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా రాజేష్ బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో డ్యూటీకి వెళ్లాడు. అత్త కోడళ్ళ మధ్య ఓ విషయంలో ఘర్షణ చెలరేగింది. దీంతో దుర్గమ్మను కోడలు భాగ్యరాణి దిండుతో మొహంపై అదిమి ఊపిరాడకుండా చేసి హత్యచేసింది. తన అక్రమ సంబంధానికి అత్త అడ్డువచ్చిందనే నెపంతోనే భాగ్యరాణి హత్యచేసినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులను గెంటేసిన కొడుకు

మన తెలంగాణ/పాల్వంచ : ఒక్క కొడుకు అని అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసి ప్రయోజకున్ని చేసిన తల్లిదండ్రులకు ఆ కొడుకే కర్కశంగా మారాడు. కన్న తల్లిదండ్రులను ఇంటి నుండి గెంటేశాడు. బాధితుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పట్టణ పరిధి గట్టాయిగూడెంకు చెందిన పమ్మి సుదర్శనాచారి కెటిపియస్‌లో 1వ గ్రేడ్ ఫోర్‌మెన్‌గా పని చేసి 2009లో పదవీ విరమణ పొందాడు. పదవీవిరమణ పొందాక గట్టాయిగూడెంలో తనకున్న స్థలంలో ఆంధ్రబ్యాంక్‌లో రుణం పెట్టి 2013 లో ఇళ్ళు కట్టాడు. సుదర్శనాచారికి ఇద్దరు కుమార్తెలు, కొడుకు సతీష్ ఉన్నాడు. సతీష్ గత కొన్ని సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొడుకు, కోడలు తండ్రి సుదర్శనాచారి తల్లి స్వరాజ్యలక్ష్మిలను తిట్టడం కొట్టడం చేస్తున్నారు. వేధింపులు భరించలేక వృద్ధ దంపతులు సంవత్సరకాలంగా బంధువుల వద్ద తలదాచుకుంటున్నారు. గురువారం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులను కొడుకు ఇంట్లోకి రానివ్వకుండా బయటకు గెంటివేసాడు. దీంతో తమకు న్యాయం చేయాలని ఇంటిముందు ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలని వారు వేడుకుంటున్నారు.

బొబ్బల మోహన్‌రెడ్డిపై మరో కేసు

మనతెలంగాణ/కరీంనగర్‌క్రైం: అక్రమ వడ్డీ వ్యాపారి, మాజీ ఎఎస్ఐ బొబ్బల మోహన్‌రెడ్డి మీద మరో కేసు నమోదైనట్లు కరీంనగర్ ఎసిబి డిఎస్పీ టి.సుదర్శన్‌గౌడ్ గురువారం తెలిపారు. 2013లో పోతార్ల గట్టయ్య అనే వ్యక్తికి రూ.12 లక్షలను అప్పుగా ఇస్తానని చెప్పిన మాజీ ఎ.ఎస్.ఐ బొబ్బల మోహన్‌రెడ్డి కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌లో గల పోతార్ల గట్టయ్యకు చెందిన ఆర్.సి.సి భవనాన్ని సెల్ కం జి.పి.ఏకు బదులు సేల్ డిడి చేయించుకోవడం జరిగింది. భవనాన్ని తన బినామి సంగీత పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగింది. అప్పు తీసుకున్న గట్టయ్య 2013 మార్చి నుండి 2015 సెప్టెంబర్ వరకు డబ్బును చెల్లించి తన ఇంటికి తనకు రిజిస్ట్రేషన్ చేయమని కోరగా మోహన్‌రెడ్డి నిరాకరించాడు. కాగా, అతని బావమరుదులు ఇట్టిరెడ్డి శ్రీపాల్‌రెడ్డి, బా నాల రమణారెడ్డిలతో పాటు మోహన్‌రెడ్డి భార్య లత, కుమారుడు అక్షయ్‌రెడ్డి, బినామీ ఇట్టిడి సంగీత ఆమె భర్త ఇట్టిడి ఎల్లారెడ్డిలు కలిసి ఇల్లు అప్పగించాలంటే మరో రూ.20 లక్షలు చె ల్లించాలంటూ అలాకాకుండా మళ్లీ ఇంటి కోసం వస్తే చంపుతామని బెదిరించడం జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసిన ఎసిబి అధికారులు విచారణ చేపట్టారు

అందరూ చూస్తుండగా..

(మొదటిపేజీ తరువాయి)

కత్తితో బెదిరించి సెల్‌ఫోన్‌లు, పర్సును తీసుకున్నారు. అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటన నుండి తేరుకోని దుండగులను అడ్డుకునేందుకు ప్రయత్నించాడు యాదగిరి. కానీ, ఒక దుండగుడు కత్తితో హెచ్చరించడంతో తన చేతిలోని హెల్మెట్ సహాయంతో వారిని నిలువరించేందుకు యత్నించాడు. అయినా బాధితుడిని హెచ్చరిస్తూ వాహనంపై పరారయ్యారు. యాదగిరి ఫిర్యాదు మేరకు జూబ్లిహిల్స్ పోలీసు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సమీపంలోని సిసిటివి కెమరాలో రికార్డయిన దృశ్యాల ఆధారంగా నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

ఇక పేచీల్లోని భూములపై దృష్టి

సంక్రాంతి తరువాత నుంచి 'బి' గ్రేడ్ భూరికార్డుల ప్రక్షాళన



మన తెలంగాణ / హైదరాబాద్ : భూ రికార్డుల ప్రక్షాళన ప్రక్రియ దాదాపు ముగిసిపోవడంతో ఇకపైన ప్రభుత్వం వివాదాస్పదంగా ఉన్న 'బి' గ్రేడ్ భూముల ప్రక్షాళనపై దృష్టి సారించనుంది. సంక్రాంతి నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఉప ముఖ్యమంత్రి మహమూద్ ఆలీ వ్యాఖ్యానించారు. గత నెల 31వ తేదీకల్లా రాష్ట్రవ్యాప్తంగా భూ రికార్డుల ప్రక్షాళనను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం దాదాపు ఆ లక్ష్యాన్ని సాధించిందని, కొన్ని గ్రామాల్లో మినహా అన్ని చోట్లా భూముల రికార్డుల పరిశీలన పూర్తయిందని తెలిపారు. రికార్డులను పరిశీలిస్తున్న క్రమంలో కొన్ని భూములు పలు రకాల వివాదాల్లో ఉన్న సంగతి వెలుగులోకి వచ్చిందని, వాటి ప్రస్తుత స్థితిగతులను క్రోడీకరించడంపై సంక్రాంతి నుంచి ప్రత్యేక డ్రైవ్ మొదలుకానుందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రం మొత్తంమీద దాదాపు 2.15 లక్షల ఎకరాల భూముల రికార్డులను పరిశీలించినప్పుడు సుమారు 17 లక్షల ఎకరాల భూమి వివిధ రకాల వివాదాల్లో ఉన్నట్లు తేలిందని ఆయన గుర్తుచేశారు. ఇలాంటి భూములన్నింటినీ ప్రభుత్వం 'బి' గ్రేడ్ భూములుగా పరిగణిస్తుందని, ఈ వివాదాల్లో ఎంత వరకు వీలైనంత త్వరగా పరిష్కరించడం సాధ్యమవుతుందో పరిశీలిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎక్కువగా సాదా బై నామా, పిఒటి కేసులు, అటవీ భూముల వివాదాల స్వభావంతో కూడినవి ఉన్నాయని వివరించారు. సివిల్ కోర్టు కేసుల్లో 85,702 ఎకరాలు, రెవిన్యూ కోర్టు కేసుల్లో 37,818 ఎకరాలు, అటవీ, రెవిన్యూ విభాగాల మధ్య వివాదాల్లో 2.09 లక్షల ఎకరాలు, గిరిజన భూముల బదలాయింపు వివాదాల్లో 82,925 ఎకరాలు, పిఒటి కేసుల్లో 2.26 లక్షల ఎకరాలు, శివాయిజమా వివాదాల్లో 1.18 లక్షల ఎకరాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇక గ్రామాల్లో కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు, ఒకరి పేరు మీద ఉన్న భూముల్ని మరొకరు అనుభవిస్తున్న సందర్భాలు.. ఇలా పలు రకాల స్వభావాలతో కూడిన భూములు దాదాపు 7.02 లక్షల ఎకరాల మేరకు ఉన్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఇలాంటి వివాదాల్లో ఉన్న భూములు దాదాపు 16.93 లక్షల ఎకరాలు ఉన్నట్లు గుర్తించామని, సంక్రాంతి పండుగ తర్వాతి నుంచి వీటి ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని వివరించారు. వీటికి తోడు వక్ఫ్ భూముల గణాంకాల్లో కూడా రెవిన్యూశాఖకు, వక్ఫ్ బోర్డుకు మధ్య చాలా తేడాలు ఉన్నాయని, వీటిపై కూడా ఒక స్పష్టత రావాల్సి ఉన్నదని తెలిపారు. రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే ఒక స్పష్టత వస్తుందని తెలిపారు.

చంచల్‌గూడ జైలులోనే మందకృష్ణ మాదిగ దీక్ష

ఎంఆర్‌పిఎస్ ఉద్యమాన్ని అణగదొక్కడం న్యాయం కాదు : విహెచ్

మన తెలంగాణ/హైదరాబాద్: ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చంచల్‌గూడ జైలులో ఉపవాస దీక్ష మొదలు పెట్టారని ఆ సంస్థ వర్గాలు వెల్లడించాయి. మందకృష్ణను కాంగ్రెస్ నేత, మాజీ ఎంపి వి.హన్మంత్‌రావు గురువారం జైలుకు వెళ్ళి కలిసి వచ్చిన తర్వాత ఉపవాస దీక్షచేస్తున్నట్లు మీడియాకు వివరించారు. బలహీన వర్గాలను అణగదొక్కడం టిఆర్ఎస్ ప్రభుత్వానికి తగదని విహెచ్ వ్యాఖ్యానించారు. ఎస్‌సి వర్గీకరణ బిల్లును టిఆర్ఎస్ పార్టీ కూడా అసెంబ్లీలో ఆమోదించిందని, అన్ని పార్టీల మద్దతును కూడగట్టి కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన టిఆర్ఎస్ ఆ దిశగా కృషిచేయడం లేదని విమర్శించారు. ఎంఆర్‌పిఎస్ నేతలు తమ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళాలని భావిస్తూ ఉంటే ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైళ్లలో పెట్టడం ఎంత వరకు సమంజసం అని విహెచ్ ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో నడిరోడ్డుపైనే ఎన్నో పోరాటాలు చేసినా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తరహాలో కేసులు పెట్టి జైళ్లలో పెట్టలేదని ఆయన గుర్తు చేశారుA. ప్రస్తుతం రాష్ట్రంలో దొరల పాలన సాగుతోందని, ఉద్యమకారుల్ని జైళ్లలో పెట్టడం వల్ల ఉద్యమాలు ఆగవన్నారు. ఉద్యమాలను తొక్కేయాలనే ఆలోచన మంచిదికాదని హితవు పలికారు.

ఇదే ఆలోచన అప్పటి కాంగ్రెస్‌కు ఉంటే ముఖ్యమంత్రి పీఠం దక్కేదా అని కెసిఆర్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. అవసరానికి వ్యక్తులను వాడుకుని ఆ తరువాత వదిలేయడం కెసిఆర్‌కే తగునన్నారు.ముఖ్యమంత్రిని పొగిడిన పవన్‌కళ్యాణ్, ఇప్పుడు మందకృష్ణపై అక్రమ కేసులు బనాయిస్తే ఎందుకు మాట్లాడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రులకు భజన చేసే ఇలాంటి నేతలకు ప్రజలు తప్పకుండా బుద్దిచెబుతారన్నారు.

గజల్ శ్రీనివాస్ కస్టడీ పిటిషన్‌ను తిరస్కరించిన కోర్టు

మన తెలంగాణ/హైదరాబాద్/ పంజాగుట్ట: లైంగిక ఆరోపణల కేసులో జైలుపాలైన గజల్ శ్రీనివాస్‌ను కేసు దర్యాప్తు నిమిత్తం విచారణకు అనుమతిని కోరుతూ అతనిని తమకు నాలుగు రోజుల కస్టడీ ఇవ్వాలంటూ పంజాగుట్ట పోలీసులు బుధవారం నాంపల్లిలోని పధ్నాల్గావ ఎసిఎంఎం కోర్టులో పిటషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటషన్‌పై నిందితుని తరపు న్యాయవాదితో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును గురువారానికి వాయిదా వేశారు. నిందితుడిని కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం ఏమాత్రం లేదంటూ నిందితుని న్యాయవాది చేసిన వాదనలకు అనుగుణంగా న్యాయమూర్తి సంతృప్తి చెందాడు. దీంతో కస్టడీ పిటిషన్‌ను రద్దు చేశారు. అనంతరం నిందితుని తరపు న్యాయవాది బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేయడంతో నేడు ఈ విషయంలో వాదనలు జరిగే అవకాశం ఉంది.

ఔటర్‌పై అదుపు తప్పిన కారు

ఒకరు మృతి, నలుగురికి గాయాలు

మన తెలంగాణ / ఘట్‌కేసర్ : ఔటర్ రింగ్‌రోడ్డుపై అదుపు తప్పిన కారు రేయిలింగ్‌ను ఢీకొని కింద పడటంతో కారు డ్రైవర్ మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు లింగాపూర్ గ్రామ సమీపంలోని అవుటర్ రింగ్‌రోడ్డుపై హయత్‌నగర్ నుండి ఘట్‌కేసర్ వైపు వెళుతున్న కారు అతివేగంగా వచ్చి అదుపు తప్పి రేయిలింగ్‌కు ఢీకొట్టడంతో కారు అవుటర్ రింగ్ రోడ్డు పైనుండి కిందకు పడటంతో డ్రైవర్ ఎం.డి జలాలుద్దీన్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న నల్లగొండకు చెందిన టీఎంఆర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ భిక్షమయ్య భార్య లక్ష్మ మ్మ, కూతురు యశస్విని, అల్లుడు వేణుగోపాలచారి, మనవరాలు స్వాస్వీలకు గాయాలయ్యాయని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలంటూ ఆందోళన

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: తామున్న చోటే డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించి ఇవ్వాలంటూ గుడి మల్కాపూర్‌లోని బస్తీవాసులు కొందరు ఆందోళనకు దిగారు. రోడ్డు పక్కన ఉన్న ప్రాంతంలో ఉన్న గుడిసెలను తొలగించేందుకు గురువారం మధ్యాహ్నం అక్కడకు వచ్చిన రెవెన్యూ, జిహెచ్ఎంసి అధికారులు వారు అడ్డుకున్నారు. తాము ఎంతో కాలంగా ఇక్కడ నివాసం ఉంటున్నామని ఈ స్థలాన్ని కేటాయించి ఇక్కడ తమకే డబుల్ బెడ్ రూం ఇళ్ళను నిర్మించాలని వారు ఆందోళన దిగారు. దీంతో అక్కడకు పోలీసులు చేరుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి సమీపంలోని సాయినగర్‌లో తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. బస్తీవాసులు అక్కడ పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో ఎక్కడికక్కడే ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో అటుగా వెళ్లే వాహన దారులు ఇబ్బంది పడ్డారు.

ప్రియుడితో కలిసి భర్త హత్య

మొదటిపేజీ తరువాయి)

చెప్పడంతో హైదరాబాద్, రాచకొండ పోలీసులు అప్రమత్తమయ్యారు. నాలుగు రోజుల క్రితం హత్యకు గురైన భర్త మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భార్యతో పాటు నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్మన్‌ఘాట్‌కు చెందిన కార్పెంటర్ నాగరాజు, జ్యోతి దంపతులు. తన భర్తతో సుఖం లేదని భావించిన జ్యోతి ఆరు నెలల నుంచి కార్తిక్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. దీనికి భర్త నాగరాజు అడ్డువస్తున్నాడని భావించిన జ్యోతి అతన్ని ఎలాగైనా మట్టుబెట్టాలని నిర్ణయానికి వచ్చింది. గత నెల 31 అర్ధరాత్రి పథకం ప్రకారం ప్రియుడు కార్తిక్ అతని ముగ్గురు స్నేహితులు దీపక్, నరేష్, యాసిన్‌లు కలిసి జ్యోతి ఇంటికి వచ్చారు. నాగరాజుతో మద్యం సేవించారు. మద్యంలో నిద్రమాత్రలు కలిపి తాగించడంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఆ తరువాత దిండుతో మొఖంపై అదిమిపట్టి ఊపిరిఆడకుండా చంపేశారు. ఆ తరువాత శవాన్ని కారులో చౌటుప్పల్‌లోని నిర్మాణుష్య ప్రదేశంలో పడేశారు. నిందితుల్లో ఒకరైన లాలాగూడకు చెందిన నరేష్ నాలుగు రోజుల నుంచి పడుతున్న భయాన్ని భరించలేక గురువారం గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు అతన్ని గాంధీఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించి కారణాలు అడిగారు. తన స్నేహితులతో కలిసి నాగరాజు అనే వ్యక్తిని చంపేశామని, ఈ కేసులో తన స్నేహితులు ఇరికిస్తారనే భయంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డానని నరేష్ చెప్పాడు

ప్యాక్స్‌ల పదవీకాలం పొడిగింపు?

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు 1964 సహకార చట్టంలోని ఎన్నికల ప్రక్రియను తెలిపే 22వ నియమానికి సవరణలు చేస్తూ వ్యవసాయ, సహకార కార్యదర్శి సి. పార్థసారథి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రూల్ 22ను కోఆపరేటివ్ సొసైటీల ఎన్నికల విధానాన్ని తెలుపుతోంది. సహకార ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత తీసుకువచ్చేందుకే నియమాల్లో సవరణలు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సవరణల ప్రకారం ప్రభుత్వ సహాయం లేని (అన్ ఎయిడెడ్) సొసైటీలకు కూడా రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీనే ఎన్నికలు నిర్వహించనుంది. అలాగే రిజిస్ట్రార్, జిల్లా కలెక్టర్‌లు ఇచ్చే ఎన్నికల ఉత్తర్వుల నియమాన్ని కూడా సవరించారు. మొత్తంగా ఎన్నికల అధికారులను, ఓటర్ల జాబితాను, ఎన్నికల ప్రక్రియను పూర్తిగా అథారిటీనే చూసుకుంటోంది. అయితే ఎన్నికలు జరగాల్సిన సొసైటీలు వాటి కాలపరిమితి ముగిసే కంటే 60 రోజులు ముందే ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. అర్హులైన ఓటర్ల జాబితాను ఇప్పటి వరకు కలెక్టర్ నియమించిన ఎన్నికల అధికారులే తయారు చేస్తున్నారు. ఇక మీదట సహకార రిజిస్ట్రార్ అనుమతితో ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. హైదరాబాద్ నుంచే ఎన్నికల అధికారులను నియమించి, పర్యవేక్షణ చేయనున్నారు. ఎన్నికలకు సంబంధించిన వ్యయాన్ని ఎన్నికల అధికారి ప్రతిపాదనలు సమర్పించి సొసైటీ నుంచే ఖర్చు చేసే విధానానికి సవరణలో స్వస్తి చెప్పారు. లోటుపాట్లు, అవినీతి చోటు చేసుకుంటున్నందున ఎలక్షన్ నిర్వహణ వ్యయం మొత్తం రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ నుంచే వెళ్తోంది. సవరించిన నియమాలకు అనుగుణంగా కోర్టు ఉత్తర్వుల ప్రకారం త్వరలోనే ఫిషర్‌మెన్ సొసైటీ (మూసా), అర్బన్ బ్యాంక్, ఒక హౌసింగ్ సొసైటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

సవరణల్లో మరికొన్ని..

- ఎన్నికల సందర్భంగా కమిటీలో ఏమైనా సీట్లు మిగిలిపోతే ఇక మీదట నామినేట్ చేయరు. తిరిగి ఎన్నిక చేపడుతారు. ఒకవేళ ఎన్నికైన తరువాత ఎవరైనా చనిపోవడం, అనర్హతకు గురికావడం, రాజీనామా చేయడం వంటివి ఉంటే మాత్రమే నామినేట్ చేసుకోవచ్చు. ఇందుకు ఆ కమిటీ పదవీ కాలం ఇంకా రెండున్నర సంవత్సరాల పైన ఉండాలి.
- నామినేషన్ సమర్పించే పత్రాలలో కూడా మార్పులు చేశారు.
- సొసైటీలో గరిష్టంగా 21 మంది మాత్రమే డైరెక్టర్లు ఉండాలి.
- పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీకి మార్గదర్శకాలు జారీ చేసే అధికారం ఉంది.
- 50 మంది కంటే తక్కువ ఓటర్లు ఉన్న సొసైటీలకు చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహించనున్నారు.

విద్యుత్‌పై ప్రశంసల వర్షం

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందులను తెలుసుకుంటున్నారు. ఇంతటి ఘన విజయం సాధించడంలో కీలక భూమిక పోషించిన విధానాలను స్వయంగా వచ్చి తెలుసుకోడానికి అనేక రాష్ట్రాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. గుజరాత్ రాష్ట్ర విద్యుత్ అధికారులు తెలంగాణ విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి ఏ విధంగా ఇంతటి విజయం సాధ్యమైందో ఫోన్‌లోనే తెలుసుకున్నారు. త్వరలోనే రాష్ట్రానికి వచ్చి క్షేత్రస్థాయి పర్యటన చేస్తామని, స్వయంగా రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను, సంతోషాన్ని తెలుసుకుంటామని తెలియజేశారు. విద్యుత్ సరఫరాలో సరికొత్త రికార్డు సృష్టించిన తెలంగాణను కృషిని, అనుభవాలను తెలుసుకోవాల్సిందిగా తమ రాష్ట్రంలో మంత్రులు, ఉన్నతాధికారులు తమకు సూచించారని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఉచితంగా 24 గంటల పాటూ విద్యుత్‌ను సరఫరా చేయవచ్చన్న సలహాను ఇప్పటివరకూ తమకు ఎందుకు ఇవ్వలేకపోయారంటూ మంత్రులు తమను ప్రశ్నించారని ఆ అధికారులు తెలంగాణ ఉన్నతాధికారులతో ప్రస్తావించారు. మూడు నాలుగు రోజులుగా నిరంతరాయ విద్యుత్ సరఫరా అవుతున్నందున్న ఆచరణాత్మక ఇబ్బందుల గురించి పలు రాష్ట్రాల అధికారులు ఆరా తీశారని రాష్ట్ర సచివాలయంలోని ఒక ఉన్నతాధికారి పేర్కొన్నారు. త్వరలోనే గుజరాత్ రాష్ట్రం నుంచి విద్యుత్ అధికారుల బృందం హైదరాబాద్ వచ్చి ఇక్కడి విద్యుత్ అధికారులతో భేటీ కానున్నదని, ఆ తర్వాత కొన్ని జిల్లాల్లోని గ్రామాలను స్వయంగా సందర్శించి ప్రజలతో మాట్లాడుతారని ఆ అధికారి పేర్కొన్నారు. ప్రస్తుతానికి గుజరాత్ రాష్ట్రం నుంచి క్షేత్రస్థాయి పర్యటనకు, అధ్యయనానికి అధికారులు రానున్నట్లు సమాచారం వచ్చిందని, అయితే తేదీలు ఇంకా ఖరారు కాలేదని సచివాలయ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. గుజరాత్ తరహాలోనే మరికొన్ని రాష్ట్రాల నుంచి అధికారులు తెలంగాణలో పర్యటించే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యుత్ రంగాన్ని పరిపుష్టి చేయడంలో ఏ రకమైన విధానాలను అవలంబించారు, అవసరాలకు సరిపోయే విద్యుత్‌ను ఎలా సమకూర్చుకున్నారు, ఉత్పత్తి సామర్థ్యానికి, డిమాండ్‌కు మధ్య ఉన్న వ్యత్యాసం ఏ స్థాయిలో ఉంది, వ్యవసాయ రంగానికి ఉచితంగా విద్యుత్‌ను ఇవ్వడంద్వారా ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం ఏ స్థాయిలోఉంది... ఇలాంటి అనేక వివరాలను ఫోన్‌లోనే తెలుసుకున్నారని, క్షేత్రస్థాయిలో జరిపే అధ్యయనం సందర్భంగా స్వయంగా రైతుల నుంచే అభిప్రాయాలు తెలుసుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. మరోవైపు 24 గంటల విద్యుత్ సరఫరాపై అధిక లోడ్ లాంటి సమస్యలేమైనా వస్తున్నాయా అనే అంశంపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సాంకేతిక అంశాలపై సమీక్షిస్తున్నారు.

దారి దోపిడీ లేకుండా

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. బ్యాంకులతో సంబంధం లేకుండానే ఈ పథకాన్ని అమలు చేయాలన్న విషయంలో మాత్రం ప్రభుత్వం ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చినట్లు తెలిసింది. భూరికార్డుల ప్రక్షాళన ప్రక్రియలో రాష్ట్రంలో మొత్తం సుమారు కోటిన్నర ఎకరాల మేర భూమి సాగులో ఉన్నట్లు స్పష్టమైంది. ఒక్కో ఎకరానికి నాలుగువేల రూపాయల చొప్పున మొత్తం సుమారు పన్నెండు వేల కోట్ల రూపాయల మేర ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనాకు వచ్చింది. ఇంత పెద్దమొత్తంలో నిధుల్ని ఖర్చు చేస్తున్నప్పుడు దాని ఫలాలు పూర్తిస్థాయిలో రైతులకు అందితేనే లక్ష్యం నెరవేరుతుందని ప్రభుత్వం నిశ్చితాభిప్రాయంతో ఉంది. బ్యాంకు డి.డి.లు, చెక్కులు, మొబైల్ వ్యాలెట్ తదితరాలను వినియోగించుకోవడంలో రైతులకు ఉన్న పరిమితుల దృష్ట్యా కొన్ని ఇబ్బందులు ఎదురుకావచ్చని అధికారుల్లో ఒక అభిప్రాయం ఉంది. రూపే కార్డుల్ని కొత్తగా జారీ చేయడం ద్వారా ఒక మేరకు పథకం విజయవంతమవుతుందని అభిప్రాయపడ్డారు. ఇక నగదు రూపంలో ఇచ్చినట్లయితే అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటాయని భావించింది. ఇబ్రహీంపూర్ నగదురహిత లావాదేవీల అను భవాలను అధ్యయనం చేయడం, గ్రామా న్ని ఎంపిక చేసి క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి అమలులో ఎదురయ్యే సాధకబాధకాలను విశ్లేషిం చి ఆ తర్వాత పైలట్ ప్రాజెక్టు రూపంలో అమలుచేయాలని ప్రభుత్వం ప్రాథమిక నిర్ణయానికి వచ్చింది.

పాత ఫీజులే

(మొదటిపేజీ తరువాయి)

ఫీజుల విషయంలో గందరగోళానికి తావు లేకుండా యథాతథ స్థితినే కొనసాగించాలని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య స్పష్టం చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు ప్రొఫెసర్ తిరుపతిరావు నేతృత్వంలో కమిటీపై ప్రభుత్వం అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోడానికి సమయం పడుతుందని, అప్పటివరకూ పాత ఫీజులే అమల్లో ఉంటాయని వివరించారు.ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖాధికారులకు సమాచారం అందించి పాత ఫీజులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కమిషనర్‌ను ఆదేశించారు.

మధ్యాహ్న భోజనం

మెనూలో మార్పులు

మనతెలంగాణ/హైదరాబాద్ : సర్కారు బడుల్లో ప్రధానోపాధ్యాయులు ప్రతి మూడు నెలలకోసారి విద్యార్థుల ఎత్తు, బరువు నమోదు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. మధ్యాహ్న భోజన పథకం మార్గదర్శకాలపై క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ పర్యవేక్షించాలని జిల్లా విద్యాధికారులకు సూచించింది. పౌష్టికాహారం లోపంతో విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని గుర్తించిన కేంద్రం మెనునూలో మార్పులు చేసింది. ఇందులో భాగంగా సరాసరిన ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి 24 గ్రాముల ప్రొటీన్లు, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 32 గ్రాముల ప్రొటీన్ అందేలా మెనునూ రూపొందించారు. కేంద్రం సూచనలకు అనుగుణంగా మెనూను రూపొందించి అమలు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. పోషకాహార నిపుణుల హెచ్చరికలను పరిగణలోకి తీసుకుని కొత్త మెనూను రూపొందించారు. గతంలో వారంలో మూడు రోజులు ఇస్తున్న ఉడకబెట్టిన గుడ్లను కొనసాగిస్తూనే పౌష్టికాహారం అందించే కొన్ని రకాల కూరలను మెనూలో చేర్చారు.

	పాత మెను	కొత్త మెను
1. సోమవారం	అన్నం+సాంబార్+ గుడ్డు	అన్నం+గుడ్డు+వెజిటేబుల్ కర్రి
2. మంగళవారం	అన్నం+వెజటబుల్ కర్రి	అన్నం+ఆకుకూరలతో పప్పు
3. బుధవారం	అన్నం+పప్పు+వెజటబుల్ కర్రి+గుడ్డు	అన్నం+గుడ్డు+వెజిటేబుల్ కర్రి
4. గురువారం	అన్నం+సాంబార్	అన్నం+వెజిటేబుల్ కర్రితోపాటు సాంబార్
5. శుక్రవారం	అన్నం+వెజటబుల్ కర్రి+గుడ్డు	అన్నం+గుడ్డు+వెజిటేబుల్ కర్రి
6. శనివారం	అన్నం+పప్పు+కూరగాయలు	పులావ్, వెజ్‌టబుల్ బిర్యానీ వంటి ప్రత్యేక వంటకం




రైతులకు 24గంటల విద్యుత్ దేశానికి ఆదర్శం : చాడ కిషన్‌రెడ్డి

మన తెలంగాణ/ నల్లగొండ టౌన్: దేశ చరిత్రలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 24గంటల విద్యుత్ అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిందని టిఆర్‌ఎస్ రాష్ట్రకార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రము ఖ్యమంత్రి కెసిఆర్ రైతులకు 24గంటల విద్యుత్‌ను అందిస్తానని హామీ ఇవ్వడమేకాక దానిని నేరవేర్చిన ఘనత కెసిఆర్‌కే దక్కిందన్నారు. విద్యుత్ రంగంలో గత 3 సంవత్సరాలుగా అధికారులతో సమీక్ష నిర్వహించి అధికారుల సమన్వయంతో విజయవంతంగా 24గంటల విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆఖరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణ వస్తే రాష్ట్రం అంధకారం అవుతుందని ఎద్దేవ చేస్తే తెలంగాణ వచ్చిన మూడు సంవత్సరాల్లోనే అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణ రాష్ట్రం స్వయం ప్రతిపత్తితో అభివృద్ధి సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతూ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. గత 60సంవత్సరాలుగా జరగని అభివృద్ధిని కెసిఆర్ మూడు సంవత్సరాల్లోనే చేసి చూపిస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక అక్కస్సుతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, బ్రాహ్మణ వెల్లెంల, ఉదయ సముద్రం ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయన్నారు.

యాసంగికి సింగూరు జలాలు

- ఘనపురం ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్న యాజమాన్యం
- ఎత్తిన గేట్లు సాయంత్రానికి మూసివేత



మనతెలంగాణ/ పుల్‌కల్ : ఘనపురం ఆయకట్టు పరిరక్షణకు గురువారం సింగూరు జలాలను విడుదల చేశారు. సంగారెడ్డి జిల్లాలో ఘనపురం ఆయకట్టుకు ప్రతీ ఏటా 4 టిఎంసిల నీటిని విడుదల చేయాలని ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందం మేరకు ప్రతీ ఏటా 4 టిఎంసిల నీటిని సింగూరు ప్రాజెక్టు నుండి విడుదల చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే యాసంగి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం దశలవారీగా 0.35 టిఎంసిల నీటిని విడుదల చేయాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు 6, 7 క్రస్ట్ గేట్లను మీటరున్నర ఎత్తు ఎత్తి దిగువన గల మంజీర రిజర్వాయర్‌లోకి నీటిని వదిలారు. యాసంగి సీజన్‌కు గాను ఘనపురం ఆయకట్టు పరిధిలోని రైతులు వ్యవసాయ బోరుబావుల వద్ద వరి నారు పోసుకున్నారు. చాలా తక్కువ నీటి సమార్థ్యం గల ఘనపురం ఆనకట్టలో ఎక్కువ నీరు నిల్వ చేయలేని పరిస్థితి ఏర్పడింది. దాంట్లో భాగంగానే రైతులు దమ్ములు చేసుకునేందుకు తొలి విడతగా 0.35 టిఎంసిలు విడుదల చేశారు. 0.35 టిఎంసిల చొప్పున జలాలను సాగుకు దశలవారీగా విడుదల చేయనున్నామని సంగారెడ్డి జిల్లా నీటి అభివృద్ధి అధికారి పి.రాములుగౌడ్, ప్రాజెక్టు డిప్యూటీ ఇఇ బాలగణేషలు తెలిపారు. సింగూరు జలాలు విడుదలవుతున్నందు మంజీర నదీ తీర పరీవాహక ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. దీంతో పాటు మత్స్యకారులు చేపల వేటకు నదిలోకి వెళ్లవద్దన్నారు. ఈ విషయాన్ని నదీ పరీవాహక ప్రాంత గ్రామాల్లో దండోరా వేయించనున్నామన్నారు. ఇదిలావుండగా, సింగూరు ప్రాజెక్టు నుంచి ఘనపురం ఆయకట్టుకు నీటిని వదిలిన అధికారులు సాయంత్రానికి ఎత్తిన రెండు గేట్లను సాయంత్రానికి మూసివేశారు. దిగువకు క్రస్ట్ గేట్ల ద్వారా 13,372 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 1,265 క్యూసెక్కులు మొత్తం 14,997 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఘనపురం ఆయకట్టు పరిధిలో వరి నాట్లు పూర్తయి కోతకు వచ్చేంత వరకు నీటి విడుదల కొనసాగుతూనే ఉంటుందని అధికారులు తెలిపారు.

జిఓ111 ఎత్తివేసే వరకు పోరాటం చేస్తాం



మన తెలంగాణ/ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: 84 గ్రామాలకు శాపంగా మారిన జిఓ 111 ఎత్తి వేసేవరకు సమిష్టిగా పోరాటం చేస్తామని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మొయినాబాద్ మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్‌లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్త నర్సింహరెడ్డి అధ్యక్షతన జిఓ 111 ఎత్తివేయాలన్న డిమాండ్‌తో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ జిఓ 111 ఎన్నికల హామీగా మారింది తప్ప ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పోయిందన్నారు. జిఓ 111 ఎత్తివేయించడానికి అధికార పార్టీలో చేరామని చెప్పుకున్న చేవెళ్ళ, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలు ఎందుకు కనీస ప్రయత్నం చేయడం లేదని ప్రశ్నించారు. 84 గ్రామాల్లో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పాలకులకు పట్టడం లేదని మండిపడ్డారు. గత ఎన్నికల సమయంలో చేవెళ్ల సభలో మాట్లాడిన కెసిఆర్ జిఓ 111 ఎత్తివేయడానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించిన ఇప్పటివరకు ఏనాడు కూడా దాని గురించి ఆలోచించిన దాఖలాలు లేవన్నారు. జిఓ111 పరిధిలోని 84 గ్రామాల ప్రజలను భాగస్వాములను చేసి ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. అఖిలపక్ష నాయకులతో కలసి ఈ నెలలోనే భారీ బహిరంగసభను నిర్వహిస్తామన్నారు.

అభివృద్ధిలో వెనకబడుతున్నాం: ప్రతాప్ రెడ్డి

జిఓ 111 మూలంగా నగరానికి అనుకోని ఉన్న శంషాబాద్, మొయినాబాద్, చేవెళ్లతో పాటు షాద్‌నగర్ నియోజక వర్గం అభివృద్ధిలో వెనకబడిపోతుందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మండిపడ్డారు. జిఓ 111 ఎత్తివేత కోసం నిర్వహించే ఉద్యమానికి షాద్‌నగర్ ప్రజలంతా అండగా ఉంటామని మీరు చేసే ప్రతి పోరాటంతో తాము భాగస్వాములమవుతామన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ప్రేంరాజ్ మాట్లాడుతూ జిఓ 111 మూలంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని దీనిపై సమిష్టిగా పోరాటం చేసి స్థానికులకు అండగా ఉండాలన్నారు.

టీచర్ పోస్టుల్లో ప్రభుత్వానివి తప్పుడు లెక్కలు

40వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ పాఠశాల విద్యా కార్యాలయం ముట్టడి



మన తెలంగాణ/ హైదరాబాద్/ హిమాయత్‌నగర్: హిందీ డిగ్రీలైన విద్వాన్, విశారద, ప్రవీణ, హెచ్‌పిటి పూర్తి చేసి టిఇటి అర్హత పొందిన అభ్యర్థులకు టిఆర్‌టిలో అవకాశం కల్పించాలని, 40వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ నిరుద్యోగ జాక్ అధ్వర్యంలో గురువారం వందలాది మంది నిరుద్యోగులు పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ టీచర్ పోస్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు లెక్కలు చూపిస్తున్నదని, రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014 జూన్ నెలలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి అసెంబ్లీలో 25వేల 600 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నయని, 2015లో జరిగిన మంత్రి వర్గ సమావేశంలో 15,600 టీచర్ పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకున్నారని, 2016లో మరో సారి తగ్గించి 10,900 పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి వర్గం నిర్ణయం తీసుకున్నదన్నారు. వాటిని ఇంకా తగ్గించి 8,792 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, బిసి నాయకులు సి. రాజేందర్, నీల వెంకటేశ్, నందగోపాల్, భూపేష్‌సాగర్, అనంతయ్య, పవన్, సురేష్‌సాగర్, మోత్కురు రవి, నిరుద్యోగ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎడమ కాల్వను పరిశీలించిన కృష్ణ యాజమాన్యం



మనతెలంగాణ/ నేరేడుచర్ల : నాగార్జున సాగర్ ఎడమ ప్రధాన కాలవను గురువారం కృష్ణా పవర్ మేనేజ్‌మెంట్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా నుంచి ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు సందర్శించారు. సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి1,2లతో పాటు జాన్ పహాడ్ మేజర్ తూములను కృష్ణానది యాజమాన్య కమిటీ సభ్యులు ఆనందకుమార్, రమేష్‌బాబు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.వెంకటేశ్వర్లు, హెచ్.వి. రాంప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సభ్యులు జి.శ్రీనివాస్, వై. పరమేష్‌లు పరిశీలించారు. ఈ బృందం సభ్యులు నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఎడమ కాలువ ప్రారంభం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నీరు సరఫరా చేసే తెలంగాణ రాష్ట్రం పరిధి వరకు సుమారు 180కిలోమీటర్ల కాల్వను ప్రతి 20నుండి 30కిలోమీటర్ల పరిధిలో అక్యాస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్(ఎడిసిపి) సాధనంతో నీటి సరఫరాను కొలిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సాగర్ ప్రాజెక్ట్ నుండి తెలంగాణ రాష్ట్రం గూండా అందించి నీటి సరఫరాలో ఎంత నష్టం వాటిల్లితుందనే విషయాన్ని పరిశీలించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు కృష్ణా యాజమాన్య బోర్డుకు సరఫరాలో వచ్చే నష్టం గురించి నివేదికలు ఇచ్చాయని తాము పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి ఇరు రాష్ట్రాల నివేదికలను పరిశీలించి ప్రభుత్వానికి తమ కమిటీ మరో నివేదిక ఇస్తుందని ఇరు రాష్ట్రాలు ఇచ్చిన నీటి సరఫరా నష్టాలు యదార్ధంగా ఉన్నాయా లేదా అని తమ పరిశీలనలో వెల్లడవుతాయని ఈ పరిశీలన ద్వారా రెండు రాష్ట్రాల నీటి సరఫరాకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని బృంద సభ్యులు పేర్కొన్నారు. ఈ బృందం వెంట ఎడమ కాల్వ మానిటరింగ్ ఇఇ వెంకటేశ్వర్లు, డి.ఇ కె.వి.నాగేశ్వరావు, ఎఇఇ రఘు, ఎన్ఎస్‌పి జెఇ బిక్షం, ఇన్‌స్పెక్టర్లు బిక్షమయ్య, రాము ఉన్నారు.

ఔటర్‌పై టైరు పేలి కంటైనర్ బోల్తా

ఇద్దరు దుర్మరణం



మన తెలంగాణ/ కీసర: మేడ్చల్ జిల్లా కీసర మండలంలో ఔటర్ రింగ్‌రోడ్డుపై వెళుతున్న కంటైనర్ లారీ టైరు పేలి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన గురువారం కీసర మండలం యాద్గార్‌పల్లి గ్రామం వద్ద చోటు చేసుకుంది. కీసర పోలీసుల వివరాల మేరకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజేష్ మిశ్రా (40), ప్రసాద్ (35)తో పాటు చంద్రశేఖర్ పటేల్, సరోజ్, అఖిల్‌లు కాంక్రీట్ దిమ్మెలతో కూడిన కంటైనర్ లారీ (ఎంహెచ్ 06 ఏఏ 4607)లో గత మూడు రోజుల క్రితం నాగపూర్ నుంచి మేడ్చల్‌కు బయలుదేరారు. గురువారం మధ్యాహ్నం యాద్గార్‌పల్లి గ్రామం వద్ద రింగ్‌రోడ్డు మీదుగా వెళుతున్న కంటైనర్ ముందు టైరు పేలింది. దీంతో లారీ ఇంజిన్ నుంచి కంటైనర్ విడిపోయి అదుపు తప్పింది. దీంతో రాజేష్‌పై కాంక్రీట్ దిమ్మెలు పడటంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తీవ్రంగా గాయపడ్డ ప్రసాద్ (35)ను చికిత్సకై ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. కంటైనర్‌లో ప్రయాణిస్తున్న చంద్రశేఖర్ పటేల్, సరోజ్, అఖిల్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.

అధికార ముసుగులో అక్రమ దందా

- ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఇంట్లో సోదాలు.. బయటపడ్డ పెద్ద ఎత్తున టేకు కలప



మన తెలంగాణ/ నారాయణఖేడ్ : నారాయణఖేడ్ ఫారెస్ట్ (అటవీశాఖ)లో విధులు నిర్వహిస్తున్న బీట్ ఆఫీసర్ శంకర్ తను నివాసం ఉంటున్న ఇంట్లో అక్రమంగా నిల్వ చేసుకున్న టేకు కలపపై నమ్మదగిన సమాచారం మేరకు ఫారెస్ట్ రేంజ్ అధికారి గణేష్, పోలీస్ శాఖ సిఐ వెంకటేశ్వర్లు, ఎస్. నరేందర్‌లు బీట్ ఆఫీసర్ శంకర్ ఇంట్లో సోదాలు నిర్వహించగా.. అక్రమంగా నిల్వ ఉంచిన కలప వెలుగు చూసింది. ఈ కలప కర్నాటక రాష్ట్రం నుంచి దిగుమతి చేసుకుని నారాయణఖేడ్ రేంజ్ పరిధిలోని సా మిల్లుల్లో కోయించి విక్రయిస్తున్నట్లు పలువురు ఆరోపించారు. కాగా చెట్లను రక్షించాల్సిన అధికారే భక్షకుడిగా మారాడని, ఈ దందా చాలా నెలులుగా కొనసాగిస్తున్నారని పలువురు వాపోయారు. అధికార ముసుగులో ఇలాంటి దందాను కొనసాగించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు సోదాలు నిర్వహించేందుకు వస్తున్నట్లు తెలుసుకున్న శంకర్ కలపను అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా.. అతని ఇంటి ముందే ఆటోను రెడ్ హ్యాండెండ్ పట్టుకున్నారు. కాగా తను నివాసం ఉంటున్న ఇంటి పక్క మరో గదిలో కలప ఉన్నట్లు అనుమానించి ఆ గదిని అధికారులు సీజ్ చేశారు. ఈ కలప విలువ రూ. 40వేల వరకు ఉంటుందని తెలిపారు. సీజ్ చేసిన మరో గదిలో కంగ్టి ఎంపిడిఒ అద్దెకు ఉంటున్నట్లు పలువురు పేర్కొన్నారు. కాగా మూడు రాష్ట్రాల సరిహద్దుకు కేంద్రమైన నారాయణఖేడ్‌లో వినూత్నంగా ఫారెస్ట్ అధికారే ఇలాంటి అక్రమాలకు పాల్పడడం గమనార్హం. ఈ విషయంపై బీట్ ఆఫీసర్ శంకర్‌ను ప్రశ్నించగా తన కుమారుడు నూతన ఇల్లు కడుతున్నందునే ఇతర రాష్ట్రం నుంచి కలపను దిగుమతి చేసుకున్నానని బదులు సమాధానం ఇచ్చారు.



డబుల్‌కు మంత్రి ఈటల శంకుస్థాపన

మన తెలంగాణ/ కమలాపూర్ : కమలాపూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని గూడూర్ గ్రామాల్లో ఆర్థిక మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ గురువారం రెండు పడక గదుల నిర్మాణాలకు శంఖు స్థాపన చేసారు. కమలాపూర్‌లోని 895 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిలో కేటాయించిన డబుల్ ఇళ్ళ నిర్మాణాల స్థలంలో మంత్రి ఈటల రాజేందర్ శంఖు స్థాపన చేపట్టి భూమి పూజ నిర్వహించారు. అనంతరం గూడూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 143 ప్రభుత్వ భూమిలో డబుల్ ఇళ్ళ నిర్మాణాలకు శంఖు స్థాపన చేసి భూమి పూజ చేపట్టారు మంత్రి ఈటల రాజేందర్. ఈ కార్యక్రమంలో ఎంపిపి లాండిగే లక్ష్మన్ రావు, జడ్‌పిటిసి మారపెల్లి నవీన్ కుమార్, సర్పంచ్‌లు శనిగరం సమ్మయ్య, అంకతి విజయ సాంబయ్య, జిల్లా కలెక్టర్ కాట అమ్రపాలి, ఆర్‌డిఓ వెంకారెడ్డి, టిఆర్‌యస్ మండల, పట్టణ శాఖ అధ్యక్షులు మాట్ల రమేష్, మౌటం సంపత్, ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మనతెలంగాణ / వర్ని : మండలంలోని సైద్‌పూర్, మెడ్‌పల్లి గ్రామాల నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను గురువారం వర్ని తహశీల్దార్ హరిబాబు పట్టుకున్నారు. ఆ ట్రాక్టర్లను తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. ప్రతి ట్రాక్టర్‌కు రూ.5వేలు జరిమానా విధించి పట్టుబడిన ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

హోటల్‌పై కార్పొరేటర్ అనుచరుల దాడి



మన తెలంగాణ/ మన్సూరాబాద్ : అర్ధ రాత్రి బిర్యానీ కావాలని అల్కాపురి హోటల్‌లో దౌర్జన్యం చేసిన ఆర్‌కెపురం కార్పొరేటర్ అనుచరులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్బీనగర్ ఎసిపి పృథ్వీధర్ రావు తెలిపిన వివరాల ప్రకారం అల్కాపురి చౌరస్తాలో లక్కి రెస్టారెంట్‌కు బుధవారం అర్ధరాత్రి 11:30 గంటల తర్వాత సుమారు కొంత మంది వ్య క్తులు వచ్చి బిర్యానీ కావాలని హోటల్ యాజమాని సోదరుడు అలీరాజ్ ఖాజ్మీని అడగారు. దీంతో హోటల్ సమయం ముగిసి పోయిందని బిర్యానీ లేదని తేల్చి చెప్పడంతో దీంతో సదరు వ్యక్తులు కార్పొరేటర్ అనుచరులమని మాకు బిర్యానీ లేదని చెబుతావా? అంటూ హోటల్‌లో హంగామా సృష్టించారు. దీంతో హోటల్ సిబ్బంది బిర్యానీ లేదనడంతో తినడానికి వచ్చిన కార్పొరేటర్ అనుచరులు హోటల్‌లో ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి హోటల్ యజమానిపై దాడికి దిగారు. హోటల్ యజమాని తలకు గాయాలు చోటు చేసుకున్నాయి. దీంతో హోటల్ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు సిసి ఫుటేజి పరిశీలించి, అనంతరం ఆర్‌కెపురం కార్పొరేటర్ అనుచరుల మీద పోలీసులు కేసు నమోదు చేశారు. దాడికి దిగిన వెంకటేశ్ యాదవ్, శ్రీశైలం యాదవ్, శ్రీరాములు, సంతోష్‌లను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. కాగా ఎల్బీనగర్ పిఎస్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి హోటల్‌పై దాడి జరిగిన సంఘటన నాకు ఎలాంటి సంబంధంలేదని నాగోల్ కార్పొరేటర్ భర్త చెరుకు ప్రశాంత్ గౌడ్ తెలిపారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి జరిగిన సంఘటనపై వివిద ఛానల్‌లో నాగోల్ కార్పొరేటర్ అనుచరులు దాడి చేసినట్లు ఆయన ఖండించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

మన తెలంగాణ/ షాబాద్ : రోడ్డు ప్రమాదంలో కారు, లారీ ఢీకొని ఇద్దరు షాబాద్ మండలానికి చెందిన టిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కాల్వ మాధవరెడ్డి (56), మలిపెద్ది పూర్ణచందర్‌లు మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం షాద్‌నగర్ నుంచి లో జడ్చర్ల వైపు వెళ్లుతున్న కారును బాలానగర్ మండలం పెద్దాయిపల్లి స్టేజ్ వద్ద జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వారు మృతి చెందడంతో సంకేపల్లిగూడ, సర్దార్‌నగర్‌లలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య

మన తెలంగాణ / కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లో భర్త వేధింపులకు మారంపల్లి లావణ్య(28) గురువారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్.ఐ మురళీ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. లావణ్య, భూమేశ్వరలు భార్యభర్తలు. వీరి మధ్య తరుచు గొడవలు జరిగేవి. ఒక వైపు ఆర్థిక ఇబ్బందులు మరో వైపు భర్త భార్యను అనుమానిస్తుండేవాడు. దీంతో విరక్తి చెందిన లావణ్య భర్త పొలం పనులకు వెళ్ళిన సమయంలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో నాయకుడి వీరంగం





మన తెలంగాణ/ హైదరాబాద్/పేట్‌బషీరాబాద్ : అతిగా మద్యం సేవించిన ఓ నాయకుడు వైన్ షాపులో పని చేసే వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సుచిత్ర ప్రాంతంలోని బ్యాంక్ కాలనీకి చెందిన జి.సంతోష్ (27) అంతర్జాతీయ రహదారి 44 పై గల ఉజ్వల లీకర్ మార్ట్‌లో సెల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి లిక్కర్ మార్ట్‌కు కారులో మేడ్చల్ జిల్లా వైఎస్ఆర్ సిపికి చెందిన నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి వచ్చారు. తనకు షాపు యజమాని తెలుసునని మద్యం బాటిళ్లను అరువుపై ఇవ్వాలని సంతోష్‌ను కోరాడు. దీనికి సంతోష్ ససేమిరా అనడంతో తన వద్ద క్రెడిట్ కార్డుతో శ్రీనివాస్‌రెడ్డి మద్యం కొనుగోలు చేశాడు. అనంతరం సంతోష్‌ను శ్రీనివాస్‌రెడ్డి అసభ్యకరమైన పదజాలంతో దుర్భసలాడుతూ చెప్పుతో దాడి చేశాడు. దీంతో గురువారం సంతోష్ పేట్‌బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్థానికుల ఆరోపణ

ఓ జిల్లాకు చెందిన నాయకుడే ఇలాంటి పనులు చేయడం సిగ్గు చేటని, అతిగా మద్యం సేవించి ప్రైవేటు ఉద్యోగి పై చేయి చేసుకోవడం, చెప్పుతో కొట్టడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.



44వ డివిజన్‌లో ఊపందుకున్న ప్రచారం

మన తెలంగాణ/ వరంగల్‌బ్యూరో : గ్రేటర్ వరంగల్‌లోని 44వ డివిజన్‌కు జరుగుతున్న ఉప ఎన్నికల్లో ప్రచారం ఊపందుకుంది. జనవరి 9న పోలింగ్ తేది దగ్గర పడుతుండడంతో అభ్యర్థులు ఇంటింటా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. అధికార టిఆర్‌ఎస్ పార్టీ తరపున అనిశెట్టి సరిత పోటి చేస్తుండగా బిజెపి నుంచి కొలను సంతోష్‌రెడ్డి బరిలో ఉన్నారు. గురువారం రోజున బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి మాట్లాడుతూ 44వ డివిజన్ ఉప ఎన్నికకు స్థానిక ఎంపి, ఎంఎల్‌ఏ, మేయర్ చేసినటువంటి అభివృద్ధికి రెఫరెండమని అన్నారు. ఇప్పటికే టిఆర్‌ఎస్ నాయకులు ఈ ఎన్నిక బిజెపి వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మకు రెఫరెండమంటున్నారు. రావు పద్మ ఒక ఎంఎల్‌ఏ, ఎంపి కానప్పుడు పద్మకు రెఫరెండమెలా అవుతుందని వారు ప్రశ్నించారు.

అభివృద్ధి బిజెపితోనే సాధ్యం

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నటు వంటి నిధులతోనే వరంగల్ అభివృద్ధి జరుగుతుంది తప్ప టిఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి ఏమిలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నటు వంటి నిధులను సక్రమంగా వినియోగించాలంటే బిజెపి అభ్యర్థి కొలను సంతోషరెడ్డిని గెలిపించాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, వరంగల్ అర్బన్ అధ్యక్షురాలు రావు పద్మ, రూరల్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ ఒంటేరు జయపాల్, 44వ డివిజన్ అధ్యక్షుడు దొంతుల వాసుదేవరెడ్డి, బిజెపి నాయకులు చాడ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

టిఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి: ఎంఎల్‌ఏ

తన నియోజకవర్గంలోని 44వ డివిజన్‌ను దత్తత తీసుకొని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎంఎల్‌ఏ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి టిఆర్‌ఎస్‌పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టిఆర్‌ఎస్ తరుపున నగర మేయర్ నరేందర్, కుడా చైర్మన్ మర్రి ఉన్నారు.



కమీషన్ల కోసమే కొత్త పథకాలు

రైతులపై సిఎం కెసిఆర్ చిన్నచూపు: ఎల్.రమణ

మన తెలంగాణ/ నిర్మల్‌టౌన్ : అసెంబ్లీలో బడ్జెట్ పెరిగినా ప్రజా సమస్యలు మాత్రం తీరడంలేదని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రమణ ఆరోపించారు. గురువారం నిర్మల్‌కు వచ్చిన ఆయన ఆర్‌అండ్‌బి అధితి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కెసిఆర్ ప్రతిసారి బడ్జెట్ పెంచామని గొప్పలు చెప్పుకుంటూ కాలం గడుపుతున్నారన్నారు. పేదల జీవన ప్రమణాలు ఏ మాత్రం పెరుగలేవని పేర్కొన్నారు. కమీషన్‌ల కోసం రోజుకో కొత్త పథకాన్ని ప్రవేశపెడుతున్నారని ధ్వజమెత్తారు. టిఆర్‌ఎస్ నాయకులు మాత్రం కమీషన్‌ల కోసం ఆశపడుతున్నారే తప్ప ప్రజల సమస్యపై శ్రద్ధ చూపడం లేదన్నారు. దేశంలోనే తెలంగాణ రైతు ఆత్మహత్యల విషయంలో రెండోవ స్థానంలో ఉందన్నారు. 3,300 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క రైతుకు నష్ట పరిహారం అందలేదన్నారు. టిఆర్‌ఎస్ పార్టీ కేవలం ఎన్నికల పట్ల, ఓట్ల మీద, కమీషన్లపై దృష్టి ఉందని విమర్శించారు. నిరుద్యోగుల జీవితాలతో కెసిఆర్ గత 36 నెలల నుండి ఆటలడుతున్నారన్నారు. ఒకవైపు ఉద్యోగాల ఖాళీ భార్తీ చేయకుండానే మరో వైపు ఉద్యోగాలు ఖాళీ అవుతున్నారు. ఎంఆర్‌పిఎస్ ఉద్యోగం చేస్తుంటే వారి నాయకులకు జైళ్ళలో పెట్టించారన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ధర్నచౌక్‌ను ఎత్తివేసి విపక్షాలపై కక్షకట్టారన్నారు. హైదరాబాద్‌లో మురళి అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే తమ నాయకులు వారి పరామర్శించడానికి వెళ్తే అక్రమంగా కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రజా కోర్టులో కెసిఆర్‌కు శిక్ష పడడం ఖాయమన్నారు. ఉద్యమకారులను కెసిఆర్ చిన్న చూపు చూస్తున్నరన్నారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎజెండాలోని దళితులకు మూడు ఎకరాల భూమి, లక్షన్నర ఉద్యోగాల భర్తీ తో పాటు తదితర అంశాలకు ప్రభుత్వ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నిర్మల్ జిల్లా అధ్యక్షుడు లోలం శ్యామ్ సుందర్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి, పట్టణ అధ్యక్షులు గంద్రత్ రమేష్, ముగారపు కాశీ తదితర నాయకులు ఉన్నారు.

నటనను కూడా ఇతర ఉద్యోగాల్లాగే చూడాలి



సౌత్ స్టార్ హీరోయిన్ శృతిహాసన్ ఏ విషయంపైన అయినా ముక్కుసూటిగా మాట్లాడేస్తోంది. తాజాగా మరోసారి సూటిగా మాట్లాడి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ భామ ఇండస్ట్రీలోని హీరోయిన్‌ల పరిస్థితిపై గళమెత్తింది. సినిమా హిట్ అయితే క్రెడిట్ అంతా హీరోలకే కట్టబెట్టడం తగదని విమర్శించిన శృతి... తర్వాత హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాలకు ఆదరణ పెరుగుతుండటం స్వాగతించదగ్గ పరిణామంగా పేర్కొంది. ఇక పెళ్లయిన హీరోయిన్‌లు సినిమాలకు దూరమవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. అలాగే తన విషయంలో అలా జరగదని శృతిహాసన్ పేర్కొనడం విశేషం. "హీరోయిన్‌లు పెళ్లయ్యాక భర్తకు ఇష్టం లేదనో, అత్తగారు వద్దన్నారోనని సినిమాలకు దూరమవడం దారుణమైన విషయం. యాక్టింగ్‌ను కూడా ఇతర ఉద్యోగాల్లాగే చూడాలి. నేను మాత్రం పెళ్లయి పిల్లలు పుట్టాక కూడా నటిస్తూనే ఉంటా. నటన అంటే నాకెంతో ఇష్టం"అని శృతిహాసన్ పేర్కొంది.

పోటీలో నిలబడే సత్తా ఉంది



సి.కళ్యాణ్

నందమూరి బాలకృష్ణ హీరోగా నయనతార, నటాషా జోషి, హరిప్రియ హీరోయిన్లుగా సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి.కళ్యాణ్ నిర్మిస్తున్న చిత్రం 'జై సింహా'. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం సంక్రాంతి పండుగ కానుకగా ఈనెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా సి.కళ్యాణ్ చెప్పిన విశేషాలు...

❑ **అద్భుతంగా రూపుదిద్దుకుంది...**

అన్ని పనులను పూర్తిచేసుకొని 'జై సింహా' ఫస్ట్‌కాపీ సిద్ధమైంది. సినిమా సెన్సార్‌కు వెళ్తోంది. సినిమా అద్భుతంగా రూపుదిద్దుకుంది.

❑ **ఎంతో సహకరించారు...**

హీరో నందమూరి బాలకృష్ణ సినిమాలో అద్భుతంగా నటించారు. సినిమా త్వరగా పూర్తి కావడానికి ఆయన ఎంతో సహకరించారు. ఆయన వల్లే సినిమా అనుకున్నట్టుగా పూర్తయింది.

❑ **ప్రేక్షకులకు గుర్తుండిపోతాయి...**

సినిమాలో బాలకృష్ణతో పాటు నయనతార, ప్రకాష్ రాజ్, హరిప్రియల పాత్రలు చాలా కీలకం. సినిమా చూసిన తర్వాత వారి నటన, పాత్రలు ప్రేక్షకులకు గుర్తుండిపోతాయి.

❑ **ముందుగా కుదరదని అన్నారు...**

బాలకృష్ణ, నయనతారలది సక్సెస్‌ఫుల్ కాంబినేషన్. ఈసారి కూడా ఈ కాంబినేషన్ సక్సెస్ అవుతుంది. స్టార్ హీరోయిన్ నయనతారకు అసలు డేట్స్ లేవు. ముందుగా ఈ సినిమా చేయడం కుదరదని ఆమె అన్నారు. కానీ కథ వినగానే ఓకే చెప్పి డేట్స్ అడ్జస్ట్ చేశారు.

❑ **కష్టమైన స్టెప్పులు వేశారు...**

సినిమాలో బాలకృష్ణ డ్యాన్సులు ప్రేక్షకులను అలరిస్తాయి. ఈ విషయంలో ఆయనకు హ్యాట్సాఫ్ చెప్పాలి. నేను వద్దన్నా కూడా కాదని ఎన్నో కష్టమైన స్టెప్పులు వేశారు. బన్నీ, చరణ్ వంటి యంగ్ హీరోలు వేసే స్టెప్పులు వేశారు.

❑ **మరోసారి నిరూపించుకుంటారు...**

దర్శకుడు కె.ఎస్.రవికుమార్ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ముందుగా అనుకున్నట్టే సినిమాను చక్కగా తీశారు. ఈ సినిమాతో ఆయన మరోసారి తానేంటో నిరూపించుకుంటారు.

❑ **భారీ బడ్జెట్‌తో...**

అనుకున్న దానికంటే సినిమా బడ్జెట్ ఎక్కువైంది. భారీ బడ్జెట్‌తోనే సినిమాను ప్రారంభించాం. కానీ చివరికి ఇంకా ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ఔట్‌పుట్ కూడా అంతే బాగా వచ్చింది.

❑ **మాస్, కమర్షియల్ ఎంటర్‌టైనర్...**

సంక్రాంతి పండుగ కానుకగా 'జై సింహా' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ పండుగకు మరికొన్ని సినిమాలు కూడా వస్తున్నాయి. కానీ మా సినిమాకు పోటీలో నిలబడే సత్తా ఉంది. మా చిత్రం పూర్తిస్థాయి మాస్, కమర్షియల్ ఎంటర్‌టైనర్. తప్పకుండా అందరికీ నచ్చుతుంది.

❑ **చప్పట్లు కొట్టేలా ఉంటుంది...**

కుంభకోణంలో సినిమాకు సంబంధించి ఒక ఎపిసోడ్ తీశాం. అందులో 2000 మంది పురోహితులు నటించారు. ఆ ఎపిసోడ్ చాలా బాగా వచ్చింది. సినిమాలోని హైలైట్స్‌లో అది ఒకటి. అలాగే వైజాగ్‌లో జరిగే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఇంకా మేజర్ హైలైట్. ఇక క్లైమాక్స్ ఎపిసోడ్ అయితే అందరూ లేచి చప్పట్లు కొట్టేలా ఉంటుంది.

❑ **తదుపరి చిత్రాలు...**

ప్రస్తుతం సాయిధరమ్‌తేజ, వి.వి.వినాయక్‌ల కాంబినేషన్‌లో చేస్తున్న 'ఇంటెలిజెంట్' సినిమా షూటింగ్ జరుగుతోంది. ఫిబ్రవరి 9న ఈ చిత్రం విడుదలవుతుంది. అలాగే రానాతో కలిసి '1945' అనే సినిమా చేస్తున్నాను.

విభిన్నమైన భావోద్వేగాలతో...



రాజ్‌తరుణ్

రాజ్‌తరుణ్, చిత్రా శుక్లా జంటగా శ్రీ రంజని దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించిన చిత్రం 'రంగుల రాట్నం'. ఈ చిత్రం సంక్రాంతికి విడుదలకానుంది. ఈ సందర్భంగా రాజ్‌తరుణ్‌తో ఇంటర్వ్యూ...

ట్రైలర్‌కు మంచి స్పందన...

ఈ సంక్రాంతికి 'రంగులరాట్నం' విడుదలకానుంది. తాజాగా విడుదలైన సినిమా ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. అయితే సినిమా అంతా పూర్తయిన తర్వాతే ప్రమోషన్ ప్రారంభించాం. ఇది అందరికీ సర్‌ప్రైజింగ్‌గా ఉంది.

కుటుంబమంతా చూడదగ్గ...

అందమైన లవ్ స్టోరీ ఇది. సినిమాలో మదర్ సెంటిమెంట్‌తో పాటు అన్ని ఎమోషన్స్ ఉంటాయి. రెండు గంటల పాటు కుటుంబమంతా కలిసి హాయిగా చూడదగ్గ సినిమా ఇది. సినిమా ఆద్యంతం వినోదంతో పాటు విభిన్నమైన భావోద్వేగాలు ఉంటా యి.

అందరి ఇళ్లలో చూసే...

సినిమాలో మధ్య తరగతి అబ్బాయిగా కనిపిస్తాను. ఇంతకుముందు నేను చేసిన సినిమాలకంటే ఇది విభిన్నంగా ఉంటుంది. నా లుక్ కూడా కొంచెం కొత్తగా ఉంటుంది. ఇక అందరి ఇళ్లలో చూసే యువకుడిలాంటి క్యారెక్టర్ నాది. బాధ్యత గల అమ్మాయిగా హీరోయిన్ క్యారెక్టర్ ఉంటే అల్లరి చిల్లరగా ఉండే హీరో పాత్ర నాది. మా ఇద్దరి మధ్య లవ్ స్టోరీ పేక్షకులను అలరిస్తుంది.

నేను తప్ప అందరూ కొత్తవారే...

అన్నపూర్ణ స్టూడియోస్ వంటి పెద్ద బ్యానర్‌లో సినిమా చేయడం ధైర్యంగా ఉంటుంది. 'ఉయ్యాల జంపాల' తర్వాత ఈ బ్యానర్‌లో నేను చేసిన రెండవ చిత్రం 'రంగుల రాట్నం'. సినిమాలో నేను తప్ప డైరెక్టర్‌తో పాటు అందరూ కొత్తవారే.

మంచి సినిమాలకు స్కోప్...

ఈ సంక్రాంతికి పెద్ద సినిమాలతో పాటు మా చిత్రం కూడా విడుదలవుతోంది. అయితే ఈ పండుగకు రెండు, మూడు సినిమాలకు మంచి స్కోప్ ఉంటుంది. పండుగ సెలవులు ఉంటాయి కాబట్టి అందరూ సినిమాలు చూస్తారు. యూత్, కుటుంబాలు సినిమాలు చూస్తారు కాబట్టి మంచి సినిమాలు ఖచ్చితంగా సక్సెస్ సాధిస్తాయి.

రెండు క్యారెక్టర్‌లు సమానంగా...

అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే ప్రేమ కథా చిత్రమిది. హీరో, హీరోయిన్ క్యారెక్టర్లు రెండూ సమానంగా ఉంటాయి. దీంతో అబ్బాయిలు, అమ్మాయిలు అందరికీ సినిమా నచ్చుతుంది.

సరిగ్గా సరిపోతుంది...

'రంగుల రాట్నం' అనే టైటిల్ సినిమాకు సరిగ్గా సరిపోతుంది. సినిమా చూస్తే ఈ టైటిల్ ఎందుకు పెట్టామనేది తెలుస్తుంది. కథలో నుంచి వచ్చిన అందమైన టైటిల్ ఇది. సినిమా స్క్రిప్ట్ కొత్తగా ఉంటుంది.

అనుభవమున్న దర్శకురాలిగా...

ఈ చిత్రంతో డైరెక్టర్‌గా పరిచయమవుతున్నారు శ్రీ రంజని. ఈ సినిమా చేసినంత సేపు నాకు ఒక లేడీ డైరెక్టర్‌తో పనిచేస్తున్నట్టు అనిపించలేదు. ఇత ర దర్శకులకు, ఆమెకు పెద్దగా తేడా కనిపించలేదు. అనుభవమున్న దర్శకురాలిగా ఆమె సినిమాను చక్కగా తెరకెక్కించారు.

సినిమాకు ప్లస్‌గా మ్యూజిక్...

'క్షణం' వంటి సినిమాలు చేసిన మ్యూజిక్ డైరెక్టర్ శ్రీచరణ్ సినిమాకు మంచి సంగీతాన్ని అందించారు. అతనికి తొలిసారిగా మంచి లవ్ స్టోరీకి మ్యూజిక్ అందించే అవకాశం లభించింది. పాటలు, ఆర్.ఆర్. అన్నీ బాగున్నాయి. సినిమాకు మ్యూజిక్ చాలా ప్లస్ అవుతుంది.

ఎప్పటికీ గుర్తుండిపోయే...

ఒక రోజు సుప్రియ నాకు ఫోన్ చేసి ఈ సినిమా చేస్తావా అని అడిగారు. ఆతర్వాత కథ విన్న వెంటనే సినిమా చేస్తానని చెప్పేశాను. నా కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రంగా ఇది నిలుస్తుంది.

పాట రాశాను...

ఈ సినిమాలో ఒక పాట రాశాను. ఇది అనుకోకుండా జరిగింది. ట్యూన్ నచ్చింది కాబట్టే పాట రాయగలిగా ను. నేను రాసిన నెలన్నర తర్వాత ఆ పాటను రికార్డింగ్ చేశారు. అయితే 'కిట్టుగాడు'లో కూడా నేను పాట రాశా ను.

కొత్తదనం కనిపిస్తుంది...

ఈ ఏడాది నా చిత్రాలు మూడు ఖచ్చితంగా ఉంటాయి. 'రాజుగాడు' చిత్రం ఫిబ్రవరిలో రిలీజయ్యే అవకాశం ఉంది. చేస్తున్న సినిమాలన్నింటిలో కొత్తదనం కనిపిస్తుంది.

అమీర్ తర్వాత బన్నీనే...

వక్కంతం వంశీ దర్శకత్వంలో స్టార్ హీరో అల్లు అర్జున్ నటిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా'. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. ఇటీవల విడుదలైన ఈ చిత్రం ఫస్ట్ ఇంపాక్ట్‌కు మంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత లగడపాటి శ్రీధర్ మీడియాతో మాట్లాడుతూ చెప్పిన విశేషాలు...



శ్రీధర్ లగడపాటి

29 గంటల్లో కోటి మందికి పైగా...

ఇప్పటివరకు అల్లుఅర్జున్ అంటే ప్రేక్షకులకు ఎంత ప్రేమో విన్నాను. కానీ మా సినిమా ఫస్ట్ ఇంపాక్ట్‌కు వచ్చిన స్పందనతో అది ఎలా ఉంటుందో చూశాను. 29 గంటల్లో కోటి మందికి పైగా దీన్ని వీక్షించారు.

మార్చికల్లా ఫస్ట్‌కాపీ...

ప్రస్తుతం 70 శాతం సినిమా షూటింగ్ పూర్తయింది. మరో 40 రోజుల్లో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. మార్చికల్లా సినిమా ఫస్ట్ కాపీ చేతికొస్తుంది.

దగ్గరుండి చూసుకుంటున్నారు...

అల్లు అర్జున్ ఒక పాన్ ఇండియా స్టార్. ఈ సినిమా కోసం ఆయన ఎంతో కష్టపడుతున్నారు. మేకోవర్, లుక్స్, టెక్నీషియన్స్ వంటి అన్ని విషయాల్ని ఆయన దగ్గరుండి చూసుకుంటున్నారు. సినిమా సినిమాకు తన హార్డ్‌వర్క్‌ను పెంచుతూ పైకి ఎదిగే హీరో అమీర్‌ఖాన్. ఆయన తర్వాత అలా చేసేది బన్నీనే అనేది నా నమ్మకం.

వాటి పవర్ మొత్తం ఇందులోనే...

మూడు బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్లు రేసుగుర్రం, టెంపర్, కిక్ చిత్రాల్లోని పవర్ మొత్తం ఈ ఒక్క సినిమాలో ఉంటుంది. దర్శకుడు వక్కంతం వంశీ తన టీమ్‌తో సినిమాను అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో కేవలం దేశభక్తి మాత్రమే కాకుండా రొమాన్స్, ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా ఉంటాయి.

యాక్షన్‌లో కూడా ఎమోషన్...

సినిమాలో యాక్షన్ ఎక్కువగానే ఉంటుంది. కానీ యాక్షన్‌లో కూడా ఎమోషన్ ఉంటుంది. కిచ్చ మాస్టర్, పీటర్ హెయిన్స్, రామ్ లక్ష్మణ్, రవివర్మ వంటి పెద్ద పెద్ద వాళ్లు ఫైట్స్ కంపోజ్ చేశారు. ఫైట్స్ అన్నీ గొప్పగా ఉంటాయి. ప్రతీది బెంచ్ మార్క్ ఫైట్‌లా ఉంటుంది.

అందుకే చేయలేదు...

ఇదొక యూనివర్సల్ సబ్జెక్ట్. ఈ చిత్రాన్ని మిగతా భాషల్లో కూడా డబ్ చేసి రిలీజ్ చేద్దామనే ఆలోచన ఉంది. కానీ బన్నీ త్వరలో తమిళంలో పరిచయం కానున్నారు. ఆ ఎంట్రీ డైరెక్ట్‌గా తమిళ్ సినిమా ద్వారానే ఉంటే బాగుంటుందని చేయలేదు.

'బాహుబలి'లాగే...

ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకుల్ని అలరిస్తుంది. 'బాహుబలి' చిత్రం తెలుగు సినిమా కీర్తిని ఎంతవరకు తీసుకెళ్లిందో ఇది కూడా అలాగే తీసుకెళ్తుంది. ఈ సంవత్సరం ఈ చిత్రం బిగ్గెస్ట్ హిట్‌గా నిలుస్తుంది.

యువతకు స్ఫూర్తిదాయకంగా...



అల్లాణి శ్రీధర్, డా.రంగరాజన్, డా.కె.వి.రమణాచారి, తుమ్మలపల్లి రామసత్యనారాయణ

అల్లాణి శ్రీధర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'చిలుకూరి బాలాజీ'. ఎస్.పి.బాలసుబ్రమణ్యం, సాయికుమార్, సుమన్, భానుశ్రీ మెహ్రా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో అల్లాణి శ్రీధర్ మాట్లాడుతూ "అప్పట్లో మాధవరెడ్డి చిలూకూరి బాలాజీ దేవాలయాన్ని నిర్మించడానికి ఎంత కష్టపడ్డారో ఈ చిత్ర నిర్మాతగా నేను కూడా ఎంతో కష్టపడ్డాను. ఈ చిత్రం పూర్తయిన తర్వాత చాలా కాలానికి ఇప్పుడు సినిమాను విడుదల చేస్తున్నాం. ఇందులో ఎస్పీ బాలసుబ్రమణ్యం...తిరుమల దాస్ అనే మహా గాయకుడి పాత్రలో కనిపిస్తారు. సాయికుమార్, సుమన్, భానుశ్రీ మెహ్రా కూడా అద్భుతంగా నటించారు. అజయ్‌శ్రీ సినిమాకు అద్భుతమైన స్క్రీన్‌ప్లే అందించారు. వెంకటేశ్వర స్వామి భక్తుడైన మాధవరెడ్డి చిలుకూరులో ఆలయం కట్టేందుకు ఎన్ని అడ్డంకులను అధిగమించాడనేది సినిమాలో చూడవచ్చు. యువతకు స్ఫూర్తిదాయకంగా ఉంటుంది ఈ చిత్రం. ఏడు కొండల వాడు కొండ దిగి రావడం, పుట్టలో నుంచి బయటపడే విధానం తదితర అంశాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఇక డా.కె.వి.రమణాచారి, డా.రంగరాజన్, దిల్‌రాజు సహకారంతో 'చిలుకూరి బాలాజీ' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం"అని అన్నారు. డా.కె.వి.రమణాచారి మాట్లాడుతూ "ఇది ధనుర్మాసం. శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఈ మాసం ఎంతో గొప్పది. ఈ మాసంలో వెంకటేశ్వర స్వామియే స్వయంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారనిపిస్తోంది. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో దాదాపు 60 థియేటర్లలో సినిమాను విడుదలచేస్తున్నాం"అని తెలిపారు. ఈ సమావేశంలో తుమ్మలపల్లి రామసత్యనారాయణ, డా.రంగరాజన్ పాల్గొన్నారు.



నయనతార

పొలిటికల్ డ్రామా 'కర్తవ్యం'

నయనతార ప్రధాన పాత్రలో గోపి నైనర్ దర్శకత్వంలో తమిళంలో ఇటీవల విడుదలై సూపర్‌హిట్‌గా నిలిచిన 'ఆరమ్' చిత్రాన్ని తెలుగులో 'కర్తవ్యం' పేరుతో విడుదల చేస్తున్నారు. శివ లింగ, విక్రమ్ వేదా వంటి సూపర్‌హిట్ చిత్రాలను అందించిన ఆర్.రవీంద్రన్, నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత శరత్‌మరార్ కలిసి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. పొలిటికల్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంలో నయనతార జిల్లా కలెక్టర్‌గా కనిపించనుంది. తెలుగులో ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తిచేసుకొని క్లీన్ 'యు' సర్టిఫికెట్‌ను అందుకుంది. త్వరలో ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా ఆర్.రవీంద్రన్ మాట్లాడుతూ "తమిళంలో ఈ చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. నయనతార కెరీర్‌లోనే పెద్ద విజయం సాధించిన ఈ సినిమా తెలుగులో కూడా మంచి విజయం సాధిస్తుందన్న నమ్మకం మాకుంది. తెలుగులో సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రానికి క్లీన్ 'యు' సర్టిఫికెట్ వచ్చింది. పవన్‌కళ్యాణ్‌తో గబ్బర్‌సింగ్, సర్దార్ గబ్బర్ సింగ్ వంటి సూపర్ హిట్ చిత్రాలను అందించిన నిర్మాత శరత్ మరార్‌తో కలిసి ఈ చిత్రాన్ని విడుదల చేయనుండడం చాలా ఆనందంగా ఉంది. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం"అని అన్నారు. నయనతార, విఘ్నేష్, రమేష్, సును లక్ష్మి, వినోదిని వైద్యనాథన్, రామచంద్రన్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: ఓంప్రకాష్, మ్యూజిక్: జిబ్రాన్, ఎడిటింగ్: గోపికృష్ణ.

సిద్ధమైన తారామణి

డి.వి. సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై యశ్వంత్ మూవీస్ సమర్పిస్తున్న చిత్రం 'తారామణి'. ఈ చిత్రం తమిళంలో చిన్న సినిమాగా విడుదలై బిగ్గెస్ట్ హిట్ సాధించి భారీ కలెక్షన్లను రాబట్టుకుంది. ఇప్పుడు ఈ చిత్రాన్ని నిర్మాత డి.వెంకటేష్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌లు ఆండ్రియా, అంజలి ప్రధాన పాత్రధారులుగా వసంత్ కుమార్ హీరోగా నటించారు. సెన్సార్ పూర్తిచేసుకొని 'ఎ' సర్టిఫికెట్‌ను పొందిన ఈ చిత్రం ఫిబ్రవరి నెలాఖరున ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా నిర్మాత డి.వెంకటేష్ మాట్లాడుతూ "నేటి యువత ప్రవర్తనకు అద్దంపట్టేలా ఉన్న ఈ చిత్రాన్ని తమిళ ప్రేక్షకులు బాగా ఆదరించారు. అందుకే మంచి సందేశమున్న ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నాను. తెలుగు యువతను ఆకట్టుకునేలా సినిమా ఉంటుంది. ఫిబ్రవరి నెలాఖరులో 'తారామణి'ని విడుదల చేస్తాం"అని అన్నారు. ఈ చిత్రానికి మ్యూజిక్: యువన్ శంకర్ రాజా, కెమెరా: తేని ఈశ్వర్, కథ, దర్శకత్వం: రామ్.



ఆండ్రియా, వసంత్ కుమార్

ఇక నుంచి సినిమాలకు సంగీతాన్ని అందిస్తా : ఆర్‌పి



అనుదీప్, ఆర్.పి.పట్నాయక్, సత్య యామిని, కోటి

చిత్రం, జయం, నువ్వు నేను, సంతోషం, మనసంతా, నువ్వు లేక నేను లేను వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు సంగీతాన్ని అందించిన మ్యూజిక్ డైరెక్టర్ ఆర్.పి.పట్నాయక్. ఆయన దర్శకనిర్మాతగా మారిన తర్వాత తన సంగీతంతో మ్యూజిక్ లవర్స్‌ను అలరించడం తగ్గిపోయింది. అయితే ఇప్పుడు ఆర్.పి.పట్నాయక్ రూపొందించిన 'నీతో ఏదో చెప్పాలని ఉంది...' అనే మెలోడి వీడియో సాంగ్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. సంగీత దర్శకుడు కోటి ఈ పాటను రిలీజ్ చేశారు. ఈ పాటకు సంగీతమందించడమే కాకుండా ట్యూన్‌కు తగ్గ సాహిత్యం కూడా ఆర్.పి.పట్నాయక్ అందించడం విశేషం. ఈ సాంగ్‌ను ఆస్ట్రేలియాలో చిత్రీకరించారు. 'బాహుబలి' సినిమాలో 'మమతల తల్లి...' పాటను పాడిన సత్య యామిని ఈ పాట పాడగా... సత్య యామిని, అనుదీప్ కలిసి నటించారు. శుక్రవారం ఈ పాట ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులో ఉంటుంది. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ కోటి మాట్లాడుతూ "కొత్త ఏడాది ఆర్.పి.పట్నాయక్ కొత్త కాన్సెప్ట్‌తో ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. నేను తన సంగీతానికి పెద్ద అభిమానిని. ఇకనుంచి అతను సినిమాలకు మ్యూజిక్ చేస్తాననడం ఆనందాన్నిచ్చింది"అని అన్నారు. ఆర్.పి.పట్నాయక్ మాట్లాడుతూ " 2004లో ఇకపై నేను వేరే సినిమాలకు సంగీతాన్ని అందించను అని ప్రకటించగానే కోటి నన్ను బాగా మందలించారు. కానీ అప్పటి పరిస్థితులు వేరుగా ఉన్నాయి. అయితే నా మ్యూజిక్‌ను నా అభిమానులే కాదు నేను కూడా మిస్ అయ్యాను. ఈ ఏడాది నుండి సినిమాలకు మ్యూజిక్ చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఒకప్పుడు సాంగ్స్ రికార్డింగ్ అంటే చెన్నై లేదా ముంబైకి వెళ్లాలనుకునేవారు. కానీ ఇప్పుడు హైదరాబాద్‌లో ఎందరో మంచి సింగర్స్ ఉన్నారు. ఈ సింగర్స్ అందరూ సొంతంగా ట్యూన్స్ కంపోజ్ చేసి పాడాలని నేను కోరుతున్నాను. అలాంటి ఇండిపెండెంట్ మ్యూజిక్‌ను ముందుకు తీసుకెళ్లడానికి ఆదిత్య మ్యూజిక్ వారు సిద్ధంగా ఉన్నారు. అలాగే ఎవరైనా సింగర్స్‌కు కాన్సెప్ట్ ఐడియాను డిజైన్ చేయడానికి నేను సిద్ధమే"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు కుంచె, విజయలక్ష్మి, వేణు, రవివర్మ, జెమిని సురేష్, యామినీ, అనుదీప్, మనీషా, ఆదిత్య మ్యూజిక్ మాధవ్, సత్యదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మన తెలంగాణ
9
హైదరాబాద్
శుక్రవారం
5, జనవరి 2018
www.manatelangana.news

ఆధార్ సమాచారమంతా భద్రంగా ఉంది : యుఐడిఎఐ

న్యూఢిల్లీ : ఆధార్ సమాచారమంతా భద్రంగా ఉందని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యుఐడిఎఐ) వెల్లడించింది. పేటీఎంలో రూ.500 చెల్లిస్తే పది నిమిషాల్లో వేరే వ్యక్తుల ఆధార్ వివరాలను తెలుసుకోవచ్చు అని వస్తున్న వార్తలపై యుఐడిఎఐ స్పందించింది. అవన్నీ వదంతులేనని ఆధార్ సమాచారమంతా భద్రంగా ఉందని తెలిపింది. ఈ మేరకు యుఐడిఎఐ గురువారం ఓ ప్రకటనను విడుదల చేసింది. 'రూ.500 చెల్లిస్తే పది నిమిషాల్లో బిలియన్ల ఆధార్ వివరాలను పొందవచ్చు అని వస్తున్న వార్తలన్నీ అసత్యాలు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఇటువంటివి సృష్టిస్తున్నారు. వాటిని ప్రజలు నమ్మొద్దు. ఆధార్ డేటా పూర్తి సురక్షితంగా, భద్రంగా ఉంది. ఎటువంటి వివరాలు బయటకు వెళ్లవు అని హామీ ఇస్తున్నాం' అని యుఐడిఎఐ పేర్కొంది. రూ.500 చెల్లిస్తే పది నిమిషాల్లో ఆధార్ వివరాలు పొందవచ్చంటూ ఇటీవల ఓ ఆంగ్ల మీడియా కథనాన్ని ప్రచురించింది. డబ్బు కట్టగానే ఏజెంట్ ద్వారా లాగిన్ ఐడి, పాస్‌వర్డ్ పొంది ఇతర వ్యక్తుల ఆధార్ వివరాలను లీక్ చేస్తున్నట్లు ఆ కథనంలో ఉంది. సదరు ఏజెంట్ ఇచ్చిన వివరాల ద్వారా మనకు కావాల్సిన వ్యక్తుల ఆధార్ వివరాలు, అతడి వ్యక్తిగత సమాచారం తెలుసుకునే వీలుంటుందని వార్తలో పేర్కొంది. అయితే ఆ వార్తలను యూఐడీఏఐ తోసిపుచ్చింది.

ఐడియా రూ.93 ప్లాన్ ఆఫర్




న్యూఢిల్లీ: ఐడియా సెల్యులార్ సరికొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను ప్రకటించింది. రూ. 93 ప్రీపెయిడ్ రీఛార్జ్‌తో రోజుకి 1 జిబి 3జి డేటా అందించనుంది. ఈ ప్లాన్ వాలిడిటీ 10 రోజులుగా ఉంటుంది. లాగే అపరిమిత లోకల్, ఎస్‌టిడి కాల్స్ ఆఫర్ అందివ్వనున్నట్లు ఐడియా వెబ్‌సైట్‌లో కంపెనీ వెల్లడించింది. అయితే రోజుకు 250 నిమిషాలు, వారానికి వెయ్యి నిమిషాల టాక్ టైం వరకే ఈ ఉచిత ఆఫర్ ఉంటుంది. ఈ పరిమితి దాటిన తరువాత సెకనుకు 1 పైసా వసూలు చేస్తుంది. ఉచిత ఎస్‌ఎంఎస్‌లు, రోమింగ్స్ కాల్స్ లాంటి ప్రయోజనాలు లేవీ లేవు. అలాగే రూ. 93 ప్రీ పెయిడ్ ప్లాన్ ఎంపిక చేసిన నెంబర్లకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. వాణిజ్యేతర వినియోగం కోసం మాత్రమే వర్తిస్తుందని కంపెనీ తెలిపింది. కాగా ఎయిర్‌టెల్ రూ.93 ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్ కూడా 10 రోజుల పాటు 3జి, 4జి డేటా 1జిబి అందిస్తుంది. అలాగే రోజుకు 100 ఎస్‌ఎంఎస్‌లు కూడా ఉచితంగా అందిస్తోంది. జియో కూడా రూ.98ల ప్రీపెయిడ్ రీఛార్జి ప్రణాళికలో 14 రోజుల వ్యవధిలో 2.1జిబి 4జి డేటాను 140 ఎస్‌ఎంఎస్‌లు కూడా ఉచితంగా అందిస్తుంది. జియో టెలికామ్ రంగంలోకి ప్రవేశించిన తర్వాత తప్పని పరిస్థితుల్లో ఇతర కంపెనీలు డేటా ఆఫర్లతో పోటీపడుతున్నాయి.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	33969.64	176.26	0.52%
నిఫ్టీ	10504.80	61.60	0.59%

CLOSING SENSEX REPORT



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.89
యూరో	75.33
బ్రిటిష్ పౌండ్	85.18
ఆస్ట్రేలియన్ డాలర్	49.84
కెనెడియన్ డాలర్	50.64
ఎమిరైట్ దిర్హామ్	17.67
స్విస్ ఫ్రాంక్	64.97
చైనీస్ యువాన్	9.76
మలేషియన్ రింగిట్	15.3
న్యూజిలాండ్ డాలర్	44.67
హాంగ్‌కాంగ్ డాలర్	8.31
జపనీస్ యెన్	0.57
కువైట్ దినార్	214.41
సౌతాఫ్రికన్ రాండ్	4.59

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28060	30010.70	–0.46%
ముంబై	28960	30973.26	0%
ఢిల్లీ	28500	30481.28	0.35%
కోల్‌కతా	29080	31101.60	0.17%
కేరళ	27200	29090.91	0.55%
బెంగళూరు	27400	29304.81	–0.36%
హైదరాబాద్	28050	30000.00	–0.5%
గల్ఫ్	1346.4	1440.00	0.65%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	శనివారం	మార్పు (%)
చెన్నై	41700.00	42000.00	–0.71
ముంబై	41700.00	42000.00	–0.71
ఢిల్లీ	41700.00	42000.00	–0.71
కోల్‌కతా	41700.00	42000.00	–0.71
హైదరాబాద్	41700.00	42000.00	–0.71

కోడిగుడ్లు (100కు) నెక్ రేటు



హైదరాబాద్	390	విశాఖపట్నం	390
వరంగల్	385	చిత్తూరు	388
విజయవాడ	385	చెన్నై	395
గోదావరి	385	బెంగళూరు	385

ఎటిఎంలలోకి రూ.200 నోటు

● వీలైనంత త్వరగా తీసుకురావాలి ● బ్యాంకులు, ఎటిఎం తయారీదారులకు ఆర్‌బిఐ ఆదేశాలు



న్యూఢిల్లీ : నోట్ల రద్దు తర్వాత పెద్ద నోట్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. దీంతో ప్రజలు చిల్లర కోసం ఇప్పటికీ నానా తంటా పడుతున్నారు. చిన్న నోట్ల సంఖ్యను పెంచడం ద్వారా చిల్లర కష్టాలను తీర్చవచ్చని భావించిన ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) ఇటీవల రూ.200 నోటును ప్రవేశపెట్టింది. గతేడాది సెప్టెంబరు నుంచి రూ.200 నోటు చలామణీలోకి వచ్చింది. కేవలం బ్యాంకుల ద్వారానే ఈ నోట్ల చలామణి జరుగుతోంది. దీంతో ప్రజలకు చిల్లర సమస్య తీర్చేందుకు ఈ నోట్లను వీలైనంత త్వరగా ఏటిఎంల ద్వారా అందజేయాలని బ్యాంకులను ఆర్‌బిఐ ఆదేశించింది. ఎటిఎంలలోనూ రూ.200 నోటును అందించాలని బ్యాంకులను, ఎటిఎం తయారీదారులను ఆర్‌బిఐ ఆదేశించినట్లు ఓ బ్యాంకర్ వెల్లడించారు. అయితే ఇది అమల్లోకి వచ్చేందుకు 5 నుంచి 6 నెలల సమయం పట్టొచ్చని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. 2000 రూపాయల నోట్లకు బదులుగా వీలైనంత ఎక్కువగా చిన్న నోట్లను ఎటిఎంల ద్వారా ప్రజలకు అందేందుకు రిజర్వు బ్యాంక్ ప్రయత్నాలు చేస్తోంది. రూ.200నోట్లను జారీ చేసేందుకు వీలుగా ఎటిఎంలలో మార్పుల ప్రక్రియను చేపట్టాయని సదరు అధికారులు పేర్కొన్నారు. మరో 5 నుంచి ఆరు నెలల్లో ఎటిఎంలలో రూ.200 నోట్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అయితే దీనిపై ఆర్‌బిఐ నుంచి ఎలాంటి స్పష్టత లేదు. రూ.200 నోట్లను ఎటిఎంల ద్వారా ఇవ్వాలంటే అందుకోసం వాటిలో మార్పులు చేయాల్సి ఉంటుంది. ఆ కరెన్సీ సైజుకు తగిన విధంగా మార్పులు చేపట్టాల్సి వుంటుందని ఎటిఎం తయారీ సంస్థలు చెబుతున్నాయి. ఈ మార్పుల కోసం ఒక్కో ఎటిఎంపై సగటున రూ.5000 ఖర్చు చేయాల్సి ఉంటుందని సమాచారం. దేశవ్యాప్తంగా మొత్తం 2.2 లక్షల ఎటిఎంలు ఉండగా, వీటన్నింటిని మార్చాలంటే రూ.110కోట్లు ఖర్చవుతుందని పేర్కొన్నాయి. ఇప్పటికే మార్పుల ప్రక్రియ ప్రారంభించగా, జులై నాటికి ఎటిఎంలలో రూ. 200నోట్లు అందుబాటులోకి వస్తాయని ఎటిఎం సంస్థలు పేర్కొంటున్నాయి.

ఎట్టకేలకు లాభాల్లోకి



ముంబై: ఈ ఏడాదిలో నాలుగోరోజు స్టాక్‌మార్కెట్లు లాభాలతో ముగిశాయి. వరుస నష్టాల నుంచి సూచీలు 2018లో ఎట్టకేలకు శుభారంభం చేశాయి. గురువారం మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 176 పాయింట్లు లాభపడి 33,970 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ మళ్లీ 10,500 పాయింట్ల మార్క్‌ను క్రాస్ చేసింది. ఆఖరికి 62 పాయింట్లు పెరిగి 10,505 పాయింట్ల వద్ద స్థిరపడింది. రియాల్టీ, ఆటోరంగ సూచీలు తప్ప మిగతా అన్ని సూచీలు లాభాలతో ముగిశాయి. ఎన్‌ఎస్‌ఇలో నిఫ్టీ సూచీ 10,513 నుంచి 10,441 మధ్య శ్రేణిలో కదలాడింది. అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్ల సానుకూలతతో దేశీ మార్కెట్ లాభాలతో ప్రారంభమైంది. గత మూడు రోజులుగా స్తబ్దుగా సాగిన సూచీలు ట్రేడింగ్ ఆరంభం నుంచి దూకుడు ప్రదర్శించాయి. మొండిబకాయిలతో కుదేలైన ప్రభుత్వ రంగ బ్యాంకులకు భారీ పెట్టుబడులను సమకూర్చేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ఒక ప్రతిపాదనను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీంతో ప్రభుత్వరంగ బ్యాంక్ షేర్లు లాభాల బాటలో పయనించాయి. మెటల్ సూచీ ఏకంగా 3 శాతం ర్యాలీ చేసి సరికొత్త గరిష్టాన్ని నమోదు చేసింది. యూరోపియన్ స్టాక్ మార్కెట్ల సానుకూలత ఇన్వెస్టర్లలో మరింత విశ్వాసాన్ని పెంచింది. దీంతో మార్కెట్ చివరకు లాభాలతో ముగిసింది. టాటా స్టీల్ డాక్టర్ రెడ్డీస్, ఎల్ అండ్ టి ఏసియన్ పెయింట్స్ షేర్లు 4 నుంచి 3శాతం లాభపడ్డాయి. టాటామోటర్స్, ఐషర్ మోటర్స్, బిపిసిఎల్, ఇన్ఫోసిస్, పవర్ గ్రిడ్ షేర్లు 1శాతం నష్టపోయాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్‌దే పైచేయి: ఫిచ్



న్యూఢిల్లీ: అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మధ్యకాలికంగా వృద్ధి సామర్థ్యం భారత్‌కే అత్యధికంగా ఉందని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ ఫిచ్ పేర్కొంది. భారత్ జనాభా, పెట్టుబడి అంశాలు, ప్రభుత్వం నిర్ణయాలు వంటివి పరిగణనలోకి తీసుకుంటే భారత్‌కు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. భారత్ వార్షిక వృద్ధి అంచనా 6.7 శాతంగా సంస్థ పేర్కొంది. చైనా, ఇండోనేషియా వంటి దేశాలు రెండో అధిక సామర్థ్యం కలిగి ఉన్నాయని, ఈ రెండు దేశాలు వృద్ధి రేటు అంచనా 5.5 శాతం కలిగి ఉన్నాయి. గత దశాబ్ద కాలంగా చూస్తే భారత్ జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) వృద్ధి రేటు వేగంగా ఉంటోందని, సగటున 7.3 శాతంగా ఉంటుందని ఫిచ్ నివేదిక పేర్కొంది.

కొత్త రూ.10 నోటు వచ్చేస్తోంది..

విడుదల చేసేందుకు సిద్ధమైన ఆర్‌బిఐ



న్యూఢిల్లీ : త్వరలో కొత్త 10 రూపాయల నోట్లను విడుదల చేసేందుకు ఆర్‌బిఐ (భారతీయ రిజర్వు బ్యాంక్) రంగం సిద్ధం చేసుకుంది. 2016లో డీమానిటైజేషన్(నోట్ల రద్దు) తర్వాత కొత్త నోట్లు సందడి చేస్తున్నాయి. ఇప్పటికే రూ.2వేలు, రూ.500, రూ.200, రూ.50ల కొత్త నోట్లను ఆర్‌బిఐ ప్రవేశపెట్టింది. ఈ జాబితాలోకి కొత్తగా రూ.10 నోటు చేరనుంది. త్వరలో మహాత్మా గాంధీ సిరీస్‌లో భాగంగా చాకొలెట్ రంగుతో కూడిన్ కొత్త రూ.10 నోట్లను ఆర్‌బిఐ ప్రవేశపెట్టనుంది. ఈ నోట్లపై గాంధీ బొమ్మతో పాటు ఒడిశాలోని ప్రముఖ కోణార్క్ సూర్య దేవాలయం చిత్రం కూడా ఉంటుంది. డిజైన్ విషయమై గతవారమే ప్రభుత్వం నుంచి ఆర్‌బిఐ అనుమతి పొందిండి. ఆ వెంటనే ఆర్‌బిఐ ఇప్పటికే ఒక కోటి రూ.10 నోట్లను కూడా ముద్రించింది. గతంలో 2005 సంవత్సరంలో రూ.10 నోటుకు మార్పులు చేపట్టారు. 12 ఏళ్ల తర్వాత మళ్లీ నోటును డిజైన్‌ను మార్పులు తీసుకొస్తున్నారు. 2017 ఆగస్ట్‌లో ఆర్‌బిఐ కొత్త రూ.50, రూ.200 నోట్లు ప్రవేశపెట్టింది. 2016 నవంబర్ 8న దేశంలో రూ1000, రూ.500 నోట్లు రద్దు చేస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ తరువాత వెయ్యి నోటుకు బదులు కొత్తగా రూ.2000 నోట్లను ప్రవేశపెట్టారు. గతేడాది డిసెంబర్ 8 నాటికి ఆర్‌బిఐ 16.96 బిలియన్ల రూ.500 నోట్లు, 3.6 బిలియన్ల రూ.2000 నోట్లు ముద్రించింది. ప్రస్తుత ఆర్‌బిఐ చిన్న నోట్ల ముద్రణపైనే దృష్టి కేంద్రీకరించింది.

రూ.80 వేల కోట్ల రిక్యాప్ బాండ్లకు లోక్‌సభ ఆమోదం



న్యూఢిల్లీ: బలహీనపడిన ప్రభుత్వరంగ బ్యాంకు(పిఎస్‌బి)లను బలోపేతం చేసేందుకు ప్రతిపాదించిన రూ.80 వేల కోట్ల రీక్యాపిటలైజేషన్ బాండ్లకు గురువారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. మొండి బకాయిలు పేరుకుపోవడంతో పిఎస్‌బిలు మూలధన కొరతతో కష్టాలు పడుతున్నాయి. వీటిని ఆదుకునేందుకు రెండేళ్లలో రూ.2.1 లక్షల కోట్ల మూలధన నిధిని అందిస్తామని గతంలో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఇచ్చిన హామీ మేరకు ఈ రీక్యాపిటలైజేషన్ బాండ్లను ప్రతిపాదించింది. తాజాగా నిధులకు ఆమోదంతో మార్చి నాటికి బ్యాంకులకు ప్రయోజనం చేకూర్చనున్నాయి. శుక్రవారం నాడు ఈ బిల్లుపై రాజ్యసభలో చర్చ జరగనుంది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలంటే బ్యాంకులను బలోపేతం చేయడం అత్యంత ప్రధానమని గుర్తించిన ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టింది. పిఎస్‌బిలకు ప్రతిపాదిత రీక్యాపిటలైజేషన్ బాండ్లు ఇవ్వడం ద్వారా అవి ఎస్‌ఎల్‌ఆర్ రహిత హోదాలో నాన్ ట్రేడింగ్‌గా ఉంటాయి. కాగా బలహీనపడిన ఆరు ప్రభుత్వరంగ బ్యాంకుల(పిఎస్‌బి)కు రూ.7,577 కోట్ల మూలధనం అందించాలనే ప్రతిపాదనకు బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. ఆర్‌బిఐ దిద్దుబాటు చర్య కింద ఈ బ్యాంకులు మూలధన సాయం పొందనున్నాయి. ఈ బ్యాంకుల్లో ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) పెరగడంతో ఆస్తుల నాణ్యత తగ్గిపోయి, మూలధన కొరత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం సహకారం అందివ్వనుంది. 2019 మార్చి ముగింపు వరకు ఇంద్రదనుష్ పథకం కింద రూ.70 వేల కోట్ల నిధులను అందివ్వనున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడిబిఐ బ్యాంక్, యుకో బ్యాంక్ సహా ఈ ఆరు బ్యాంకులు షేర్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా మూలధనం అందుకుంటాయి. యుకో బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలు మూలధనం పొందనున్నాయి. కాగా బ్యాలెన్స్ షీట్లను పటిష్టం చేసేందుకు పిఎస్‌బిలు తమ వద్ద తనఖా పెట్టిన ఆస్తులను విక్రయించాలని కూడా ఆర్థిక మంత్రిత్వశాఖ ఇటీవల సూచించింది.

సలీల్ వార్షిక వేతనం రూ.16.65 కోట్లు

ప్రకటించిన కిరణ్ మజుందార్ షా - సిక్కా కంటే ఇన్ఫీ సిఇఒ వేతనం తక్కువే..



న్యూఢిల్లీ: అసలే దిగ్గజ ఐటీ కంపెనీ.. దానికి సిఇఒ(చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) అంటే వేతనం మామూలుగా ఉండదు. ఇటీవల ఇన్ఫోసిస్ కొత్త సిఇఒగా బాధ్యతలు చేపట్టిన సలీల్ పరేఖ్ జీతమెంతో తెలుసా? అక్షరాలా ఏడాదికి రూ. 16.25 కోట్లు.. అయితే ఈ వేతనం ఇంతకుముందు సిఇఒగా పనిచేసిన విశాల్ సిక్కా కంటే తక్కువ కావడం విశేషం. సలీల్ స్థిర వేతనం కింద రూ.6.5 కోట్లు, వేరియబుల్ పే కింద రూ.9.75 కోట్లతో పాటు రూ.3.25కోట్ల విలువ గల స్టాక్ యూనిట్లను అందిస్తున్నట్లు కంపెనీ స్వతంత్ర బోర్డు సభ్యురాలు కిరణ్ మజుందార్ షా తెలిపారు. వీటితో పాటు వార్షిక ఈక్విటీ గ్రాంట్ల కింద రూ.13 కోట్లు కూడా సలీల్ తీసుకోనున్నట్టు తెలిపారు. ఇక వన్ టైమ్ ఈక్విటీ గ్రాంట్ కింద మరో రూ.9.75 కోట్లు తీసుకుంటారు. ఇక స్టాక్ యూనిట్ల విలువ ప్రతి ఆర్థిక సంవత్సరానికోసారి మారుతుందని తెలిపారు. గతేడాది ఇన్ఫోసిస్ సిఇఒ విశాల్ సిక్కా అనూహ్యంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నియామకాలు చేపట్టిన సంస్థ సలీల్ పరేఖ్‌ను సిఇఒగా నియమించగా, మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. సిక్కా తర్వాత ఇన్ఫీ సిఇఒ పదవిని చేపట్టిన రెండో ప్రమోటేతర వ్యక్తి సలీల్, కంపెనీ ఏర్పాటు చేసిన కమిటీ ఆయన్ని ఎంపిక చేసింది. అంతేగాక సంస్థ ఆరో సిఇఒ కూడా సలీలే.. ఐదేళ్ల పాటు సిఇఒ పదవిలో కొనసాగుతారు. మాజీ సిఇఒ సిక్కా 2016–17 ఆర్థిక సంవత్సరానికి గానూ 6.75మిలియన్ డాలర్లు(దాదాపు రూ.42 కోట్లు) వేతనం అందుకున్నారు. దీనిపై సంస్థ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

మూడో వారంలో మారుతీ స్విఫ్ట్ బుకింగ్



న్యూఢిల్లీ : ఎంతగానో వేచిచూస్తున్న మారుతీ సుజుకీ ఇండియా స్విఫ్ట్ కారు బుకింగ్ ఈనెల మూడో వారంలో ప్రారంభం కానుంది. 2016లో జపాన్‌లో ఆవిష్కరించిన హ్యాచ్‌బ్యాక్ కారు భారత్‌కు వస్తుందని, 2017లో భారత్ రోడ్లపై ఈ కారును తిరగనుందని అంతా భావించారు కానీ అది జరగలేదు. అయితే అందరూ ఎంతో ఆతృతగా చూస్తున్న కొత్త స్విఫ్ట్ కారు విషయంలో కంపెనీ ఇప్పుడు శుభవార్త వినిపించింది. మారుతి సుజుకి కొత్త 2018 మోడల్ స్విఫ్ట్‌ను ఫిబ్రవరిలో జరిగే ఆటో ఎక్స్‌పోలో అధికారికంగా ప్రవేశపెట్టనుంది. దీనికి సంబంధించిన ప్రీ బుకింగ్‌లు జనవరి మూడో వారంలో ప్రారంభించనుందని తెలుస్తోంది. తాజా నివేదికల ప్రకారం ఈ కారు ధర రూ .5 లక్షల నుంచి రూ. 8 లక్షల మధ్య నిర్ణయించవచ్చని సమాచారం. ఇప్పటివరకు ఉన్నమోడల్స్‌కు పూర్తిగా డిఫరెంట్‌లో లుక్‌లో తీసుకొస్తోంది.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
టాటాస్టీల్	763.45	732.00	760.25	734.95	25.30	3.44
లార్సెన్	1,320.00	1,280.10	1,315.70	1,275.30	40.40	3.17
ఒఎన్‌జిసి	200.00	195.20	199.50	193.45	6.05	3.13
డా.రెడ్డీస్ ల్యాబ్స్	2,420.00	2,343.00	2,410.80	2,339.00	71.80	3.07
ఎసియన్ పెయింట్స్	1,178.00	1,145.90	1,172.05	1,141.90	30.15	2.64
బజాజ్ ఫైనాన్స్	1,758.25	1,714.00	1,754.00	1,715.30	38.70	2.26
కోల్ ఇండియా	279.85	272.20	277.80	271.85	5.95	2.19
సన్‌ఫార్మా	583.95	560.10	581.20	569.05	12.15	2.14
వేదాంత	341.50	330.05	339.10	332.50	6.60	1.98
హెచ్‌పిసిఎల్	420.95	408.50	418.85	410.95	7.90	1.92

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
టాటాపవర్	101.00	99.25	99.60	100.80	1.20	1.19
టాటామోటార్స్	433.30	425.75	429.95	433.90	3.95	0.91
ఐచర్ మోటార్స్	28,957.60	28,415.00	28,570.75	28,814.35	243.60	0.85
బిపిసిఎల్	495.50	490.50	491.50	494.90	3.40	0.69
పవర్ గ్రిడ్ కార్ప్	202.85	200.00	200.35	201.65	1.30	0.64
ఇన్ఫోసిస్	1,021.00	1,009.60	1,015.40	1,021.30	5.90	0.58
హెచ్‌సిఎల్ టెక్	899.45	883.05	893.10	897.30	4.20	0.47
హీరో మోటోకార్ప్	3,759.95	3,721.55	3,738.90	3,755.20	16.30	0.43
మారుతి సుజుకి	9,488.00	9,367.20	9,386.25	9,416.60	30.35	0.32
బోస్క్	19,790.00	19,580.00	19,652.65	19,692.95	40.30	0.20

మన తెలంగాణ
10 హైదరాబాద్
శుక్రవారం
5, జనవరి 2018
www.manatelangana.news

రజనీ ఉద్దేశం అదే అయితే అడ్డుకుంటాం : స్టాలిన్



చెన్నై : ద్రవిడ సిద్ధాంతాన్ని నిర్మూలించడమే రజనీ ఉద్దేశం అయితే.. అతనికి ఇక రాజకీయ భవిష్యత్తే ఉండదని డిఎంకె నాయకులు స్టాలిన్ అన్నారు. 'పెరియార్, అన్నాదురై, కరుణానిధి లాంటి నేతలతో ద్రవిడ భూమి తరించింది. కాని, ద్రవిడ సిద్ధాంతాన్ని నిర్మూలించేందుకే రజనీ రాజకీయాల్లోకి వచ్చాడంటూ ఆయన అనుచరులు ప్రచారం చేస్తున్నారు. ఒకవేళ అదే నిజమైతే మాత్రం ఆయన అడ్డుకునేందుకు ముందు మేమే ఉంటాం. ఆయన రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారటం ఖాయం. గతంలో అలా ప్రయత్నించి విఫలమైనవారు చాలా మందే ఉన్నారు. కానీ, తనది ఆధ్యాత్మిక పార్టీ అని రజనీకాంత్ చెబుతున్నారు కాబట్టి దాని గురించి ఇప్పుడే ఏం స్పందించలేం. పార్టీ ప్రారంభించే ముందు కేవలం సంప్రదాయ రీతిలో మాత్రమే కరుణను కలిశారు.. వేరే ఉద్దేశం లేదు. ఇంతకుముందు విజయకాంత్ కూడా పార్టీ ప్రారంభించే సమయం లో ఇలానే కరుణను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు' అని స్టాలిన్ పేర్కొన్నారు. కాగా, కరుణానిధిని కలిసిన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయటంతోపాటు ఆరోగ్యం గురించి రజనీ వాకబు చేశారు. ఇదిలా ఉంటే రజనీ ఇంతకు ముందులా ట్విట్టర్లో అభిప్రాయాలను తెలియజేయటం మానుకుని.. ప్రజల్లోకి రావాలంటూ డిఎండికె పార్టీ అధ్యక్షుడు విజయకాంత్ సతీమణి ప్రేమలత చెబుతున్నారు.



మోడీకి ఇజ్రాయెల్ ప్రధాని బహుమానం !

ఢిల్లీ: ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యహూ ప్రధాని నరేంద్ర మోడీకి ఓ బహుమతి ఇవ్వనున్నారు. త్వరలో బెంజిమిన్ భారత్ పర్యటనకు వస్తున్నారు. ఈ సందర్భంగా నరేంద్రమోడీ కోసం అరుదైన బహుమతి తీసుకొస్తున్నారు. ఆ మధ్య ప్రధాని మోడీ ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లినప్పుడు సముద్ర తీరంలో ఓ బగ్గీ జీపులో నెతన్యాహూతో కలిసి ప్రయాణించారు. ఇప్పుడు అదే జీపును మోడీకి బహుమతిగా తీసుకొస్తున్నట్లు జెరూసలేం వర్గాలు వెల్లడించాయి. ఆ బగ్గీ జీపు పేరు గాల్‌మొబైల్. ఇది సముద్రపు నీటిని శుద్ధి చేసి మంచి నీటిగా మారుస్తుంది. గతేడాది జులైలో మోడీ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఆ సందర్భంలో ఇరు దేశాల ప్రధానులు ఓల్గా బీచ్‌లో కాసేపు సేద తీరారు. అనంతరం అక్కడి అధికారులు ఈ గాల్‌మొబైల్ వాటర్ ప్యూరిఫైర్ వాహనం గురించి మోడీకి వివరించారు. ఈ వాహనంలో మోడీ, నెతన్యహూ కాసేపు ప్రయాణించారు కూడా. తాజాగా నెతన్యహూ భారత పర్యటనకు వస్తున్నారు. జనవరి 14 నుంచి నాలుగు రోజుల పాటు ఆయన ఇక్కడ పర్యటిస్తారు. ఈ సందర్భంగా మోడీ కోసం ఆ జీపును తీసుకొస్తున్నట్లు ఇజ్రాయెల్ వర్గాలు పేర్కొన్నాయి. దీని ధర 3,90,000 షెకెల్స్ (ఇజ్రాయెల్ కరెన్సీ పేరు) ఉంటుందని అంచనా. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.70లక్షల పైమాటే. ఇది రోజుకు 20వేల లీటర్ల సముద్రపు నీటిని తాగునీరుగా శుద్ధి చేస్తుంది. వరదలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తాగునీటి కోసం ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం లేని భూభాగాల్లో పనిచేసే జవాన్లను ఉపయుక్తంగా ఉంటుంది.

రక్షణ లేకుండా వెళ్లిన రక్షణ మంత్రి



బెంగళూరు: కేంద్రమంత్రి.. అదీ అత్యంత కీలకమైన రక్షణ మంత్రి పదవిలో ఉన్న నిర్మలా సీతారామన్ ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా సామాన్య వ్యక్తిగా వీధిలో నడిచి అందర్నీ ఆశ్చర్యపర్చారు. ఇటీవల బెంగళూరులో పర్యటించిన నిర్మలా సీతారామన్ ఓ సమావేశం ముగించుకొని మధ్యాహ్నం సమయంలో ఎస్పీ ఆఫీసు నుంచి నడుచుకుంటూ వెళ్లి ఎదురుగా ఉన్న హోటల్‌లో భోజనం చేశారు. ఆ సమయంలో ఆమె వెంట కొంతమంది అధికారులు, సామాన్యులు తప్ప ఎలాంటి భద్రతా సిబ్బంది లేరు. ఆ వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్ అయింది. నిర్మలా సీతారామన్ నిరాడంబర వ్యక్తిత్వాన్ని అందరూ మెచ్చుకుంటున్నారు.

పెరూ ప్రమాదంలో 51కి చేరిన మృతులు

లిమా : పెరూలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన బస్సు ప్రమాదంలో మృతుల సంఖ్య 51కి చేరింది. సహాయక సిబ్బంది రెండు రోజులు శ్రమించి శిథిలాల నుంచి 51 మంది మృతదేహాలను వెలికి తీశారు. ప్రయాణికులతో హౌచో నుంచి బయలుదేరిన బస్సు డెవిల్స్ కర్వ్‌గా పిలవబడే ఇరుకు రోడ్డు వద్ద ఓ ట్రక్కును ఢీకొని కొండ ప్రాంతం గుండా సముద్రపు అంచులో పడిపోయిన విషయం తెలిసిందే. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు 24 గంటల పాటు సహాయక చర్యలు చేపట్టి శిథిలాల నుంచి మృతదేహాలను వెలికి తీశారు. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలతో బయటపడగా వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి నిలకడగానే ఉందని, అయితే కొందరికి చేయి ఎముకలు విరిగాయని చాన్‌కే ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ విక్టర్ విరు ఓ టివి చానెల్‌కు వెల్లడించారు.

13 మంది తమిళ జాలర్లు అరెస్టు

రామేశ్వరం : శ్రీలంక నేవీ గురువారం 13 మంది తమిళనాడు మత్స్యకారులను అరెస్టు చేసింది. కచ్చతీవు ద్వీపంలోని తమ ప్రాదేశిక జలాల్లో అక్రమంగా చేపలు పడుతున్నారని ఆరోపిస్తూ జాలర్లను అదుపులోకి తీసుకుంది. ఇనుపరాడ్లతో మత్స్యకారుల పడవలను, చేపలు పట్టే సామాగ్రిని ధ్వంసం చేసింది. కచ్చతీవు సమీపంలో చేపలు పట్టేందుకు తంగచిమడం నుంచి 2 వేలమంది జాలర్లు 523 పడవల్లో బుధవారం వెళ్లినట్లు మత్స్యశాఖ అదనపు డైరెక్టర్ ఎ.మణికందన్ తెలిపారు. విషయం తెలుసుకున్న శ్రీలంక నౌకా సిబ్బంది జాలర్ల వద్దకు వచ్చి 13 మందిని అరెస్టు చేశారని ఆయన చెప్పారు. అరెస్టులతోనే సరిపెట్టకుండా చేపల వలలను, 50 పడవలను ఇనుపరాడ్లతో ధ్వంసం చేశారన్నారు. అనంతరం రెండు పడవలతో పాటు అరెస్టు చేసిన జాలర్లను కంగెసంతురాయకు తరలించారు. ఇదిలా ఉండగా, గత ఏడాది డిసెంబర్ 31న కూడా శ్రీలంక నేవి నెడుంతీవు వద్ద 13 మంది తమిళ మత్స్యకారులను అరెస్టు చేసింది. అయితే గత ఏడాది తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన 89 మంది మత్స్యకారులను శ్రీలంక అధికారులు విడుదల చేశారు.

కాల్పుల ఘటనతో జికె పబ్ లైసెన్స్ రద్దు

న్యూఢిల్లీ: దక్షిణ ఢిల్లీలోని గ్రేటర్ కైలాష్ పబ్ లైసెన్స్‌ను పోలీసులు రద్దు చేశారు. గత నెలలో 30 ఏళ్ల వ్యక్తిని మరో వ్యక్తి కాల్చి చంపడంతో పబ్‌ను రద్దు చేసినట్లు ఢిల్లీ పోలీస్ అధికారులు తెలిపారు. పార్కింగ్ అంశానికి సంబంధించి నవంబర్‌లో బాధితుడు, నిందితుడికి మధ్య జరిగిన వాగ్వాదమే హత్యకు దారి తీసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పబ్ తెరిచినప్పటి నుంచి కాల్పుల ఘటన వరకు జరిగిన ఘటనలకు సంబంధించి విచారణకు ఆదేశించినట్లు సీనియర్ పోలీస్ అధికారులు తెలిపారు. జిల్లా విజిలెన్స్ విచారణలో వెల్లడైన అంశాల ఆధారంగా ఎం బ్లాక్ మార్కెట్‌లో పని చేస్తున్న ఐదుగురు బీట్ ఆఫీసర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వారి దుష్ప్రవర్తనకు గల కారణాలు తెలపాలని కోరామన్నారు. గ్రేటర్ కైలాష్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒకు, డివిజన్‌కు చెందిన సిబ్బందికి తమ దుష్ప్రవర్తనపై షోకాజ్ నోటీసు జారీ చేశామని తెలిపారు.

ధనబలంతో గెలిచారు : కమల్ హాసన్



చెన్నై : ఆర్‌కే నగర్ ఉప ఎన్నికల్లో టిటివి దినకరన్ గెలుపుపై ప్రముఖ నటుడు కమల్ హాసన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ధనబలంతోనే దినకరన్ గెలిచారని కమల్ ఆరోపించారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో, తమిళ రాజకీయాల్లో ఆర్‌కే నగర్ ఉప ఎన్నికలు మాయని మచ్చగా అభివర్ణించారు. ఆర్‌కే నగర్ గెలుపు ఓట్లను కొనుగోలు చేయడంతోనే సాధ్యమైందన్నారు. దీన్ని ఓ స్కామ్ అని కూడా తాను వ్యాఖ్యానించనని..ఇది పట్టపగలు జరిగిన నేరమని వ్యాఖ్యానించారు. స్వతంత్ర అభ్యర్థి (దినకరన్) తో పాటు పాలక పక్షం ఓటర్లకు వెలకట్టిందని ఆరోపించారు. తమిళ మేగజీన్ ఆనంద వికటన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కమల్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ఓటర్లను ఉద్దేశించి మీరు అమ్ముడుపోయారని వ్యాఖ్యానించారు. కమల్ ఆరోపణలను దినకరన్ తోసిపుచ్చుతూ ఉప ఎన్నికలో తన గెలుపును జీర్ణించుకోలేక ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు.

ఉత్తరాదిలో ఉష్ణోగ్రతలు పతనం



న్యూఢిల్లీ : ఉత్తర భారతాన్ని చలిపులి వణికిస్తోంది. ఢిల్లీ సహా అన్ని రాష్ట్రాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అతి శీతల గాలులకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మధ్యాహ్నమైనా కూడా చాలా ప్రాంతాల్లో సూర్యుడు కనిపించడం లేదు. విపరీతంగా మంచు కురియడంతో పాటు, పొగ మంచు కప్పేస్తుండడంతో రవాణా సేవలకు ఆటంకం ఏర్పడుతోంది. రైలు, విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలు సైతం ఎక్కువగా జరుగుతున్నాయి. తీవ్రమైన చలితో ప్రజల ప్రాణాలు పిట్టల్లా రాలిపోతున్నాయి. ఢిల్లీలో చలి విపరీతంగా వణికిస్తోంది. పొగమంచు దట్టంగా కమ్ముకుంది. 50 అడుగుల వరకే రోడ్లు కనిపిస్తున్నాయి. దీంతో 90 రైళ్లు, 50కి పైగా విమానాల ఢిల్లీలో ఆలస్యంగా నడుస్తున్నాయి. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, చండీఘర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీలో 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైన నేపథ్యంలో నగరం మొత్తం పొగమంచు గుప్పిట్లో చిక్కుకుంది. చలికి నగరవాసులు గజగజ వణికిపోతున్నారు. ఇంటినుంచి కాలు బయట పెట్టేందుకు జంకుతున్నారు. సోమవారం ఉదయం 9గంటలవుతున్నా పొగమంచు వీడలేదు. దీనితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రవాణ వ్యవస్థ స్తంభించింది. 14 విమానాలు, 90కి పైగా రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైళ్ల కోసం ప్రయాణికులు రైల్వే స్టేషన్‌లో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. పొగమంచు కారణంగా విమానాలు ఎయిర్‌పోర్టుకే పరిమితమయ్యాయి. చలి మంటలతో చలిపులి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు నగరవాసులు. రైళ్లు, విమాన రాకపోకల్లో తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఉదయం రావాల్సిన రైలు సాయంత్రం వస్తుండడంతో ప్రయాణీకులు నరకయాతన పడుతున్నారు. మరోవైపు ముందు వస్తున్న వాహనాలు కనిపించకపోతుండడంతో వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇలాంటి సమయంలో వెలగాల్సిన ట్రాఫిక్ లైట్లు కూడా వెలగడం లేదు. దీనితో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కాగా, చలి పులి పంజా విసురుతోంది. ఎముకలు కొరికే చలికి యావత్ దేశం బెంబేలెత్తుతోంది.

మంచుతెరలు : ప్రత్యేకించి ఉత్తర భారతదేశాన్ని పొగ మంచు కప్పేస్తోంది. సీజన్‌లోనే తొలిసారి చండీగఢ్‌లో 3.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. జమ్మూకాశ్మీర్‌లోని లేహ్, కార్గిల్ ప్రాంతాల్లో మైనస్ 10 డిగ్రీలు, శ్రీనగర్‌లో మైనస్ 3.8 డిగ్రీల అత్యల్పస్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. అతిశీతల గాలులు, పొగమంచు కారణంగా రవాణ సేవలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఉత్తరప్రదేశ్‌లో పదుల సంఖ్యలో మృత్యువాతకు గురయ్యారు. నగరాల్లో ఫుట్‌పాత్‌లపై వుండే వారి పరిస్థితి దయనీయంగా మారింది. గజగజ వణికించే చలికి తట్టుకోలేక ఎందరో ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయి. కొందరైతే రేయంతా చలిమంటలు వేసుకొని జాగరణ చేస్తున్నారు. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కొనసాగుతుంది.

ఆజాంఘఢ్‌లో ప్రమాదం : ముగ్గురు మృతి

రహదారిని పొగమంచు కప్పేయడంతో ఉత్తరప్రదేశ్‌లోని ఆజాంఘఢ్‌లోని జహాన్‌గంజ్ ప్రాంతంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించారు. వేగంగా వస్తున్న రెండు వాహనాలను ఒకదానికి మరొకటి కనపించకపోవడంతో ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో దినేష్, రమేష్, నన్హు అనే వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడగా వారిని ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

నోయిడాలో ట్రక్కు, కారు ఢీ : నలుగురికి గాయాలు

నోయిడాలో బుధవారం అర్థరాత్రి జరిగిన ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. మంచు కారణంగా రహదారి కనిపించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.

గడ్డకట్టిన కశ్మీర్, కార్గిల్

కశ్మీర్, కార్గిల్ ప్రాంతాలు గడ్డకట్టాయి. అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో మంచు గడ్డలతో కశ్మీర్ లోయ మొత్తం తెల్లటి దూదిలా మారిపోయింది. ఇక్కడ ఉన్న ప్రసిద్ధ గుల్మార్గ్ స్కై రిసార్ట్ పూర్తిగా మంచు గడ్డగా మారిపోయింది. లడక్‌లోని కార్గిల్ పట్టణంలో విపరీతమైన మంచు కురుస్తూనే ఉంది

'మేకిన్ ఇండియా'ను ఎండగట్టిన రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ ఎంతో ఆర్భాటంగా ఆరంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గురువారం ఎండగట్టారు. ఈ సందర్భంగా పెట్టుబడులు తగ్గిపోతున్న అంకెలను ఆయన ఉదాహరించారు. ఈ అంకెలు 'ఫేక్ ఇన్ ఇండియా ప్రోగ్రాం'కు అప్‌డేట్ అని అభివర్ణించారు. ఈ విషయాన్ని ఆయన తన ట్వీట్ ద్వారా వ్యక్తం చేశారు. తాజాగా భారత్‌లో పెట్టుబడులు 13 ఏళ్ల కనిష్ఠానికి పడిపోయిన వార్తా కథనాలను కూడా ఆయన తన ట్వీట్‌కు ట్యాగ్ చేశారు. డిసెంబర్ త్రైమాసికంలో ఆగిపోయిన ప్రాజెక్టులు పెరిగిపోయాయని కూడా ఆయన పేర్కొన్నారు. భారత కంపెనీలు ప్రకటించిన కొత్త ప్రాజెక్టులు 13 ఏళ్ల కనిష్ఠానికి అంటే రూ. 77,000 కోట్లకు డిసెంబర్‌లో తగ్గిపోయాయన్నారు. ఇందుకు ఆయన సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకనామి(సిఎంఐఇ) డేటా బేస్‌ను ఉదాహరిస్తూ వెలువడిన వార్తా కథనాలను ఉటంకించారు. ఇటీవల కాలంలో ప్రధాని నరేంద్ర మోడీ, ఆయన ప్రభుత్వంపై ఆన్‌లైన్‌లో రాహుల్ గాంధీ ధ్వజమెత్తుతున్నారు. తన అభిప్రాయాలను బలంగా ఆన్‌లైనర్లతో పంచుకుంటున్నారు.

తమిళనాడు అసెంబ్లీ సభా నాయకుడిగా పన్నీర్



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ సభా నాయకుడిగా ఉపముఖ్యమంత్రి, ఎఐఎడిఎంకె కోఆర్డినేటర్ ఒ. పన్నీర్‌సెల్వంను గురువారం నియమించారు. ఇదివరకు ఆ పదవిలో ఉన్న పాఠశాల విద్యా శాఖ మంత్రి కె.ఎ. సేన్‌గొట్టాయన్ స్థానంలో ఆయనను నియమించారు. తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు జనవరి 8న ఆరంభం కానున్నాయి. ఈ సమావేశాలను గవర్నర్ సాంప్రదాయిక ప్రసంగంతో ఆరంభిస్తారు. ఈ సమావేశాలకు ముందే పన్నీర్ సెల్వంను సభా నాయకుడిగా నియమించడం గమనార్హం. పన్నీర్ సెల్వంను సభా నాయకుడిగా నియమించినట్లు తమిళనాడు శాసనసభ(టిఎన్‌ఎల్‌ఎ) కార్యదర్శి కె. భూపతి సంక్షిప్త ప్రకటన చేశారు. పార్టీ నుంచి తప్పించిన టిటివి దినకరన్‌కు మద్దతు పలికిన 18 మంది ఎఐఎడిఎంకె శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించాక మొదటిసారి వచ్చే వారం తమిళనాడు అసెంబ్లీ సమావేశం కాబోతోంది. దినకరన్ తొలిసారి శాసనసభ్యుడిగా తమిళనాడు అసెంబ్లీకి హాజరు కాబోతున్నారు. ఆయన డిసెంబర్ 21న ఆర్‌కె నగర్ ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించిన సంగతి తెలిసిందే.


ముంబయిలో మరో అగ్నిప్రమాదం

- నలుగురు మృతి, ఐదుగురికి గాయాలు
- అంధేరీలోని ఓ భవనం పైఅంతస్తులో మంటలు



ముంబయి : భారత ఆర్థిక రాజధాని ముంబయిలో మరో భారీ అగ్నిప్రమాదం జరిగింది. సబర్బన్ మారోల్‌గల నివాసిత భవనంలోని పైఅంతస్తులో గురువారం మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు సహా నలుగురు మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. తూర్పు అంధేరీ మారోల్‌లో ఉన్న మమూన్ మంజిల్ భవనంలోని 4వ అంతస్థులో మంటలు వ్యాపించినట్లు బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత 2.10 గంటలకు ముంబయి అగ్నిమాపక శాఖకు సమాచారం వచ్చిందని బ్రిహన్ ముంబయి కార్పొరేషన్ విపత్తు నిర్వహణశాఖ అధికారి చెప్పారు. వెంటనే తమ అగ్నిమాపక సిబ్బంది శకటాలు, అంబులెన్స్‌లతో 2.34 గంటలకు ఘటనాస్థలికి చేరుకున్నారన్నారు. భవనంలో చెలరేగిన మంటలను ఉదయం 4.20 గంటలక వరకు అన్ని వైపుల నుంచీ అదుపులోకి తెచ్చారని ఆయన తెలిపారు. ఈ ప్రమాదం తొమ్మిది మంది గాయపడగా వారిలో అప్పటికే మృతి చెందారన్నారు. మిగిలిన వారిని సమీప ఆసుపత్రికి తరలించినట్లు ఆ అధికారి పేర్కొన్నారు. క్షతగాత్రుల పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందన్నారు. మృతులను సకినా కపసి, మోహిన్ కపసి, తస్లీమ్ కపసి, దావూద్ కపిసిగా గుర్తుంచారు. అయితే ప్రమాదానికి గల కారణాలు ఇంత వరకు తెలియరాలేదని, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు వివరించారు. గత వారం ముంబయిలోని కమల మిల్స్ కాంపౌండ్‌లో ఉన్న 'వన్ ఎబౌవ్' పబ్‌లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకొని 19 మంది మృతి చెందారు. మరో 20 మందికి గాయాలయ్యాయి.

అమ్మా నేను బాగున్నా..ఆందోళన వద్దు



న్యూఢిల్లీ : భారత నౌకాదళ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌కు సంబంధించిన మరో విడియోను గురువారం పాకిస్థాన్ అధికారులు విడుదల చేశారు. గూఢచర్యం ఆరోపణలతో జాదవ్ పాక్‌లో బందీగా ఉన్న విషయం విదితమే. 'నన్ను కలుసు కున్న సమయంలో నా తల్లి కళ్లలో భయం కనిపించింది. నన్ను చూసి ఆమె ఏడుస్తుంటే భారత రాయబారి గట్టిగా అరిచారు. ఆయన ఆమెపై అరవడం నేను చూశాను. ఈ సమావేశం సానుకూలంగా జరిగింది. దీని వల్ల నా తల్లి సంతోషంగా ఉంది. నేను కూడా సంతోషంగా ఉన్నాను. అమ్మా.. నా గురించి ఆందోళన పడొద్దు. పాక్ అధికారులు నన్ను బాగా చూసుకుంటున్నారు. నన్ను ఎటువంటి హింసలకు గురి చేయలేదు' అని జాదవ్ మాట్లాడుతున్న విడియోను పాక్ విదేశాంగశాఖ విడుదల చేసింది. 'అయితే భారత ప్రభుత్వానికి, ప్రజలకు, నౌకాదళ అధికారులకు నేను ఒకటి చెప్పదలుచుకున్నాను. భారత నేవీలో నా ఉద్యోగం పోలేదు. నేను ఇంకా భారత నేవీ అధి కారినే' అని జాదవ్ ఆ విడియోలో చెప్పారు. గత నెల 25న జాదవ్‌ను ఆయన తల్లి, భార్య కలు సుకునేందుకు పాక్ అధికారులు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలోను జాదవ్ పాక్ అధికారులకు కృతజ్ఞతలు చెబుతున్నట్లు ఉన్న ఓ వీడియోను కూడా పాక్ విడుదల చేసింది. జాదవ్‌కు తన తల్లి, భార్యకు మధ్య ఓ అద్దాన్ని అడ్డుగా ఉంచారు. అయితే.. జాదవ్‌ను కలుసు కునే సమయంలో ఆయన తల్లి, భార్య మెడలోని మంగళసూత్రాలు, బొట్టు, గాజులు, చెప్పులు తీయించడం తీవ్ర వివాదాస్పదమైంది. పుణ్యస్త్రీలను వితంతువులుగా చూపించడం పట్ల భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ తీవ్రంగా ఖండించారు. జాదవ్‌ను తన తల్లి, భార్య కలుసుకున్నప్పటి చిత్రాలను పాక్ అప్పుడు విడుదల చేసింది. ఆ చిత్రాల్లో జాదవ్‌ను పాక్ అధికారులు తీవ్ర చిత్రహింసలకు గురి చేసిన ఆనవాళ్లు కనిపించాయి. ఆయన తలపైనా, చెవి వద్ద, మెడ భాగంలో గాయాలున్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. మానవతా దృక్పథంతో ఈ భేటీని ఏర్పాటు చేశామంటున్న పాక్.. జాదవ్ పట్ల అమానుషంగా వ్యవహరించడం పట్ల కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

లాలూ కేసులో తీర్పు నేడే

రాంచీ: దాణా కుంభకోణం కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ సహా దోషులకు శిక్ష ఖరారును సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం మళ్లీ శుక్రవారానికి వేసింది. ఈ కేసులో లాలూప్రసాద్ యాదవ్‌తో పాటు మరో 15 మందిని దోషులుగా తేలుస్తూ గత నెల 23న రాంచీలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి జనవరి 3న శిక్ష ఖరారు చేస్తామని చెప్పింది. అయితే న్యాయవాది వించేశ్వర ప్రసాద్ మృతితో తీర్పును గురువారానికి వాయిదా వేశారు. దీన్ని మళ్లీ శుక్రవారానికకి వాయిదా వేశారు. బిహార్‌లో 21ఏళ్ల క్రితం పశు దాణా కుంభకోణం వెలుగులోకి వచ్చింది. 199194 మధ్య దేవ్‌గఢ్ ఖజానా నుంచి రూ.89.27లక్షల మొత్తాన్ని తప్పుడు వివరాలతో కాజేయడానికి సంబంధించిన కేసులో సీబీఐ విచారణ జరిపి 38 మందిపై అభియోగపత్రాలు నమోదు చేసింది. వీరిలో 11 మంది ఇప్పటికే చనిపోయారు. ఇద్దరు తమ నేరాన్ని అంగీకరించడంతో శిక్షలు పడ్డాయి. ముగ్గురు నిందితులు సాక్షులుగా మారారు.

ముంబయిలో దళిత సంఘాల ఆందోళన

ముంబయి: మహారాష్ట్రలో దళిత సంఘాల పిలుపు మేరకు నిరసనలకు దిగిన 300 మంది ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరసనకారులు రాళ్లు విసరడంతో 30 మంది పోలీసులు గాయపడ్డారు. నగర వాయువ్య ప్రాంతంలోని గోవండి తదితర ప్రాంతాలలో గరిష్టంగా 11 మంది గాయపడినట్లు 6వ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సహజి ఉమాప్ తెలిపారు. ఆందోళనకారులపై 16 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశామని ఆయన తెలిపారు. ఈ ఘటనలో పాల్గొన్న 300 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. జనవరి 1న పుణెలో హింసాకాండ చోటు చేసుకోవడంతో దళిత సంఘాలు నిరసనకు పిలుపునిచ్చాయి. బీమా, కోరేగావ్ సామాజిక వర్గానికి చెందిన వారి మధ్య అంతర్గత కలహాలు తలెత్తాయి. సాహూ మహారాజ్ సొంత జిల్లాలో బుధవారం ఆందోళనకారులు మున్సిపాలిటీకి చెందిన 13 బస్సులను ధ్వంసం చేశారు. కోల్హాపూర్ జిల్లాలో గురువారం అర్ధరాత్రి వరకు ఇంటర్నెట్ సేవలను రద్దు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మమతా బెనర్జీపై కేసు

గువాహతి: అసోం పోలీసులు గురువారం పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతపై కేసు నమోదు చేశారు. అసోంలో పౌరుల జాతీయ నమోదు(ఎన్‌ఆర్‌సి) అప్‌డేటింగ్‌పై ఆమె రెచ్చగొట్టే విధంగా ప్రసంగించినందుకు ఈ కేసు నమోదు చేశారు. ఎన్‌ఆర్‌సి అప్‌డేట్‌లో అసోంలో ఉంటున్న 1కోటి 25 లక్షల మంది బెంగాలీల పేర్లను కొట్టివేసేందుకు బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆమె బుధవారం తన ప్రసంగంలో ఆరోపించినందుకు ఈ కేసు నమోదు చేశారు. మమత రెచ్చగొట్టే ప్రసంగంపై సామాజిక కార్యకర్త కైలాష్ శర్మ, న్యాయవాది తైలేంద్ర నాథ్ దాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాజ్యసభలో 'తలాక్' బిల్లుపై వీడని సస్పెన్స్

న్యూఢిల్లీ: వస్తు,సేవల సవరణ బిల్లును మొదట చర్చకు చేపట్టాలని ప్రభుత్వం మడతపేచీ పెట్టడంతో రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లు ఎటూ తేలక విఫలమైంది. ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ట్రిపుల్ తలాక్ బిల్లును మళ్లీ రాజ్యసభలో గురువారం ప్రవేశపెట్టారు. అప్పుడు రూల్‌బుక్‌పై ప్రతిపక్షాలు, అధికార పక్షం సభ్యులు ఒకరితో మరొకరు తలపడ్డారు. బిల్లుపై చర్చించాలా? లేక సవరణల కోసం సెలెక్ట్ కమిటీకి పంపాలా? అనే దానిపైనే ఎక్కువ వాగ్వాదం కొనసాగింది. ముస్లిం మహిళల(వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని ప్రతిపక్షం ప్రవేశపెట్టిన తీర్మానం నియమానుసారంగా లేదని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఖండించారు. ట్రిపుల్ తలాక్ ద్వారా భర్తలు జైలు పాలయినప్పుడు ముస్లిం మహిళలకు ఆర్థిక సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం అంగీకరిస్తే ఈ ప్రతిష్టంభన తొలగొచ్చని కాంగ్రెస్ సూచించింది. డిసెంబర్ 28న లోక్‌సభ ఆమోదించిన ట్రిపుల్ తలాక్ బిల్లు రాజకీయ వర్గాన్ని విభజించింది. ముస్లిం సంస్థలు కూడా తీవ్రంగా విమర్శించాయి. ప్రతిపక్షానికి చెందిన ఇద్దరు సభ్యులు ప్రవేశపెట్టిన సవరణ తీర్మానాన్ని రాజ్యసభ ఛైర్మన్ అంగీకరించడంతో ప్రతిపక్షానికి నైతిక విజయం లభించింది. కానీ కార్యకలాపాల జాబితా ప్రకారం జిఎస్‌టి సవరణ బిల్లు అనంతరం ట్రిపుల్ తలాక్ బిల్లును కూడా స్వీకరిస్తామని ఛైర్మన్ నిర్ణయించడంతో అధికార పక్షం కూడా విజయాన్ని చవిచూసిందనే చెప్పాలి. నిరసనల నడుమ గురువారం రాజ్యసభ ఒక రోజు వాయిదా పడింది.

సహకరించండి: వెంకయ్య నాయుడు : వివిధ అంశాలపై రాజ్యసభలో గందరగోళం, అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో సభ సజావుగా పనిచేసేలా చూడాలని అన్ని పార్టీల నాయకులను రాజ్యసభ ఛైర్మన్ ఎం. వెంకయ్యనాయుడు కోరారు. ఆయన అఖిలపక్ష సభ్యులతో సమావేశమయి చర్చించారు. ఇందులో ట్రిపుల్ తలాక్ బిల్లు అంశాన్ని కూడా చర్చించారు.ట్రిపుల్ తలాక్, మహారాష్ట్రలో చెలరేగిన కుల హింసాత్మక ఘటనలపై రాజ్యసభ శీతాకాలం సమావేశాలకు అనేకసార్లు అంతరాయం ఏర్పడింది. దాంతో కొందరు సభ్యులు ఎగువసభలో ప్రజా ప్రాముఖ్యత ఉన్న అంశాలను చిన్న పార్టీలు లేవనెత్తడానికి అవకాశమే ఇవ్వడంలేదని, ప్రధాన పార్టీలు తమ ఎజెండాను ముందుకు తోసేందుకు సభా కార్యక్రమాలకు అవాంతరాలు సృష్టిస్తున్నాయని వెంకయ్య నాయుడుకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకుడు ఆనంద్ శర్మ ట్రిపుల్ తలాక్ బిల్లుపై సవరణలు ప్రతిపాదిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానం విషయంలో రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు కాల పరిమితిని తొలగించారు. ట్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చించేందుకు నాలుగు గంటల సమయాన్నే సభా కార్యకలాపాల సలహా కమిటీ స్థిరపరిచింది. కానీ దీనిపై మరింత సమయం ఇవ్వాలని కోరడంతో నాయుడు ఆమోదించారు.

జీరో అవర్ సద్వినియోగం

రాజ్యసభ శూన్య కాలాన్ని(జీరో అవర్) సభ్యులు సద్వినియోగం చేసుకున్నారు. భీమా– కొరేగావ్ స్మారక వేడుకల తర్వాత మహారాష్ట్రలో చెలరేగిన కులఘర్షణల హింసంపై సభ్యులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రసంగించారు. కాగా, రాజ్యసభ సవరించిన రెండు బిల్లులను లోక్‌సభ గురువారం ఆమోదించింది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి జాతీయ బ్యాంకు(సవరణ) బిల్లు; దివాళా(సవరణ) బిల్లును ఆమోదించింది. కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి పి.పి. చౌదరి ప్రవేశపెట్టిన ఈ రెండు బిల్లులను లోక్‌సభ ఆమోదించింది.

మన తెలంగాణ
11
హైదరాబాద్
శుక్రవారం
5, జనవరి 2018
www.manatelangana.news



అలబామా ఓటమికి బానన్‌దే బాధ్యత : ట్రంప్

వాషింగ్టన్: ఒకప్పటి వైట్ హౌస్ ప్రధాన వ్యూహకర్త స్టీవ్ బానన్ ఉద్వాసన పొందాక మతికూడా కోల్పోయారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విమర్శించారు. 64 ఏళ్ల బానన్ అధ్యక్ష పదవికి ట్రంప్ ప్రచారంలో అగ్రస్థాయి మేనేజర్‌గా వ్యవహరించారు. ట్రంప్ తొలి ఏడు నెలల పదవీ కాలంలో ఆయన వైట్ హౌస్ ప్రధాన వ్యూహకర్తగా పని చేశారు. అంతలోకే ట్రంప్ ఆగ్రహానికి గురై ఉద్వాసన పొందారు. తన అధ్యక్ష పదవితో బానన్‌కు ఎటువంటి సంబంధం లేదని తాజాగా ట్రంప్ పేర్కొన్నారు. తాను అధ్యక్ష పదవికి 17 మంది అభ్యర్థులను ఓడించి నామినేషన్ పొందే సరికి బానన్ తన తరఫున పని చేసిన ఒక చిన్న ఉద్యోగి అని ట్రంప్ చెప్పారు. ఇప్పుడు ఉద్వాసన అనంతరం తన కాళ్లపై తాను నిలబడాల్సిన పరిస్థితిలో మెదడు కోల్పోయారని అలబామాలో 30 ఏళ్లపాటు నిలిచిన సెనెట్ సీటును తాము కోల్పోవడం వెనుక బానన్ అవిరళ కృషి ఉందని ట్రంప్ ఆరోపించారు.

ఇరాన్‌లో ప్రభుత్వ అనుకూల ర్యాలీలు

● ఆర్థిక సమస్యలపై చల్లారిన నిరసన ● ప్రదర్శనల్లో మృతుల సంఖ్య 21

టెహ్రాన్ : ఇరాన్‌లో గురువారం ప్రభుత్వ అనుకూల ర్యాలీలు భారీ ఎత్తున సాగాయి. అశాంతి, ఆందోళనలు సమసిపోయినట్లు అధికార్లు ప్రకటించారు. నిరసనలను రేకెత్తించిన ఆర్థిక సమస్యలపై దృష్టి పెట్టడానికి ప్రాధాన్యం ఇస్తామని వారు పేర్కొన్నారు. నిరసన ప్రదర్శనలు చోటు చేసుకున్న వారం రోజుల తర్వాత తాజా ఆందోళనల వార్తలు ఏవీ రాలేదు. కొన్ని రాష్ట్రా ల పట్టణాలలో చెదురుమదురుగా ప్రదర్శనలు జరిగినట్లు వార్తలు వచ్చినా అవి ధ్రువపడలేదు. ఇరాన్‌పై తాజా ఆంక్షలు విధించడానికి అమెరికా చూస్తోంది. ఈ మేరకు ఆ దేశం సూచనలు అందించినట్లు అధికార్లు చెప్పారు. అధ్యక్షుడు హసన్ రౌహానీ ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో ప్రజాకంటక చర్యలను అడ్డుకొనడంతోసహా ఆ తాజా ఆంక్షలు ఏమయిఉంటాయన్నది ఇంకా ఊహాగానంలోనే ఉంది. మేము మా నాయకుని (అధ్యక్షుని) వెంటే ఉంటామని ర్యాలీలలో జనం హోరెత్తారు. సకాలంలో వీధుల్లోకి ఎక్కడం ద్వారా ఇరాన్ ప్రజలు శత్రువుల పన్నాగాలను నిరసించారని అధికార్లు తెలిపారు. ఆర్థిక సమస్యలపై పోరాడాలన్న దే ప్రభుత్వానికి ప్రజల డిమాండ్. ఐదు రోజుల ప్రదర్శనల్లో 21 మంది మరణించారు.డిసెంబర్ 28న ఆర్థిక సమస్యలపై మొదలైన నిరసనఅనతికాలంలో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలుగా రూపొందాయి.ఈ అశాంతి వెనుక పెద్ద సంఖ్యలో ఇరాన్ వ్యతిరేకులు ఉన్నారని ప్రభుత్వ అధికారి ఒకరు టెలివిజన్‌లో ఆరోపించారు. ఇటీవలి అశాంతి వెను క సౌదీఅరేబియా కూడా ఉన్నట్లు తెలుస్తోంది. సౌదీ సారథ్యంలో సున్నీ అరబ్ ప్రత్యర్థులు ఇరాన్ వ్యవహారాల్లో చాలా కాలం నుంచి జోక్యం చేసుకుంటున్నారు.



ట్రంప్‌పై ఐరాసకి ఇరాన్ ఫిర్యాదు

ఐక్యరాజ్య సమితి: ఇరాన్ ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శకులకు మద్దతు తెలపడం ద్వారా అమెరికా ప్రతిఒక్క అంతర్జాతీయ సంబంధాల మర్యాదను ఉల్లంఘించిందని ఇరాన్ గురువారం నాడు విమర్శించింది. అధ్యక్షుడు ట్రంప్ అడ్డదిడ్డమైన ట్వీట్‌ల ద్వారా అశాంతిని ప్రోత్సహించారని ఆ దేశం ఐక్యరాజ్యసమితికి పంపిన ఒక లేఖలో విమర్శించింది.సమితిలో ఇరాన్ రాయబారి గోలామలి ఖుష్రూ ఈ లేఖ రాశారు. అమెరికా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు అనేక అసంబద్ధ ట్వీట్‌లను ఇచ్చారని, ఇరాన్ ప్రజలను నిరసన ప్రదర్శనల్లో పాల్గొనేలా రెచ్చగొట్టారని ఆయన ఆరోపించారు.

31న సంపూర్ణ 'బ్లూ మూన్' గ్రహణం



వాషింగ్టన్ : ఆకాశంలో ఈ నెల 31న అరుదైన దృశ్యం ఆవిష్కృతమవ్వనుంది. ఒకే నెలలో రెండోసారి కనిపించే నిండు చంద్రుడు(బ్లూ మూన్) సంపూర్ణంగా గ్రహణ ప్రభావానికి గురికానున్నాడు. ఇలా బ్లూ మూన్ సంపూర్ణ గ్రహణం ఏర్పడనుండటం గత 150 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. చివరిసారిగా 1866 మార్చి 31న ఈ అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. అలస్కా, హవాయి, వాయువ్య కెనడా ప్రజలు సంపూర్ణ బ్లూ మూన్ గ్రహణాన్ని ప్రారంభం నుంచి అంతం వరకు పూర్తిగా వీక్షించవచ్చు. మొత్తం 77 నిమిషాలపాటు ఈ ఖగోళ పరిణామం కనువిందు చేస్తుంది.

చైనాలో సిపిసి కీలక అధికారితో భారత రాయబారి సమావేశం

డోక్లాం అనంతర సంబంధాల వృద్ధిపై చర్చ



బీజింగ్ : చైనాలో అధికార కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) అంతర్జాతీయ విభాగం ఉప మంత్రి గువో యఝౌతో చైనాలో భారత రాయబారి గౌతమ్ బంబావాలే గురువారం నాడు చర్చలు జరిపారు. డోక్లాం అనంతర సంబంధాల అభివృద్ధికి ఇరుదేశాలు కృషి చేస్తున్న నేపథ్యంలో ఈ చర్చలు చోటు చేసుకున్నాయి. అయితే ఈ సమావేశం వివరాలు వెంటనే తెలియలేదు. బంబావాలే భారత దేశపు సీనియర్ దౌత్యాధికారి. పాకిస్థాన్‌లో భారత్ హైకమిషనర్‌గా పని చేసిన ఆయన ఇటీవలే చైనా రాయబారిగా నియమితులయ్యారు. ఈ సమావేశంలో చైనా ఉన్నతస్థాయి అధికార ప్రతినిధి బృందం హాజరయింది.అధ్యక్షుడు జీజిన్‌పింగ్ సన్నిహితుడు మెంగ్ జీయాంగ్ ఫెంగ్ ఆ బృందానికి సారథ్యం వహించారు.

కశ్మీర్ లేని చైనా గ్లోబు



కెనడా : నిత్యం భారత్‌తో పేచి పెట్టుకునే చైనా మరో దుర్మార్గపు చర్యకు పూనుకుంది. ఏకంగా కశ్మీర్ మొత్తాన్ని భారత్‌తో సంబంధం లేదన్నట్లు గా చూపించే గ్లోబులను మార్కెట్‌లోకి విక్రయించింది. పెద్ద మొత్తంలో కెనడా దుకాణాల్లో దర్శనం ఇస్తున్న ఈ గ్లోబులు ఇప్పుడు భారత సంతతి అమెరికన్ పౌరులను తీవ్రంగా కలవర పెడుతున్నాయి. వాటిని చూసే తమ చిన్నారులకు భారత భౌగోళిక స్వరూపం ఎలా చూపించాలని ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. నూతన సంవత్సరం సందర్భంగా సందీప్ దేశ్వాల్ అనే ఓ భారత సంత తి అమెరికన్ తన ఆరేళ్ల కూతురు అస్మితాకు గ్లోబు కొని తీసుకొచ్చాడు. క్రిస్మస్ సందర్భంగా శాంటా తాతకు తనకు గ్లోబ్ కావాలని అస్మిత విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో తల్లిదండ్రులు ఆమె కోరికను తీర్చారు. అయితే, ఆ గ్లోబులో భారత్ ఎక్కడ ఉంది? కెనడా ఎక్కడ ఉంది? అని పాప అడిగినప్పుడు వారు ఒక్కసారిగా కలవరపడ్డారు. భారత్‌కు తలకాయలాం టి కశ్మీర్‌ను పూర్తిగా వేరు చేసి ఆ గ్లోబులో ఉంది.ఆ గ్లోబులన్నీ కూడా చైనా తయారు చేసినవే. దీం తో తాను ఈ విషయాన్ని గ్లోబులు విక్రయిస్తు న్న దుకాణానికి తెలియజేశాడు. ఈ సందర్భంగా తన ఆందోళనను మీడియా తో పంచుకుంటూ'కశ్మీర్ కూడా భారత్‌లో భాగమే అనే విషయాన్ని ఇప్పు డు తాను తన కూతురుకి చెప్పకుంటే తను మరో రూపంలో ఉన్న భారత్ చిత్రపటాన్ని ఊహించుకుంటుంది. ముందు తరాల వారు కూడా దానినే అ నుసరించే ప్రమాదం ఉంది. చైనా చేసిన ఈ చర్యను ఏమాత్రం సహించకూడదు'అని ఆయన అన్నారు.

మేడారం జాతరను జాతీయపండుగగా గుర్తించాలి

మన తెలంగాణ/న్యూఢిల్లీ: మేడారం సమ్మక్కసారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని లోక్ సభలో టిఆర్ఎస్ ఎంపి సీతారాంనాయక్ ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ.. మేడారం జాతరకు వివిధ రాష్ట్రాల నుంచి కోటి మందికిపైగా భక్తులు వస్తారని లోక్ సభకు తెలిపారు. ఈ పండుగను జాతీయ పండుగగా గుర్తించడం వల్ల దేశవ్యాప్తంగా ఉన్న 10కోట్ల మంది ఆదివాసి,గిరిజనుల మనో భావాలను గౌరవించినట్లవుతుందని స్పష్టం చేశారు. 1996లో ఉమ్మడి ఎపి ప్రభుత్వం మేడారం జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించిందని అన్నారు. జాతీయ పండుగగా గుర్తించడానికి అన్నిఅర్హతలు ఈ జాతరకు ఉన్నా యని లోక్ సభలో తెలిపారు. అధేవిధంగా శతాబ్దాలుగా గిరిజనులే పూజా రులుగా ఈ పండుగను నిర్వహిస్తున్నారని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ఆదివాసీ గిరిజనులే కాకుండా గిరిజనేతరులు సైతం పెద్ద సంఖ్యలో మేడారంను సందర్శిస్తారని తెలిపారు. కావునా గిరిజన వ్యవహారాలు, సాం స్కృతికశాఖ చొరవ తీసుకుని మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని ఆయన కోరారు.

నోట్ల మార్పిడి ముఠా అరెస్టు

కోటి రూపాయల పాతనోట్లు స్వాధీనం

మన తెలంగాణ/సికింద్రాబాద్ : పాత నోట్ల మార్పిడి ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నార్త్‌జోన్ డిసిపి బి.సుమతి తెలిపిన వివరాల ప్రకారం కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలో పాత నోట్లను మార్పిడి చేస్తామని నమ్మబలుకుతూ మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు చేసి వారి వద్ద నుండి కోటి రుపాయల విలువ చేసే పాత నోట్లను స్వాధీనం చేసుకున్నారు. పాత నోట్లను మారుస్తాని మోసాలకు పాల్పడుతున్న వారి మాటలు నమ్మవద్దని పాతనోట్లను దగ్గర ఉంచుకున్నా నోట్ల మార్పిడికి పాల్పడ్డా నేరమని ఆమె తెలిపారు. గడచిన సంవత్సర కాలంలో అనేక ప్రాంతాలలో ఈ తరహా మోసాలకు పాల్పడుతున్న వారని అదుపులోకి తీసుకుని కేసులు పెట్టడం జరిగిందన్నారు. ఎవరైనా నోట్ల మార్పిడి పేరుతో మోసాలకు పాల్పడితే పోలీసులకు సమాచారమందించాలన్నారు. పాత నోట్లు రద్దయ్యాయని ఎవరైనా దగ్గర ఉంచుకుంటే చట్టప్రకారం శిక్షార్హులవుతారని ఆమె తెలిపారు. నోట్ల మార్పిడి ముఠాను పట్టుకున్నకార్ఖానా పోలీసులను ఆమె అభినందించారు.

గురి తప్పిన ఉత్తర కొరియా క్షిపణి



● 2017లో సాంకేతిక లోపంతో టోక్చోన్ నగరం వైపు దూసుకెళ్లిన క్షిపణి
● కుప్పకూలిన వ్యవసాయ క్షేత్రాలు, భవనాలు

ప్యాంగ్యాంగ్ : అనేక దేశాలు ఎంత హెచ్చరిస్తున్నా తీరు మార్చుకోకుండా వరుసగా క్షిపణి, అణు ప్రయోగాలకు పాల్పడుతున్న ఉత్తర కొరియా.. 2017 ఏప్రిల్‌లో పొరపాటుగా తమ నగరంపైనే క్షిపణిని ప్రయోగించిందట. ఈ విషయాన్ని అమెరికాకి చెందిన ఓ అధికారి 'ది డిప్లొ మాట్' అనే ఆంగ్ల పత్రికకు బుధవారం వెల్లడిం చారు. ఇటీవల ఉత్తర కొరియా హ్వాసాంగ్12 అనే బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించినట్టు తెలిపింది. సాంకేతిక లోపం కారణంగా ఆ క్షిపణి ఉత్తర కొరియాలోని టోక్చోన్ అనే నగరం మీదు గా దూసుకెళ్లింది. ఆ నగరంలో సుమారు రెండు లక్షల మంది జనాభా ఉన్నారు. ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్‌కి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎయిర్ ఫీల్ నుంచి కొరియా ఈ క్షిపణిని ప్రయోగించిందట. దాంతో ఆ నగరం లోని వ్యవసాయ క్షేత్రాలు, భవనాలు కుప్ప కూలి పోయినట్లు శాటిలైట్ దృశ్యాల్లో కన్పించింది. అయితే క్షిపణి ప్రయోగం కారణంగా టోక్చోన్‌లో ఎలాంటి ప్రాణ హాని జరగలేదు. ఎలాగూ క్షిపణి విఫలమైందని తెలియడంతో అమెరికా ప్రభుత్వం దీని గురించి చర్చించలేదు. ఒకవేళ క్షిపణి విజయవంతమై ఉంటే జపాన్ మీదుగా దూసు కెళ్లేది. ఉత్తర కొరియా 2017 ఆగస్టు, నవంబరులో రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. మరో రెండు వారాల్లో ఉ.కొరియా మరో క్షిపణిని ప్రయోగించే అవకాశం ఉన్నట్లు అమెరికన్ ప్రతి నిధులు తెలిపారు. మరోపక్క అణు ప్రయోగాల విషయంలో అమెరికా, ఉ.కొరియా మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. 'అణు బటన్ ఎప్పుడూ నా టేబుల్ మీదే ఉంటుంది' అంటూ ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారు. దీనికి అమెరికా అధ్యక్షుడు దీటుగా సమాధానమిస్తూ..'నా అణు బటన్ కూడా బాగానే పనిచేస్తుంది. అది ఉ.కొరియా కంటే పెద్దది' అన్నారు.

మహిళా భక్తులకు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు నిర్ణయం

తిరువనంతపురం : కేరళలోని ప్రముఖ పుణ్య క్షేత్రం శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో మహిళలు పూజలు చేయడానికి నిబంధన విధిస్తూ ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు నిర్ణయం తీసుకుంది. మహిళలు వారి వయసు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి అందజేయయాలని సూచించింది. పది నుంచి యాభై ఏళ్ల మధ్య వయసు గల మహిళలకు ఆలయంలోకి అనుమతి లేదనే విషయం తెలిసిందే. ఈ మధ్య కాలంలో నిబంధనలను అతిక్రమించి చాలా మంది మహిళా భక్తులు ఆలయంలోకి ప్రవేశించే ప్రయత్నాలు చేసిన ఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో ట్రావెన్‌కోర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు అధ్యక్షుడు పద్మకుమార్ తెలిపారు. అయ్యప్ప స్వామి సన్నిధిలోకి రుతుక్రమం వచ్చే మహిళలను అనుమతించరు. శబరిమల కొండపైకి ఎక్కే సమయంలో చేసే తనిఖీల్లో మహిళా భక్తులు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డును కూడా చూపించాల్సి ఉటుందని ఆయన తెలిపారు. ప్రామాణికమైన పత్రాలు చూపించినట్లయితే పోలీసులు, మహిళా భక్తుల మధ్య ఎలాంటి వాగ్వాదాలు చోటుచేసుకోకుండా ఉంటుందన్నారు. గతంలో అనేక ఇబ్బందికర సంఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో నిబంధనల విషయంలో రాజీ పడేది లేదని ఆయన అన్నారు. మహళా పోలీసులు, ఉద్యోగులు పంబ వద్ద తనిఖీలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. 2017 నవంబరు నుంచి ఇప్పటివరకు దాదాపు 260 మంది మహిళా భక్తులు నిబంధనలు అతిక్రమించేందుకు ప్రయత్నించారని, వారిని పంబ వద్దనే నిలువరించామని తెలిపారు. వీరిలో చాలా వరకు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కొంత మంది కేరళ నుంచి వచ్చారని, చాలా వరకు నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్లే ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన తెలిపారు. 10 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉన్న మహిళలకు ఆలయ ప్రవేశాన్ని నిషేధిస్తూ ట్రావెన్‌కోర్ బోర్డు పాటిస్తున్న నియమాన్ని సవాల్ చేస్తూ వేసిన పిటిషన్ ప్రస్తుతం సుప్రీం కోర్టులో విచారణలో ఉంది.

తెలంగాణలో ఫిష్‌ఫార్మింగ్ పరిశోధన కేంద్రం

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి ఎంపి బూర విజ్ఞప్తి



మన తెలంగాణ/న్యూఢిల్లీ : తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై ఎంపి బూరనర్సయ్య గౌడ్ గురువారం పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం అయ్యారు. అనంతరం మీడియా కు ఆ సమావేశ వివరాలను ఎంపి బూరనర్సయ్య గౌడ్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తో జరిగిన సమావేశంలో తెలంగాణలో సిఎం కేసీఆర్ చొరవతో మత్స్య, గొర్ల సంపద పెంచడానికి అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వివరించారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ లో ఉచితంగా 40కోట్ల చేపపిల్లల పంపకం విషయాన్ని కేంద్రమంత్రికి వివరించానని తెలిపారు. తెలంగాణలో సముద్రతీర ప్రాంతం లేనప్పటికి, 46వేల చెరువులు,ప్రాజెక్టులలో చేపల పంపకం పెద్దఎత్తున చేపడుతున్నామని అందకోసం, తెలంగాణలో ఇన్లాండ్ ఫిష్ ఫార్మింగ్ కొరకు ఒక పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణలో గొర్రెల పెంపకం బహిరంగ ప్రదేశాలలో కొనసాగుతుందని, రోజురోజుకు వ్యవసాయం పెరగడం, పెద్దఎత్తున జరుగుతున్న పట్టణీకీకరణ వల్ల గొర్రెల పెంపకానికి భూముల కొరత ఏర్పడుతుందని కాబట్టి, ఫార్మ్ లలో పెంపకానికి అనువైన హైబ్రీడ్ గొర్రెల బ్రీడ్ తయారు చేయటానికి ఒక కేంద్రాన్ని తెలంగాణ లో ఏర్పాటు చేయాలని కోరానని వెల్లడించారు. దీనికి స్పందించిన కేంద్రమంత్రి, సిఎం కేసీఆర్ చేపట్టిన కార్యక్రమాలను ప్రశంసించారని తెలిపారు. రాజస్థాన్ లో 100రోజులలో 50కేజీల బరువు వచ్చే గొర్రెల హైబ్రీడ్ బ్రీడింగ్ పరిశోధన కేంద్రం ఉందని, దానిలో హైబ్రీడ్ వెరైటీ ఉందని దానికి అనుసంధానంగా తెలంగాణలో ఏర్పాటు చేయబోయే కేంద్రానికి సాంకేతికంగా, అవసరమైతే శాస్త్రవేత్తలను ఏర్పాటు చేసి సహకరిస్తామని, ఈ విషయంపై త్వరలోనే అక్కడి అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడానికి కృషిచేస్తామనికేంద్ర మంత్రి హామీ ఇచ్చారని ఎంపి బూర నర్సయ్య గౌడ్ తెలిపారు. అనంతరం కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభుతో జరిగిన సమావేశం అయినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఐఐయూఎస్(మాడిఫైడ్ ఇండస్ట్రీయల్ ఇన్ఫ్రాస్ట్రక్సర్ ఎంప్లాయ్మెంట్ స్కీం) అనే కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా ప్లాస్టిక్ ఇండస్ట్రీయల్ క్లస్టర్ ని భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలో అలేరులోని దాతర్ పల్లి గ్రామంలో వంద నుండి నూటయాభై ఎకరాలలో ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని, కాని కేంద్రం ఆ పథకంలో మార్పులు చేయడం వల్ల ప్రాజెక్టు ఏర్పాటులో జాప్యం జరుగుతుందని, దీన్ని నివారించేందుకు సాధ్యమైనంత త్వరగా ఆ పథకానికి సంబంధించిన నూతన విధి విధానాలు ఖరారు చేయాల్సిందిగా కేంద్రమంత్రి సురేష్ ప్రభును కోరానని తెలిపారు. దీనికి స్పందించిన కేంద్ర మంత్రి రెండు నెలలలోపే ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని బూరనర్సయ్య గౌడ్ తెలిపారు. ఈ ప్రాజె క్టు వలన చాలా మంది ఎస్సీ,ఎస్టీ, బీసీ యువకులకు ఉపాధి లభిస్తుందని ఆయన తెలిపారు. మనదేశం చాలా ప్లాస్టిక్ ఉత్పత్తులకోసం చైనా పై ఆధారపడి అక్కడి నుండి దిగుమతి చేసుకుంటుందని, ఈ పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా చైనా దిగుమతులపై ఆధారపడకుండా సొంతగా మనకు కావాల్సిన ప్లాస్టిక్ ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఈ రోజులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉద్యోగాల భర్తీ చాలా పెద్ద సమస్య అని, ఈ ప్రాజెక్టు ఏర్పాటయితే ఈ సమస్యను కొంత వరకు అధిగమించ వచ్చని ఎంపి బూర నర్సయ్య గౌడ్ వెల్లడించారు.




అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు

మన తెలంగాణ/సిరిసిల్లటౌన్: సిరిసిల్ల నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దని త్వరిత గతిన పూర్తయ్యేలా చూడాలని రాష్ట్ర పురపాలక, ఐటి శాఖ మంత్రి కెటిఆర్ అధికారులను ఆదేశించారు. గురువారం నియోజకవర్గంలో ఆకస్మిక పర్యటన చేసి నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తంగళ్లపల్లి మండలంలోని మండెపెల్లి శివారులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డబుల్ బెడ్‌రూంల నిర్మాణాలను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులను పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో ఎలాంటి రాజీలేకుండా నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు.అలాగే ఇంటర నేషనల్ డ్రైవింగ్ స్కూల్‌ను వచ్చే తెలంగాణ ఆవిర్భావ దినో త్సవం వరకు ప్రారంభించాలన్నారు.ఆ దిశగా నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రధా న కూడల్లను పరిశీలించారు.కొత్త చెరువు ప్రాం తంలో నిర్మాణమవుతున్నా పనులను పరిశీలించారు.ఆయన వెంట టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్, డిఆర్వో శ్యాంప్రసాద్, ఆర్డీవోపాండురంగ, మున్సిప ల్ కమిషనర్ కెవి. రమణాచారి,మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని,జడ్పిటిసిలు పూర్మాణి మంజులాలింగారెడ్డి, ఎల్లారెడ్డిపేట జడ్పిటిసి తోటఆగయ్య, పాల్గొన్నారు.

కోడి పందేలను అడ్డుకోవాల్సిందే

ఎపి సర్కార్‌కు హైకోర్టు హెచ్చరిక

మన తెలంగాణ / హైదరాబాద్ : కోడి పందేల్ని అడ్డుకోవాలంటూ గత ఉత్తర్వుల్ని ఇప్పుడైనా అమలు చేయకపోతే అందుకు ప్రభుత్వమే మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని ఏపీ సర్కార్‌ను హైకోర్టు హెచ్చరించింది. 2016 డిసెంబర్‌లో హైకోర్టు ఆదేశాల్ని అధికారులు అమలు చేయకపోవడం వల్లే నేటికీ కోడి పందేలు నిర్వహించి తీరుతామనే ధీమాతో పందెంరాయుళ్లు ఉన్నారని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్,న్యాయమూర్తి జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ అభిప్రాయపడింది. కళ్లు మూసుకున్న పిల్లి తనను ఎవరూ చూడటం లేదన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తే కోర్టు మాత్రం కళ్లు మూసుకుని కూర్చోవని బెంచ్ తేల్చి చెప్పింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం శ్రీరాంపురం, వెంప గ్రామాల్లో సంక్రాంతి పండుగ సంప్రదాయంగా నిర్వహించే కోడి పందేల పేరుతో జూదం, అశ్లీల డ్యాన్స్‌లు ఆఖరికి వ్యభిచారం కూడా జరుగుతోందని, దీనిని అడ్డుకోవాలని కోరుతూ కిలిదిండి రామచంద్ర రాజు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని గురువారం హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. గత ఆదేశాల్ని ఏమేరకు అమలు చేశారో తెలియజేయాలని, ఈసారి ఆ ఉత్తర్వుల్ని కచ్చితం గా అమలు చేయాలని పగో జిల్లాలోని అన్ని మండల తహసీల్దార్లు, ఎస్ఐలు బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. కోడి పందేలు నిర్వహించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీల తరఫున అడ్వకేట్ జనరల్ డి.శ్రీనివాస్ ఇచ్చిన హామీని హైకోర్టు రికార్డు చేసింది. కోర్టు ఆదేశాల్ని ఉల్లంఘిస్తే జిల్లాలోని మొత్తం ఎస్ఐలు, మండల తహసీల్దార్లకు కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేస్తామని బెంచ్ హెచ్చరించింది. గత ఏడాది ఎందు కు చర్యలు తీసుకోలేదో ప్రభుత్వ న్యాయవాది సూటిగా చెప్పకపోవడంతో విచారణ భోజన విరామం తర్వాత తిరిగి చేపట్టింది. జిల్లాలోని మండల తహసీల్దార్లకు, ఎస్ఐలకు కోర్టు ఆదేశాలు ఎందుకు అమలు చేయలేదో వివరణ కోరుతూ నోటీసులు ఇచ్చామని ఏజీ చెప్పడంతో బెంచ్ శాంతించింది. కోడి పందేలు వంద కోట్ల రూపాయలు వరకూ కాస్తున్నట్లు వార్తలు వస్తుంటే ఏపీ ప్రభుత్వం పందెంరాయుళ్ల నుంచి రూ. పది లక్షల లోపు స్వాధీనం చేసుకున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందని బెంచ్ వ్యాఖ్యానించింది. కోడి పందేలు చూసేందుకు, ఆడేందుకు వెళ్లే వారి కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నారంటే.. ఆఖరికి తిరుపతి వంటి దూరప్రాంతాల నుంచి కూడా వెడుతున్నారంటే అధికారులు ఏంచర్యలు తీసుకున్నారో అర్థం కావడం లేదని బెంచ్ ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఉభయగోదావరి జిల్లాల నుంచి కృష్ణా గుంటూరు జిల్లాలకు పాకిన కోడి పందేలు ఇప్పుడు విశాఖ జిల్లా వరకూ చేరిందని,



అధికారులు కళ్లు మూసుకుని ఉంటే ఏటేటా ఒకో జిల్లా పెరిగే అవకాశం ఉందని బెంచ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఆఖరిని ఏపరిస్థితి తీసుకొచ్చారంటే కోడి పుంజుల్ని స్వాధీనం చేసుకోవద్దని సుప్రీంకోర్టు చెబితే కోడి పందేలకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చినట్లు వక్రభాష్యం చెబుతున్నారని బెంచ్ పేర్కొం ది. ఈసారైనా కోడిపందేలు నిర్వహించకుండా ముందు నుంచే అధికారులు బరులు (కోడి పందేలు నిర్వహించే కోర్టు) ఏర్పాటు చేయకుండా, నిర్వహకుల్ని గుర్తించి ముందస్తు హెచ్చరికలు చేయడం వం టి చర్యలు తీసుకోవాలని బెంచ్ ఏపీ ప్రభుత్వానికి తేల్చిచెప్పింది. కో ర్టు ఆదేశాలు ఏముందిలే అని తేలిగ్గా తీసుకుంటే ప్రజలకు కోర్టులం టే గౌరవం సన్నగిల్లుతుందని, పందెం రాయుళ్లకు భరోసా మరింత పెరిగే ప్రమాదం కూడా ఉందని హైకోర్టు హెచ్చరించింది. విచారణ 29కి వాయిదా పడింది.

అయూబ్‌ఖాన్‌పై పిడియాక్ట్ చెల్లదు : హైకోర్టు

జైలు నుంచి విడుదల


మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: కరుడుగట్టిన పాతబస్తీకి చెందిన రౌడీషీటర్ అయూబ్ ఖాన్‌పై నగర పోలీసులు పెట్టిన పీడీయాక్ట్ చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఆరు నెలల నుంచి పీడీయాక్ట్ కింద చంచల్‌గూడ జైలులో ఉన్న అయూబ్‌ఖాన్ గురువారం విడుదలయ్యారు. రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోకుండా తరచూ నేరాలకు పాల్పడుతున్న వారిపై నగర పోలీసులు పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆరు నెలల క్రితం అయూబ్‌ఖాన్‌పై పీడీయాక్ట్ పెట్టి జైలుకు పంపించారు. అయితే తనపై అక్ర మంగా పీడీయాక్ట్ ప్రయోగించారని అయూబ్‌ఖాన్ హైకోర్టులో తన న్యాయవాది ద్వారా పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై వాదోపవాదాలు జరిగిన అనంతరం అయూబ్‌ఖాన్‌పై పీడీయాక్ట్ చెల్లదని హైకోర్టు స్పష్టచేయడంతో అతని విడుదలకు మార్గం సుగమమైంది.

మన తెలంగాణ
12
హైదరాబాద్
శుక్రవారం
5, జనవరి 2018
www.manatelangana.news

ఆస్ట్రేలియా ఓపెన్‌కు ముర్రే దూరం



మెల్‌బోర్న్: త్వరలో జరిగే ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ నుంచి బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే తప్పుకున్నాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించనందున సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ నుంచి తప్పుకుంటున్నట్టు ముర్రే ఒక ప్రకటనలో వెల్లడించాడు. కిందటి ఏడాది వింబుల్డన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్ పోరులో గాయం వల్ల మధ్యలోనే తప్పుకున్న ముర్రే ఇప్పటి వరకు మళ్లీ బరిలోకి దిగలేదు. కొత్త ఏడాది అతను మళ్లీ రాకెట్ చేతపట్టి బరిలోకి దిగుతాడని ఆశించిన అభిమానులకు నిరాశే మిగిలింది. ఇప్పటికే బ్రిస్బేన్ ఓపెన్ నుంచి కూడా ముర్రే తప్పుకున్న విషయం తెలిసిందే. తాజాగా ప్రతిష్ఠాత్మకమైన ఆస్ట్రేలియా ఓపెన్‌కు కూడా దూరమయ్యాడు. వంద శాతం ఫిట్‌నెస్‌తో లేక పోవడం వల్లే తాను బరిలో నుంచి తప్పుకున్నానని ముర్రే స్పష్టం చేశాడు. త్వరలోనే మళ్లీ బరిలోకి దిగుతానని అభిమానులకు హామీ ఇచ్చాడు. కిందటి ఏడాది ప్రారంభంలో పురుషుల ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా ఉన్న ముర్రే వరుస వైఫల్యాలతో నిరాశ పరిచాడు. ప్రస్తుతం అతను 16వ ర్యాంక్‌కు పడిపోయాడు. కాగా దిగ్గజ ఆటగాళ్లు రఫెల్ నాదల్ (స్పెయిన్), రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) రెండేసి గ్రాండ్‌స్లామ్ టోర్నీలు గెలిచి పూర్వ వైభవం అందుకున్నారు. ఈసారి కూడా వీరిద్దరి మధ్య పోటీ నెలకొంది.



హైలెట్స్

ఓవరాల్‌గా ఇరు జట్ల మధ్య జరిగిన టెస్టులు **33**
సౌతాఫ్రికా గెలిచినవి **13**
భారత్ గెలిచినవి **10**
డ్రా అయిన టెస్టులు **13**

సఫారీ గడ్డపై జరిగిన మ్యాచ్‌లు **17**
దక్షిణాఫ్రికా సాధించిన విజయాలు **8**
భారత్ గెలిచినవి **2**

అత్యధిక స్కోర్లు
దక్షిణాఫ్రికా **620/4** (డిక్లేర్డ్)
భారత్ **459**

అత్యల్ప స్కోర్లు
భారత్ **66**
దక్షిణాఫ్రికా **84**

మహా సంగ్రామం

ఆత్మవిశ్వాసంతో భారత్, ఫేవరెట్‌గా సౌతాఫ్రికా, నేటి నుంచి తొలి టెస్టు

కేప్‌టౌన్: అభిమానులు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్న సమయం రానే వచ్చింది. ప్రపంచ క్రికెట్‌లోని రెండు దిగ్గజ జట్ల మధ్య సమరానికి దక్షిణాఫ్రికా వేదికగా నిలువనుంది. మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా భారత్, సౌతాఫ్రికా జట్ల మధ్య తొలి టెస్టుకు శుక్రవారం తెరలేవనుంది. కేప్‌టౌన్‌లో ఈ మ్యాచ్ జరుగనుంది. సొంతగడ్డపై జరుగుతున్న సిరీస్‌లో దక్షిణాఫ్రికా ఫేవరెట్‌గా కనిపిస్తోంది. అయితే కిందటి సీజన్‌లో వరుస సిరీస్‌లతో ప్రపంచ క్రికెట్‌ను శాసించిన టీమిండియా కూడా సఫారీ గడ్డపై కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకుంది. రెండు జట్లలోనూ అగ్ర శ్రేణి క్రికెటర్లు ఉండడంతో సిరీస్ హోరాహోరీగా సాగడం ఖాయం. విరాట్ కోహ్లి కెప్టెన్సీ చేపట్టిన తర్వాత అతనికి ఎదురవుతున్న కఠిన సిరీస్ ఇదే. దీంతో అతను జట్టును ఎలా నడిపిస్తాడనే దానిపై అందరి దృష్టి నిలిచింది. ఇక ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు కూడా సిరీస్‌పై ఎంతో ఆసక్తి కనబరుస్తున్నాయి. రెండు జట్లు కూడా గెలుపే లక్ష్యంగా పెట్టుకోవడంతో అభిమానులకు పసందైన క్రికెట్‌ను చూసే అవకాశం దక్కనుంది.

ఓపెనర్లే కీలకం..

ఈ సిరీస్‌లో భారత్ బ్యాటింగ్‌పైనే భారీ ఆశలు పెట్టుకుంది. ఓపెనర్లు శిఖర్ ధావన్, మురళీ విజయ్, లోకేష్ రాహుల్‌లు అద్భుత ఫాంలో ఉన్నారు. ధావన్ గాయం నుంచి కోలుకుని ఫిట్‌నెస్ సాధించడంతో తొలి టెస్టులో విజయ్‌తో ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశాలు అతనికే అధికంగా ఉన్నాయి. అయితే మ్యాచ్ ప్రారంభానికి ముందు నిర్వహించే ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గితేనే ధావన్‌కు తుది జట్టులో ఛాన్స్ దొరికే అవకాశాలున్నాయి. లేకుంటే పెవిలియన్‌కే పరిమితం కాక తప్పదు. ఇక, మురళీవిజయ్ అద్భుత ఫాంలో ఉన్నాడు. శ్రీలంకతో ఇటీవల జరిగిన టెస్టు సిరీస్‌లో ధావన్ నిలకడైన ఆటతో ఆకట్టుకున్నాడు. అతనిపై జట్టు ఈసారి కూడా భారీ ఆశలు పెట్టుకుంది. బౌన్స్‌కు అనుకూలంగా ఉండే సఫారీ పిచ్‌లపై ఓపెనర్లు శుభారంభం అందిస్తేనే జట్టు భారీ స్కోరు సాధించే అవకాశాలుంటాయి. దీంతో ఈ మ్యాచ్‌లో ఓపెనర్లు కీలకంగా మారారు. ధావన్, రాహుల్‌ల మధ్య ఓపెనర్ల స్థానం కోసం ఆరోగ్యకర పోటీ నెలకొంది. ఛాన్స్ దొరికితే సత్తా చాటేందుకు ఇద్దరు సిద్ధంగా ఉన్నారు. ఇది భారత్ ఎంతో ఊరటనిచ్చే అంశమే.

అందరి కళ్లు కోహ్లిపైనే..

ఇక, కెప్టెన్సీ చేపట్టిన తర్వాత తొలిసారి బలమైన జట్టును ఎదుర్కొనే అవకాశం కోహ్లికి దొరికింది. గతంలో ఆస్ట్రేలియా సిరీస్ మధ్యలో కెప్టెన్సీ అందుకున్న కోహ్లి బ్యాట్స్‌మన్‌గా ప్రకంపనలు సృష్టించాడు. అయితే జట్టును మాత్రం గెలిపించలేక పోయాడు. అయితే తర్వాత జరిగిన అన్ని సిరీస్‌లలో భారత్ జయకేతనం ఎగురవేసింది. విండీస్‌ను వారి గడ్డపైనే ఓడించింది. అంతేగాక శ్రీలంకపై క్లీన్‌స్వీప్ సాధించింది. స్వదేశంలో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, న్యూజిలాండ్, శ్రీలంక, ఇంగ్లాండ్‌లతో జరిగిన సిరీస్‌లలో భారత్ విజయం సాధించింది. అయితే కోహ్లికి అసలైన సవాలు దక్షిణాఫ్రికా సిరీస్‌లోనే ఎదురుకానుందని చెప్పక తప్పదు. బౌన్స్‌కు సహకరించే సఫారీ పిచ్‌లపై భారత్‌ను ముందుకు నడిపించడం అతనికి అంత సులువుకాదు. బ్యాటింగ్‌తో పాటు కెప్టెన్సీలో మెరుగైన ప్రదర్శన ఇవ్వాల్సిన బాధ్యత అతనిపై ఉంది. కిందటి ఏడాది వరుస సెంచరీలు, ద్విశతకాలతో ఎదురులేని శక్తిగా మారిన కోహ్లి దక్షిణాఫ్రికాలో చెలరేగేందుకు తహతహలాడుతున్నాడు. ఇక, మిస్టర్ డిపెండబుల్ చటేశ్వర్ పుజారా, స్టార్ ఆటగాడు అజింక్య రహానెలకు కూడా సిరీస్ ప్రతిష్ఠాత్మకంగా మారింది. బౌన్సీ పిచ్‌లపై నిలకడగా రాణించే క్రికెటర్లుగా వీరిద్దరికి మంచి పేరుంది. ఈసారి కూడా జట్టు వీరిపై భారీ ఆశలే పెట్టుకుంది. వీరిద్దరు చెలరేగితే భారీ స్కోరు సాధించడం భారత్‌కు కష్టమేమి కాదు. రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య, రవిచంద్రన్ అశ్విన్, వృద్ధిమాన్ సాహా, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్‌లు కూడా బ్యాట్‌తో చెలరేగే సత్తా కలిగిన వారే. దీంతో భారత బ్యాటింగ్ చాలా బలంగా ఉంది.


జట్ల వివరాలు:

భారత్: విరాట్ కోహ్లి (కెప్టెన్), మురళీ విజయ్, శిఖర్ ధావన్, లోకేష్ రాహుల్, చటేశ్వర్ పుజారా, అజింక్య రహానె, రోహిత్ శర్మ, వృద్ధిమాన్ సాహా, హార్దిక్ పాండ్య, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, మహ్మద్ షమి, ఇషాంత్ శర్మ, జస్‌ప్రిత్ బుమ్రా, పార్థివ్ పటేల్, ఉమేశ్ యాదవ్, భువనేశ్వర్ కుమార్.

దక్షిణాఫ్రికా: డుప్లెసిస్ (కెప్టెన్), ఎల్గర్, మర్క్రమ్, హాషిం ఆమ్లా, డివిలియర్స్, తెంబా బవుమా, క్వింటన్ డికాక్, ఫెలుక్‌వాయో, కేశవ్ మహారాజ్, కగిసో రగడా, మోర్నీ మోర్కెల్, డేల్ స్టెయిన్, క్రిస్ మోరిస్, ఫిలాండర్, ట్యూనిస్ డి బ్రున్.

పదునైన బౌలింగ్..

ఇక, భారత్ బౌలింగ్‌లోనూ బలంగానే ఉంది. ఫాస్ట్ బౌలర్లకు సహకరించే సఫారీ పిచ్‌లపై స్పీడ్‌స్టర్లు చెలరేగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. సౌతాఫ్రికాకు దీటుగా భారత ఫాస్ట్ బౌలింగ్ లైనప్ ఉంది. ఇషాంత్ శర్మ, ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమి, భువనేశ్వర్ కుమార్, బుమ్రా, హార్దిక్ పాండ్యల రూపంలో అగ్రశ్రేణి ఫాస్ట్ బౌలర్లు భారత్‌కు అందుబాటులో ఉన్నారు. బౌన్స్‌కు సహకరించే పిచ్‌లపై షమి, ఇషాంత్, భువనేశ్వర్‌లు చెలరేగి పోవడం ఖాయంగా కనిపిస్తోంది. బలమైన సౌతాఫ్రికా బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చే సత్తా వీరికుంది. ఈ సిరీస్‌లో భారత్ ప్రధాన అస్త్రంగా బౌలింగ్‌నే నమ్ముకుంది. ఫాస్ట్ బౌలర్లపై జట్టుకు భారీ ఆశలే ఉన్నాయి. ఇషాంత్, షమి, ఉమేశ్‌లు సఫారీ పిచ్‌లపై మెరుగ్గా రాణించడం ఖాయమని విశ్లేషకులు సైతం అంచన వేస్తున్నారు. అంతేగాక అశ్విన్, జడేజాలు కూడా చెలరేగి పోవడం తథ్యమని వారు జోస్యం చెబుతున్నారు.



గెలుపే లక్ష్యంగా..

మరోవైపు ఆతిథ్య సౌతాఫ్రికా జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. సొంత గడ్డపై జరుగుతున్న సిరీస్‌లో దక్షిణాఫ్రికాకే మెరుగైన అవకాశాలున్నాయని చెప్పవచ్చు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సఫారీ జట్టు చాలా బలంగా ఉంది. మోర్నీ మోర్కెల్, స్టెయిన్, ఫిలాండర్, రబడా వంటి మ్యాచ్ విన్నర్ బౌలర్లు దక్షిణాఫ్రికాకు అందుబాటులో ఉన్నారు. బౌన్స్‌కు సహకరించే సఫారీ పిచ్‌లపై వీరిని ఎదుర్కొవడం అనుకున్నంత తేలిక కాదనే చెప్పాలి. ఇక, ఎల్గర్, మర్క్రమ్, హాషిం ఆమ్లా, డివిలియర్స్, డుప్లెసిస్, డికాక్ వంటి ప్రపంచ స్థాయి బ్యాట్స్‌మెన్‌లు ఉండనే ఉన్నారు. ఎటువంటి బౌలింగ్ లైనప్‌ను నైనా చిన్నాభిన్నం చేసే సత్తా వీరికుంది. వీరి నుంచి భారత బౌలర్లకు పెను సవాలే ఎదురుకానుంది. ముఖ్యంగా ఆమ్లా, డివిలియర్స్, కెప్టెన్ డుప్లెసిస్‌ల నుంచి భారత బౌలర్లకు గట్టి పరీక్షే ఎదురుకానుంది. వీరిని కట్టడి చేయడం అనుకున్నంత తేలిక కాదు. అయితే కచ్చితమైన లైన్ అండ్ లెన్త్‌తో బౌలింగ్ చేస్తే వీరిని తక్కువ స్కోరుకే పరిమితం చేయడం కష్టమేమి కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

భారత్‌దే విజయం : ప్రసన్న



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో జరిగే టెస్టు సిరీస్‌లో కోహ్లి సేనకు విజయవకాశాలు అధికంగా ఉన్నాయని భారత మాజీ దిగ్గజం ఎర్రపల్లి ప్రసన్న అభిప్రాయపడ్డారు. గతంతో పోల్చితే భారత జట్టు చాలా బలంగా మారిందన్నాడు. గత ఐదు, ఆరు దశాబ్దాల జట్లతో పోల్చితే ఇంత బలమైన జట్టు ఎప్పుడు లేదన్నారు. తన దృష్టిలో ఇదే అత్యుత్తమ భారత జట్టు అనడంతో సందేహం లేదన్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్ చాలా బలంగా ఉందన్నారు. ఎటువంటి జట్టునైన ఓడించే సత్తా ఈ కోహ్లి సేనకు ఉందని పేర్కొన్నారు. సఫారీ గడ్డపై సిరీస్ గెలవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ఇటీవల కాలంలో టీమిండియా ఎదురులేని శక్తిగా మారిందన్నారు. కోహ్లి సారథ్యం దీనికి అదనపు బలాన్ని ఇచ్చిందన్నారు. సౌతాఫ్రికాను చిత్తు చేసే సత్తా ప్రస్తుత భారత జట్టుకు ఉందన్నారు. నిలకడగా రాణిస్తే సిరీస్‌ను గెలవడం టీమిండియాకు కష్టం కాదన్నారు. కోహ్లి, ధావన్, విజయ్, పుజారా, రహానెల రూపంలో అగ్రశ్రేణి బ్యాట్స్‌మెన్ భారత్‌కు అందుబాటులో ఉన్నారని వివరించారు. అంతేగాక ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలింగ్ లైనప్ భా రత్‌కు అందుబాటులో ఉందన్నారు. షమి, ఉమేశ్, ఇషాంత్, భువనేశ్వర్, బుమ్రా, అశ్విన్, జడేజాలతో కూడిన బౌలింగ్ విభాగంలో ప్రపంచంలోనే అత్యుత్తమైందన్నారు. వీరిని ఎదుర్కొవడం ఎంతటి బ్యాట్స్‌మన్‌కైనా చాలా కష్టమన్నారు.

అందరిపై దృష్టి: ఫిలాండర్



కేప్‌టౌన్: భారత్‌తో జరిగే సిరీస్‌లో తాము ఏ ఒక్కరినో లక్ష్యంగా చేసుకోలేదని, అందరిపై దృష్టి పెట్టామని దక్షిణాఫ్రికా స్పీడ్‌స్టర్ ఫిలాండర్ స్పష్టం చేశాడు. కెప్టెన్ విరాట్ కోహ్లి ఒక్కడే భారత్‌కు కీలకం కాదని, ఆ జట్టులో ఎంతో మంది మ్యాచ్ విన్నర్లు ఉన్నారని తెలిపాడు. 11 మంది ఆటగాళ్లు కూడా ప్రమాదకరమైన వారేనని, ఏ ఒక్కరిని విడిచి పెట్టినా మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేస్తారని అభిప్రాయపడ్డాడు. ఈ సిరీస్ గెలవాలంటే తాము తీవ్రంగా పోరాడక తప్పదన్నాడు. భారత జట్టులో ప్రపంచ స్థాయి బ్యాట్స్‌మెన్, బౌలర్లు ఉన్నారని వివరించాడు. కోహ్లి, రహానె, పుజారా, విజయ్, ధావన్, రాహుల్, రోహిత్ ఇలా ఎవరికి వారే సత్తా కలిగిన వారేనని పేర్కొన్నాడు. వీరి నుంచి తమకు ఎప్పుడూ సవాలు పొంచి ఉంటుందన్నాడు. ఇక బౌలింగ్ కూడా భారత్‌కు అదనపు బలాన్ని ఇస్తుందన్నాడు. షమి, ఇషాంత్, ఉమేశ్, భువనేశ్వర్ తదితరులతో కూడిన బలమైన ఫాస్ట్ బౌలింగ్ లైనప్ భారత్‌కు అందుబాటులో ఉందన్నాడు.

స్టార్లను వదులుకున్నారు

యువీ, ధావన్, గంభీర్‌లకు ఫ్రాంచైజీల షాక్

INDIAN PREMIER LEAGUE

ముంబయి: స్టార్ క్రికెటర్లకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫ్రాంచైజీలు ఊహించని షాక్ ఇచ్చాయి. 2018 సీజన్‌కు గాను చాలా ఫ్రాంచైజీలు తమ స్టార్ క్రికెటర్లను వదులుకున్నాయి. కోల్‌కతా నైట్‌రైడర్స్‌లో అగ్రశ్రేణి ఆటగాడిగా కొనసాగుతున్న గౌతం గంభీర్‌ను ఆ ఫ్రాంచైజీ వదులుకుంది. అదే విధంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ స్టార్ ఆటగాళ్లు యువరాజ్ సింగ్, శిఖర్ ధావన్‌లను అంటిపెట్టుకోవడంలో ఆసక్తి కనబరచలేదు. ఇదే విధంగా కింగ్స్ లెవన్ పంజాబ్ కూడా తమ స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్‌ను వదులుకుంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కూడా విధ్వంసక ఓపెనర్ క్రిస్ గేల్‌ను ఉంచుకునేందుకు ఇష్టపడలేదు. కాగా, రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ ఐపిఎల్‌లో ప్రవేశిస్తున్న చెన్నై సూపర్ కింగ్స్ మాత్రం తమ స్టార్ ఆటగాళ్లు మహేంద్ర సింగ్ ధోని, సురేశ్ రైనా, రవీంద్ర జడేజాలను అంటిపెట్టుకుంది. రాజస్థాన్ రాయల్ కూడా తమ స్టార్ ఆటగాడు స్టీవ్ స్మిత్‌ను ఉంచుకుంది. కోల్‌కతా జట్టు విండీస్ స్టార్లు సునీల్ నరైన్, ఆండ్రీ రసెల్‌లను మాత్రమే అంటిపెట్టుకుంది. గంభీర్, యూసుఫ్ పఠాన్, సాకిబ్ అల్ హసన్ వంటి స్టార్లను పక్కన పడేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ కెప్టెన్ డేవిడ్ వార్నర్, స్పీడ్‌స్టర్ భువనేశ్వర్ కుమార్‌లకు మాత్రమే చాన్స్ ఇచ్చింది. యువరాజ్, ధావన్, విలియమ్సన్ తదితరులను వదులుకుంది. ఢిల్లీ డేర్‌డేవిల్స్ కూడా జహీర్ ఖాన్‌పై ఆసక్తి చూపలేదు. రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, క్రిస్ మోరిస్‌లను అంటిపెట్టుకుంది. కింగ్స్ లెవన్ పంజాబ్ కూడా ఒక్క అక్షర్ పటేల్‌పై మాత్రమే ఆసక్తి కనబరిచింది. చాలా మంది స్టార్లను ఆ జట్టు వదులుకుంది. కాగా, చాలా మంది అగ్రశ్రేణి ఆటగాళ్లను ఆయా జట్లు వదిలి పెట్టడంతో ఈ నెల చివర్లో జరిగే ఐపిఎల్ వేలం పాటపై ఉత్కంఠ నెలకొంది. వేలం పాటలో చాలా మంది స్టార్ క్రికెటర్లు అందుబాటులో ఉండడంతో ఆయా ఫ్రాంచైజీలు ఎవరిని సొంతం చేసుకుంటాయన అంశం ఆసక్తిగా మారింది.

ఆదుకున్న రూట్, మలాన్

సిడ్నీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న చివరి టెస్టులో ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల నష్టానికి 233 పరుగులు చేసింది. గురువారం ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లాండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే ధాటిగా ఇన్నింగ్స్ ప్రారంభించిన ఓపెనర్ స్టోన్‌మన్ 4 ఫోర్లతో 24 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. తర్వాత వచ్చిన విన్స్ 25 పరుగులు చేసి వెనుదిరిగాడు. సమన్వయంతో బ్యాటింగ్ చేసిన ఓపెనర్ కుక్ 39 పరుగులు చేసి ఔటయ్యాడు. దీంతో ఇంగ్లాండ్ 95 పరుగుల వద్దే మూ డు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను కెప్టెన్ రూట్ తనపై వేసుకున్నాడు. అతనికి డేవిడ్ మలాన్ అండగా నిలిచాడు. ఇద్దరు ఆస్ట్రేలియా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన రూట్ 83 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ క్రమంలో నాలుగో వికెట్‌కు 133 పరుగులు జోడించాడు. మలాన్ 55 పరుగులతో క్రీజులో ఉన్నాడు.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.